ఈనాడు
హైదరాబాద్
HMDA

ఆదివారం 20 ఆగస్టు 2017 | 32 పేజీలు



లేత మెరుపు తీగ

సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థినులు మెరిశారు. శనివారం ఆబిడ్స్‌లోని వనితా మహా విద్యాలయంలో జరిగిన ఫ్రెషర్స్‌డే వేడుకలు అదరహో అనేలా సాగాయి.

నాణ్యత.. నిర్దేశించిన పరిమాణం.. సరసమైన ధర... ఇవేవీ... రైలు ప్రయాణికులకు విక్రయించే ఆహార పదార్థాల్లో కనిపించడం లేదు. కాంట్రాక్టు దక్కించుకున్న సరఫరాదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీనికితోడు కొందరు అనధికారికంగా రైళ్లలో ప్రవేశించి నాణ్యతలేని ఆహారాన్ని అందించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రయాణికులకు అనారోగ్యాన్ని మిగులుస్తున్నారు. ఈ అంశంపై 'కాగ్' తప్పు పట్టాక రంగంలోకి దిగిన రైల్వే అధికారులకు అనేక విస్తుపోయే పరిస్థితులు కనిపించాయి.

తినడం కష్టం... తిన్నామా నష్టం!



- రైళ్లలో ఆహారమా మజాకానా
- నాణ్యత లేమి... కల్తీలమయం
- తనిఖీల్లో తేలుతున్న నిజాలు

ఈనాడు - హైదరాబాద్

ఆహార సరఫరా తీరుపై రైల్వే అధికారులు జులై 26 నుంచి ఆగస్టు 16వరకు వివిధ రైల్వే స్టేషన్లు, రైళ్లలో తనిఖీలు చేపట్టారు. దాదాపు వెయ్యి కేసులు నమోదు చేశారు. వీటిలో సగానికి పైగా సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్లలోనివే. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఆగిన ప్రతి బండినీ పరిశీలించగా ప్రయాణికులు ఎలా దోపిడీకి గురయ్యారో తేలింది. పరిశుభ్రత పాటించకపోవడం, పరిమాణం తక్కువగా ఉండటం, నాణ్యత లేకపోవడం.. పాడైపోవడానికి సిద్ధంగా ఉన్న ఆహారం అందించడం... ఇలా గుత్తేదారులు నిబంధనలు ఉల్లంఘించిన తీరు కళ్లకు కట్టాయి. ఇవన్నీ ఒకెత్తయితే ఎవరుపడితే వారు ఇళ్లలో, కాకా హోటళ్లలో వండిన పదార్థాలను తీసుకువచ్చి అమ్మేస్తున్నారు. అటు అమ్మకం దారులకు, ఇటు గుత్తేదారులకు రూ. లక్షల్లో అధికారులు జరిమానాలు విధించారు.

నిర్లిప్తంగా వ్యవహరిస్తే అంతే..

రైళ్లలో సరఫరా అవుతున్న ఆహారం గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిదని కొంతమంది సరిపుచ్చుకుంటారు. రోజూ తింటామా? ప్రయాణం సాఫీగా సాగిపోతే అదే పదివేలు అని భావిస్తుంటారు. సరిగ్గా ఇటువంటి నిర్లిప్త ధోరణే ఇప్పుడు రైళ్లలో భోజనాలు పెట్టేవారికి

...మిగతా 2లో

934
దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 22 రోజుల్లో నమోదైన కేసులు

రూ.7.30లక్షలు
అమ్మకందారులకు విధించిన జరిమానా

రూ.9.04లక్షలు
గుత్తేదారులకు విధించిన జరిమానా

ఫిర్యాదు చేయండి

రైల్వే బోర్డు నిర్ణయించిన ధరలు నాలుగైదేళ్ల క్రితానివి అయినప్పటికీ.. ఆ నిబంధనల ప్రకారమే ఆహారం సరఫరా చేస్తామని ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలు ఇప్పుడు పట్టించుకోవడం లేదు. రెట్టింపు ధరలకు అమ్మేస్తున్నారు. ఫిర్యాదులందినా అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. ప్రతి ఆహార ప్యాకెట్‌పైనా సరఫరా చేస్తున్న సంస్థ పేరు.. రిజిస్టర్ నంబరు.. ఎన్ని గ్రాములు ఉంది తదితర వివరాలతో పాటు తేదీ ఉండాలి. సరఫరా కాంట్రాక్టు పొందిన సంస్థలు కొంతమంది ప్రైవేటు వ్యక్తులను ప్రోత్సహించగా.. మరికొందరు అనుమతి లేకుండానే విక్రయిస్తున్నారు. ఇలాంటి సమస్యలపై *1800111321, 18004255090* టోల్ ఫ్రీతోపాటు *138* నంబరుకు ఫిర్యాదు చేయొచ్చని రైల్వే వర్గాలు చెబుతున్నాయి.

తినడం కష్టం.. తిన్నామా నష్టం!

(మొదటి పేజీ తరువాయి) వరమవుతోంది. నాసిరకం ఆహారం ప్రయాణికులకు అందుతోంది. జులై 25న రాజధాని ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులు ఇటువంటి ఆహారంతో సర్దుకుపోలేదు. హజ్రత్ నిజాముద్దీన్(దిల్లీ) నుంచి బెంగళూరు వెళ్లే ఈ ప్రయాణికులు సికింద్రాబాద్‌లో రైలును గంటసేపు ఆపి ఆందోళనకు దిగారు. అధికారులు రంగంలోకి దిగి సర్దుబాటు చేశారు. ఇటీవల కాచిగూడ రైల్వే స్టేషన్‌లో క్యాంటీన్‌లో కొన్న ఆహారంలో బొద్దింక కనిపించింది. ఈ నేపథ్యంలో ఆహారం ఎలా ఉండాలనేదానిపై అందరిలో చర్చ జరుగుతోంది. దాదాపు 97 పదార్థాలకు స్టేషన్లలో విక్రయించాల్సిన ధర, రైళ్లలో అందించాల్సిన ధరలను రైల్వేబోర్డు నిర్ణయించింది. వాటిలో కొన్నింటి పరిమాణం, ధరలు ఇలా ఉన్నాయి. వీటికి 18 శాతం జీఎస్టీ వర్తిస్తుంది.

పరిమాణం	క్యాంటీన్‌లో ధర(రూ.లలో)	రైళ్లలో
2 ఇడ్లీలు(60గ్రా),చట్నీ/సాంబారు(40గ్రా)	12.00	14.00
2 మసాలావడలు(60గ్రా), చట్నీ(40గ్రా)	16.00	18.00
లీటరు తాగునీటి సీసా	15.00	15.00
రెండు వడలు(60గ్రా), పెరుగు(100గ్రా)	14.00	16.00
రెండు సమోసాలు(60 గ్రా.), సాస్/చట్నీ	16.00	18.00
టమోటా సూప్(150ఎంఎల్), మిరియాల పొడి	15.00	18.00
వెజ్ బిర్యానీ/పలావు (200గ్రా)	42.00	49.00
200 గ్రాముల వెజ్ ఫ్రైడ్‌రైస్	32.00	37.00

ఆక్రమణలవుతున్నా.. స్పందించరా?

● వార్డుల వారీగా కమిటీల ఏర్పాటులో విఫలం

● జీహెచ్ఎంసీ... ట్రాఫిక్... రవాణాశాఖలపై లోకాయుక్త ఆగ్రహం

ఈనాడు, హైదరాబాద్

'హైదరాబాద్‌లో పాదచారులకు కాలిబాటలు అంతంతమాత్రం. ఉన్నవాటి ఆక్రమణలపై స్పందించరు... స్పందించామంటూ నివేదికలు పంపిస్తున్నారు. ఇందుకు సంబంధించిన కేసులూ చూపిస్తున్నారు. ఏళ్ల తరబడి ఇదే తీరు. పాదచారుల హక్కులపై పలు సంఘాల ప్రతినిధులు వివిధ సందర్భాల్లో ఫిర్యాదులు చేశారు. వాటికి సంబంధించిన కార్యాచరణ మీ దగ్గర ఉండదు. ఫలానా ప్రాంతంలో ఆక్రమణలున్నాయని, వాటిపై కేసులు నమోదు చేశామంటూ చెబుతున్నారు. చాలాచోట్ల ఫుట్‌పాత్‌లున్నా అవి అలంకార ప్రాయమే. పాదచారులు వాటిపై వెళ్లే పరిస్థితులు లేవు. వీటిలో కొన్నింటినైనా పరిష్కరించేందుకు వీలుగా ప్రతి వార్డులో కార్పొరేటర్ ఛైర్మన్‌గా ఒక కమిటీని వేయాలంటూ ఆదేశిస్తే... ఏడాదైనా ఏర్పాటు చేయలేదు. పాదచారులు స్వేచ్ఛగా రహదారులపై వెళ్లేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించండి'

- జీహెచ్ఎంసీ, ట్రాఫిక్, రవాణాశాఖ అధికారులను ఉద్దేశించి లోకాయుక్త జస్టిస్ సుభాషణ్ రెడ్డి చేసిన వ్యాఖలివి....

నగరంలో రహదారులు దాటాలంటే పాదచారులు భయపడుతున్నారని తెలిసినా... వాహన చోదకులు మితిమీరిన వేగంతో వెళ్తున్నారంటూ 'రైట్ టు వాక్ ఫౌండేషన్' ప్రతినిధులు కాంతిమతి కన్నన్, ఒ.ఎం.డెబారా లోకాయుక్తకు చేసిన ఫిర్యాదులపై సుభాషణ్‌రెడ్డి పైవిధంగా స్పందించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని రహదారులపై నడిచే హక్కు పాదచారులకు ఉందని, ఇందుకు అనుగుణంగా కచ్చితంగా చర్యలు తీసుకున్నామంటూ నివేదికలను సమర్పించాలంటూ ఆయన ఆదేశించారు.



కాలిబాటలు ఆక్రమించి దుకాణాలు

ఆక్రమణలు.. ప్రమాదాలు... పరిష్కారాలు..

నగరంలో ప్రయాణికులు, పాదచారులకు ఉపయోగపడుతున్న ప్రధాన, అనుసంధాన రహదారులు ఆక్రమణల పాలవుతున్నాయంటూ పదేళ్ల నుంచి లోకాయుక్తకు పలు స్వచ్ఛంద సేవా సంస్థలు, వ్యక్తులు, ప్రతినిధులు వేర్వేరుగా ఫిర్యాదులు చేస్తున్నాయి. జాతీయ, అంతర్జాతీయ నిబంధనలు, ప్రజారవాణా మార్గదర్శకాల ప్రకారం రహదారులపై పాదచారులు నడిచేందుకు ఫుట్‌పాత్‌లు ఉండాలని ఫిర్యాదుల్లో పేర్కొంటున్నాయి. ఆబిడ్స్, కోఠి, సికింద్రాబాద్ వంటి రద్దీ ప్రాంతాల్లో పాదచారులు నడిచేందుకు ఒక్కచోటా ఫుట్‌పాత్ లేదని, వాణిజ్య ప్రాంతాల్లో దుకాణాల నిర్వాహకులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని వాహనాలను ఉంచడం లేదా వినియోగదారుల వాహనాలను అక్కడ ఉంచే సదుపాయం కల్పిస్తున్నాయి. ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని లోకాయుక్త ట్రాఫిక్, జీహెచ్ఎంసీ అధికారులకు తాఖీదులు ఇవ్వడంతో పాటు ఫలానా తేదీన నివేదికలను సమర్పించాలంటూ ఆదేశాలు జారీ చేస్తోంది. నివేదికలను సమర్పించేటప్పుడు వివరాలున్నా... సమస్యలు పరిష్కారం కావడం లేదని లోకాయుక్తను ఆశ్రయించిన ప్రతినిధులు తిరిగి లోకాయుక్తకు వాస్తవ పరిస్థితిని వివరిస్తున్నారు. రహదారులపై నమోదవుతున్న ప్రమాదాల్లో గాయపడుతున్న, మరణిస్తున్న వారిలో రెండోస్థానం పాదచారులదేనంటూ పోలీసులు తెలిపిన గణాంకాలనే లోకాయుక్త దృష్టికి తీసుకెళ్తున్నారు. ఒక్కో ఫిర్యాదును క్షుణ్నంగా పరిశీలిస్తున్న జస్టిస్ సుభాషణ్‌రెడ్డి... పోలీస్, జీహెచ్ఎంసీ అధికారుల తీరును ప్రశ్నిస్తున్నారు. గడువులోగా పనులు చేయాలంటున్నారు.

నెలకోసారి సమావేశం... కార్యాచరణ

రహదారులపై ఆక్రమణల తొలగింపు, ఫుట్‌పాత్ నిర్వహణపై ప్రతి వార్డుకూ ఒక కమిటీ వేస్తే ప్రయోజనం ఉంటుందని సుభాషణ్‌రెడ్డి కొద్దినెలల క్రితం తన అభిప్రాయాన్ని జీహెచ్ఎంసీ కమిషనర్‌కు తెలిపారు. వార్డు కార్పొరేటర్ అధ్యక్షుడిగా ఒక కమిటీని ఏర్పాటు చేసి సభ్యులుగా జీహెచ్ఎంసీ నుంచి సంబంధిత ప్రాంత ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, సిటీప్లానర్, ట్రాఫిక్ విభాగం నుంచి ఏసీపీ లేదా ఇన్‌స్పెక్టర్ నియమించాలని సూచించారు. ఈ కమిటీ నెలకోసారి సమావేశమై వార్డు లేదా డివిజన్ పరిధిలో ఫుట్‌పాత్‌ల నిర్వహణ, ఆక్రమణలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు చేపట్టాలంటూ మేయర్, జీహెచ్ఎంసీకి నివేదికలను ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. డివిజన్‌లోని ప్రతి ప్రాంతంలోనూ పాదచారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో పెరిగే వాహనాలు, ఫుట్‌పాత్‌ల ఏర్పాటుపై విదేశాలను అనుసరిస్తున్న విధానాలను మనకు అనుగుణంగా మార్చుకుని అమలు చేయాలని జీహెచ్ఎంసీ, ట్రాఫిక్, రవాణా శాఖ అధికారులకు ప్రత్యేకంగా సూచనలిచ్చారు.

ప్రయాణంలో ప్రాణ సంకటం



బహదూర్‌పుర రోడ్డులో ఓ ఆటో ట్రాలీలో ఇనుప రాడ్లను ఎలాంటి రక్షణ ఏర్పాట్లు లేకుండా ప్రమాదకరంగా తరలిస్తున్న దృశ్యం

పోలీసుల అదుపులో మాజీ మావోయిస్టు నేత

నాగారం: పీపుల్స్‌వార్ ఉమ్మడి మెదక్ జిల్లా కార్యదర్శిగా పనిచేసిన అనంతరం ఛత్తీస్‌గఢ్-ఒడిశా రాష్ట్రాల మావోయిస్టు కేంద్రకమిటీలో పనిచేసి 2014లో ప్రభుత్వానికి లొంగిపోయిన శ్రీరాముల శ్రీనివాస్ అలియాస్ సుదర్శన్‌ను సిద్దిపేట పోలీసులు అదుపులో తీసుకున్నారు. ప్రస్తుతం భార్య విమలతో కలిసి మేడ్చల్ జిల్లా కీసర మండలం నాగారంలో ఉంటున్న శ్రీరాములును శనివారం అదుపులోకి తీసుకున్నామని సిద్దిపేట ఏసీపీనర్సింహారెడ్డి 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ఇతనిపై గతంలో కేసులు ఉన్నందున విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. పోలీసులకు లొంగిపోకముందు ఒక కొరియర్ ద్వారా ఆరు తుపాకులు కొనుగోలు చేసినట్లు ఇతనిపై ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల సిద్ధిపేట జిల్లాలో కొంతమంది మాజీ మావోయిస్టులను విచారించగా ఇతని పేరును వెల్లడించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఐదు తుపాకులను స్వాధీనం చేసుకోగా మరో తుపాకి ఆచూకీ కోసం విచారించేందుకు శ్రీరాములును తీసుకువెళ్లినట్లు తెలుస్తోంది. శ్రీరాములు ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర మహాజన సమాజం అనే పార్టీని ఏర్పాటు చేశారు.



సుదర్శన్

చిట్టీ వ్యాపారుల హల్‌చల్

● ఒంటరి మహిళపై దాడి

ఘట్‌కేసర్: నగరశివారులో వడ్డీ వ్యాపారుల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళలను వ్యాపారులు(దంపతులు) చితకబాది, ఆమె మెడలో ఉన్న పుస్తెల తాడును తెంపేశారు. బాధితురాలు, పోలీసుల వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మండలం పోచారం పరిధి అన్నోజిగూడలో ఉంటున్న స్వర్ణ(32) శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు ఇంట్లో ఒంటరిగా ఉంది. ఘట్‌కేసర్‌కు చెందిన ప్రైవేట్ చిట్టీ వ్యాపారులు పైళ్ల అండాల్, ఆమె భర్త కృష్ణారెడ్డి స్వర్ణ ఇంటికి వెళ్లారు. ఆమె భర్త తమకు చిట్టీ డబ్బులు ఇవ్వాలని అడిగారు. తన భర్త ఉన్న సమయంలో వచ్చి అడగాలని స్వర్ణ సూచించింది. ఆగ్రహానికి గురైన వ్యాపారులు ఆమెపై దాడి చేసి మెడలో ఉన్న బంగారు గొలుసును లాగే ప్రయత్నంలో అది తెగిపోయింది. ఆమె తన భర్తకు చరవాణి ద్వారా వివరిస్తుండగా దాన్ని ధ్వంసం చేశారు. నీ భర్త అంతు చేస్తామని బెదిరించి వెళ్లిపోయారు. స్వర్ణ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సుమారు రూ.30లక్షల సొత్తు చోరీ

అల్వాల్: బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగి ఇంటి తాళాలు పగులగొట్టి రూ.30 లక్షల విలువైన సొత్తును దొంగలు ఎత్తుకెళ్లిన ఘటన అల్వాల్ ఠాణాపరిధిలో చోటు చేసుకుంది. వివరాలు పోలీసులు, బాధితుడి కథనం ప్రకారం.. సిటిజన్ కాలనీలోని రోడ్డు నంబరు3లో నివసించే నాగేశ్వరరావు కొన్నేళ్ల క్రితం బీఎస్ఎన్ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా పదవీ విరమణ చేశారు. పిల్లలందరూ అమెరికాలో స్థిరపడ్డారు. వారు ఇటీవల ఇక్కడికి రావడంతో బ్యాంకు లాకర్‌లో ఉన్న సుమారు 100 తులాల బంగారు ఆభరణాలను ఇంటికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో ఆయన పిల్లలు తిరిగి అమెరికా వెళ్లిపోయినా నాగేశ్వరరావు దంపతులు ఆ ఆభరణాలను లాకర్లో దాచకుండా ఇంట్లోనే దాచారు. శనివారం మధ్యాహ్నం నాగేశ్వరరావు దంపతులు ఇంటికి తాళం వేసి తెలిసిన వారి వద్దకు వెళ్లి తిరిగి 5 గంటలకు వచ్చారు. ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు లోపలి నుంచి గడియ పెట్టి వెనుక ద్వారం గుండా సొత్తుతో పరారైయ్యారని గుర్తించారు. నాగేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు.





ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన రాష్ట్రస్థాయిలో పోటీల్లో 'ఈనాడు' ఫొటోగ్రాఫర్లు పలు బహుమతులు సాధించారు. శనివారం మాదాపూర్ స్టేట్‌ఆర్ట్ గ్యాలరీలో నిర్వహించిన కార్యక్రమంలో సమాచార శాఖ కమిషనర్ నవీన్ మిత్తల్, ప్రెస్ అకాడమీ ఛైర్మన్ అల్లం నారాయణ చేతుల మీదుగా పద్మావతి, కుంట్ల శ్రీనివాస్, ఎం.రమేశ్ బహుమతులు అందుకున్నారు.

ప్రతిభకు పట్టం




తెలంగాణ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ నిర్వహించిన పోటీల్లో 'ఈనాడు' ఫొటోగ్రాఫర్లు పలు బహుమతులు పొందారు. రవీంద్రభారతిలో ఎంపీ కవిత చేతుల మీదుగా ఆవుల శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్ జ్ఞాపికలు అందుకున్నారు.

పది రోజుల్లోనే కట్టేశారు!

ఒలిఫెంటా దగ్గర మెట్రో స్టీలు వంతెన పూర్తి ● 271 అడుగుల దూరం స్పాన్ బిగింపు



మెట్రో స్టీలు వంతెన కిందుగా వెళ్తున్న రైలు

ఈనాడు, హైదరాబాద్

మెట్రోరైలు పనుల్లో మరో ఇంజినీరింగ్ సవాల్‌ను నిర్మాణ సంస్థ విజయవంతంగా అధిగమించింది. ఒలిఫెంటా రైల్వే వంతెనపై మెట్రో రైలు స్టీలు బ్రిడ్జి శనివారం తెల్లవారుజామున సురక్షితంగా పట్టాలు దాటించి, స్తంభాలపై బిగించారు. నాగోల్ నుంచి మెట్టుగూడ వరకు మెట్రో రెండేళ్ల క్రితమే పూర్తయింది. అయినా సికింద్రాబాద్ వరకు అనుసంధానానికి ఒలిఫెంటా ఆర్వోబీ ప్రధాన అడ్డంకిగా ఉండేది. ఇప్పుడు వంతెన పూర్తవడంతో నవంబరు ఆఖరులో ప్రధాని చేతుల మీదుగా మెట్రో ప్రారంభించేందుకు చేస్తున్న పనులు ఊపందుకున్నాయి.

మెట్రో కారిడార్లలో రైల్వే లైన్లపై నిర్మించిన ఆర్వోబీలకు ఒలిఫెంటా పూర్తి భిన్నం. ఇక్కడ దాదాపు 83 మీటర్ల దూరం మధ్యలో ఎలాంటి మద్దతు లేకుండా ఆర్వోబీ నిర్మించాల్సి వచ్చింది. అందుకే స్టీలు వంతెనను ప్రతిపాదించారు. ఈ స్టీలు వంతెనను ఉత్తరప్రదేశ్ జిల్లా ఘజియాబాద్‌లో తయారు చేయించారు. అనంతరం భాగాలుగా విడదీసి హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. ఇక్కడ ఒలిఫెంటా బ్రిడ్జి సమీపంలోని రైల్వే స్థలంలో కొద్దినెలలుగా విడి భాగాలను కలుపుతూ వంతెన తయారు చేశారు. దీన్ని ఒలిఫెంటా బ్రిడ్జికి అటుఇటు 272 అడుగుల దూరంలో నిర్మించిన స్తంభాలపైకి సురక్షితంగా చేర్చారు. 1,100 టన్నుల బరువు, 57 అడుగుల వెడల్పు, 35 అడుగుల ఎత్తులో ఎలాంటి ప్రమాదాలకూ ఆస్కారం లేకుండా విజయవంతంగా బిగించారు. రైల్వే అనుమతి ఇచ్చిన అర్ధరాత్రి వేళల్లో కొద్ది రోజులుగా జాక్స్, క్రేన్లు, విదేశాల నుంచి ప్రత్యేకంగా దిగుమతి చేసుకున్న రోలర్ల సహాయంతో అడుగు అడుగు జరుపుతూ శనివారం ప్రక్రియను పూర్తి చేశారు. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ముందు జాగ్రత్తగా ఆ మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

272 అడుగులు	స్పాన్ పొడవు (ప్రధాన వంతెన)
60 అడుగులు	రహదారి నుంచి ఎత్తు
42 అడుగులు	రైలు ట్రాక్ నుంచి ఎత్తు
656 అడుగులు	స్టీలు వంతెన పొడవు
100 టన్నులు	తోసే జాక్ సామర్థ్యం
400 టన్నులు	పైకి ఎత్తే లిఫ్టింగ్ సామర్థ్యం

సరికొత్త రికార్డు - ఎన్వీఎస్‌రెడ్డి, ఎండీ, హెచ్ఎంఆర్

స్టీలు వంతెనలను నదులు, కొండల్లో నిర్మిస్తుంటారు. అక్కడ జన సంచారం ఉండదు కాబట్టి నిర్మాణం సులువే. రద్దీగా ఉండే సికింద్రాబాద్ వంటి చోట్ల ఎంతో క్లిష్టం. అయినా 10 రోజుల్లోనే పూర్తి చేయడం సరికొత్త రికార్డు. మరో 15 రోజుల్లో స్టీలు వంతెనను వయడక్ట్‌తో కలిపి ట్రాక్ పనులు పూర్తిచేస్తాం.





ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం దివ్యాంగులకు సహాయకారిగా మారింది. నడవలేని ఓ యువకుడు చక్రాల కుర్చీకి సాంకేతికతను జోడించి... నల్లకుంటలో రహదారిపై ఇలా సాగిపోతున్నాడు...

కెనరా బ్యాంక్

A R M బ్రాంచ్,
3-5-879, రూబి హౌస్, 2వ అంతస్తు, ఓల్డ్ ఎం. ఎల్. ఏ. క్వార్టర్స్ ఎదుట, హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500029

ఇ-వేలం ప్రకటన

సెక్యూరిటి ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్స్ 8 (6) & (9) క్రింద ఇ-వేలం (ఆన్‌లైన్ వేలం) ద్వారా స్థిరాస్తుల యొక్క అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటి ఇంటరెస్ట్ యాక్ట్ 2002 మరియు సెక్యూరిటి ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002యొక్క నిబంధనల క్రింద స్వాధీనపర్చుకోబడిన, దిగువ వివరించబడిన స్థిరాస్తులు దిగువ తెలిపిన నియమనిబంధనల ప్రకారం ఇ-వేలం ద్వారా విక్రయించబడునని ఆ మేరకు ఇందుమూలముగా తెలియజేయడమైనది. వెబ్ సైట్ **https://canarabank.auctiontiger.net** ద్వారా సర్వీస్ ప్రొవైడర్ M/s e-ప్రొక్యూర్‌మెంట్ టెక్నాలజీస్ లిమిటెడ్‌చే ఇ-వేలం ఏర్పాటు చేయబడును.

ఇ-వేలం తేది మరియు సమయం : 26-9-2017 - ఉ. 10.30 గం.ల నుండి 11.30 గం.ల వరకు (అమ్మకం పూర్తి అయ్యేంతవరకు ఒక్కొక్కటి 5 నిమిషాల వ్యవధిగల అపరిమిత పొడిగింపులతో)

క్రమ సంఖ్య	రుణగ్రహీత/గ్యారంటర్ పేరు	మొత్తం బకాయిలు	హామీగల ఆస్తుల వివరము	రిజర్వు ధర	ధరావతు (రూ. లక్షల్లో)
1.	**శ్రీమతి బండారుపల్లి నాగరాజ** W/o బి. కోటేశ్వర రావు, R/o బి.వి. రావు నగర్, పౌల్ట్రీ కాంప్లెక్స్, చట్టాన్‌పల్లి గ్రామం, ఫరూఖ్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం-509216. **శ్రీ ఎం. రాజేంద్ర ప్రసాద్ (గ్యారంటర్)** S/o ఎం. వెంకట్ రావు, R/o బి.వి. రావు నగర్, పౌల్ట్రీ కాంప్లెక్స్, చట్టాన్‌పల్లి గ్రామం, ఫరూఖ్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం-509216.	**30-6-2017** నాటికి రూ. **50,66,507.57 + 1–7–2017** నుండి చెల్లింపు తేదీ వరకు వర్తింపజేయని వడ్డీ, బ్యాంకు ఛార్జీలు మరియు ఖర్చులు.	శ్రీమతి బి. నాగరాజ, W/o శ్రీ బి. కోటేశ్వర రావు పేరిట ఉన్న, తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లా, ఫరూఖ్‌నగర్ మండలం, చట్టాన్‌పల్లి గ్రామం వద్ద సర్వే నెం. 594లో కమర్షియల్ పౌల్ట్రీ ఫార్మ్ షెడ్స్ మరియు ఫీడ్ గోడౌన్ తో ఎక. 0.38 గుం. విస్తీర్ణంగల భూమి యావత్తు. దీని సరిహద్దులు:- ఉత్తరం: సర్వే నెం. 594 లోని భూమి, దక్షిణం: సర్వే నెం. 594 లోని భూమి, తూర్పు: రోడ్డు, పడమర: సర్వే నెం. 595 లోని భూమి.	**రూ. 39,08,000/-**	**రూ. 3,90,800/-**
2.	శ్రీ గద్దె సింహారావు **(రుణగ్రహీత I)** S/o. తిరుపతయ్య R/o. B.V. రావు నగర్, పౌల్ట్రీ కాంప్లెక్స్, చట్టాన్‌పల్లి గ్రామం, ఫరూఖ్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం-509216. శ్రీమతి **G.** సుమతి (గ్యారంటరు) W/o. గద్దె సింహారావు, R/o. B.V. రావు నగర్, పౌల్ట్రీ కాంప్లెక్స్, చట్టాన్‌పల్లి గ్రామం, ఫరూఖ్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం-509216. శ్రీ మక్కపాటి నాగ మల్లేశ్వర రావు (గ్యారంటరు) S/o. వెంకట్ రావు, R/o. B.V. రావు నగర్, పౌల్ట్రీ కాంప్లెక్స్, చట్టాన్‌పల్లి గ్రామం, ఫరూఖ్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం-509216. శ్రీమతి **G.** సుమతి **(రుణగ్రహీత II)** W/o. గద్దె సింహారావు, R/o. B.V. రావు నగర్, పౌల్ట్రీ కాంప్లెక్స్, చట్టాన్‌పల్లి గ్రామం, ఫరూఖ్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం-509216. శ్రీ గద్దె సింహారావు (గ్యారంటరు) S/o. తిరుపతయ్య, R/o. B.V. రావు నగర్, పౌల్ట్రీ కాంప్లెక్స్, చట్టాన్‌పల్లి గ్రామం, ఫరూఖ్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం-509216. శ్రీమతి **M.V.** శివ లక్ష్మి (గ్యారంటరు) W/o. మక్కపాటి నాగ మల్లేశ్వర రావు, R/o. B.V. రావు నగర్, పౌల్ట్రీ కాంప్లెక్స్, చట్టాన్‌పల్లి గ్రామం, ఫరూఖ్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం-509216.	**I)** గద్దె సింహారావు **30-6-2017** నాటికి రూ. **94,56,358/-** **II) G.** సుమతి **30-6-2017** నాటికి రూ. **82,98,820/-** మరియు **+ 1-7-2017** నుండి ఇప్పటివరకు వర్తింపజేయబడని వడ్డీ, బ్యాంకు ఛార్జీలు మరియు ఖర్చులు.	**1)** శ్రీమతి గద్దె సుమతి W/o. శ్రీ గద్దె సింహారావు పేరిట, రంగారెడ్డి జిల్లా, ఫరూఖ్‌నగర్ మండలం, చట్టన్‌పల్లి గ్రామం వద్ద సర్వే నెం. 600/Eలో ఎక- 0.35 గుంటల విస్తీర్ణంగల, కమర్షియల్ లేయర్ షెడ్లు, దాణా గోదాము వగైరాతో భూమితో భూమి యావత్తు, దీని సరిహద్దులు:- ఉత్తరం: సర్వే నెం. 601లోని భూమి. దక్షిణం: సర్వే నెం. 629లోని భూమి, తూర్పు: సర్వే నెం. 600లోని P. రామసుబ్బారావు భూమి, పడమర: సర్వే నెం. 600లో వీరయ్య భూమి.	**రూ. 41,40,000/-**	**రూ. 4,14,000/-**
			2) a) శ్రీ గద్దె సింహారావు S/o. శ్రీ తిరుపతయ్య పేరిట, రంగారెడ్డి జిల్లా, ఫరూఖ్‌నగర్ మండలం, చట్టాన్‌పల్లి గ్రామం వద్ద సర్వే నెం. 599 & 601లో ఎక. 1.00 గుంటల విస్తీర్ణం గల, RCC భవనం, కమర్షియల్ లేయర్ షెడ్లు వగైరాతో గల భూమి యావత్తు, **దీని సరిహద్దులు:– ఉత్తరం:** పెద్దభాయి భూమి, **దక్షిణం:** G. సతీష్ కుమార్ భూమి, **తూర్పు:** రోడ్డు, **పడమర:** రోడ్డు. **b)** శ్రీ గద్దె సింహారావు S/o. శ్రీ తిరుపతయ్య పేరిట, రంగారెడ్డి జిల్లా, ఫరూఖ్‌నగర్ మండలం, చట్టాన్‌పల్లి గ్రామం వద్ద సర్వే నెం. 600/AAలో ఎక. 0.36 గుంటల విస్తీర్ణంగల భూమితోపాటు కమర్షియల్ లేయర్ షెడ్లు వగైరా యావత్తు, దీని సరిహద్దులు:– **ఉత్తరం:** సర్వే నెం. 601లోని భూమి, **దక్షిణం:** సర్వే నెం. 601లోని భూమి, **తూర్పు:** సర్వే నెం. 600లోని భూమి, **పడమర:** సర్వే నెం. 600లోని భూమి. **c)** శ్రీ గద్దె సింహారావు S/o. శ్రీ తిరుపతయ్య పేరిట, రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం, చట్టాన్‌పల్లి గ్రామం వద్ద సర్వే నెం. 632లో ఎక. 0.25 గుంటల విస్తీర్ణంగల భూమితోపాటు కమర్షియల్ లేయర్ షెడ్లు వగైరా యావత్తు, **దీని సరిహద్దులు:– ఉత్తరం:** సర్వే నెం. 632లోని భూమి, **దక్షిణం:** సర్వే నెం. 632లోని భూమి, **తూర్పు:** సర్వే నెం. 631లోని భూమి, **పడమర:** సర్వే నెం. 600లోని భూమి.	**రూ. 95,70,000/-**	**రూ. 9,57,000**
3.	శ్రీ **K.** కుప్పుస్వామి **(రుణగ్రహీత** 1) S/o. K. విశ్వేశ్వర్‌రావు, H.No. 6-41, సర్వే నెం. 601, చట్టాన్‌పల్లి గ్రామం (షాద్‌నగర్), ఫరూఖ్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం-509216. శ్రీమతి కిలారు ఉమాదేవి (గ్యారెంటర్) W/o. K. కుప్పు స్వామి, H.No. 6-41, సర్వే నెం. 601, చట్టాన్‌పల్లి గ్రామం (షాద్‌నగర్), ఫరూఖ్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం-509216. **శ్రీమతి కిలారు ఉమాదేవి (రుణగ్రహీత 2) W/o. K. కుప్పు స్వామి,** H.No. 6-41, సర్వే నెం. 601, చట్టాన్‌పల్లి గ్రామం (షాద్‌నగర్), ఫరూఖ్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం-509216. శ్రీ K. కుప్పు స్వామి (గ్యారంటర్) S/o. K. విశ్వేశ్వర్ రావు, H.No. 6-41, సర్వే నెం. 601, చట్టాన్‌పల్లి గ్రామం (షాద్‌నగర్), ఫరూఖ్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం-509216.	**I. K.** కుప్పు స్వామి **30-6-2017** నాటికి రూ. **1,79,02,660/-** **II. K.** ఉమాదేవి **30-6-2017** నాటికి రూ. **95,08,175/-** మరియు **+ 1-7-2017** నుండి నేటి వరకు వర్తింపజేయబడని వడ్డీ, బ్యాంకు ఛార్జీలు మరియు ఖర్చులు.	**1) శ్రీమతి కిలారు ఉమాదేవి** W/o. శ్రీ కిలారు కుప్పు స్వామి పేరిట ఉన్న, రంగారెడ్డి జిల్లా, ఫరూఖ్‌నగర్ మండలం, చట్టాన్‌పల్లి గ్రామం, వద్ద సర్వే నెం. 597/1aలో (ఎక. 0.08 గుం.) & 597/VUలో (ఎక. 0.27) మొత్తం ఎక. 0.35 గుం. విస్తీర్ణం గల భూమి మరియు దాని మీద ఉన్న కమర్షియల్ లేయర్ షెడ్స్, ఫీడ్ గోడౌన్, వగైరా యావత్తు. **సరిహద్దులు:– ఉత్తరం:** V. నిర్మల యొక్క భూమి, **దక్షిణం:** కుప్పు స్వామి భూమి, **తూర్పు:** రోడ్, **పడమర:** K. హరిబాబు యొక్క భూమి.	**రూ. 43,40,000/-**	**రూ. 4,34,000/-**
			2) a)శ్రీ కిలారు కుప్పుస్వామి, S/o శ్రీ విశ్వేశ్వర్‌రావు పేరిట ఉన్న, రంగారెడ్డి జిల్లా, ఫరూఖ్‌నగర్ మండలం, చట్టాన్‌పల్లి గ్రామం వద్ద సర్వే నెం. 601లోని ఎక. 1.08 గుం. విస్తీర్ణంగల భూమి మరియు దానిమీద ఉన్న నివాస గృహము (G+1), కమర్షియల్ లేయర్ షెడ్, ఫీడ్ గోడౌన్, వగైరా యావత్తు. సరిహద్దులు:- ఉత్తరం: రోడ్, దక్షిణం: సర్వే నెం. 601/భాగం, తూర్పు: రోడ్డు, పడమర: రోడ్డు. b)శ్రీ కిలారు కుప్పుస్వామి, S/o శ్రీ విశ్వేశ్వర్‌రావు పేరిట ఉన్న, రంగారెడ్డి జిల్లా, ఫరూఖ్‌నగర్ మండలం, చట్టాన్‌పల్లి గ్రామం వద్ద సర్వే నెం. 597లోని ఎక. 0.38 గుం. విస్తీర్ణంగల భూమి మరియు దానిమీద ఉన్న కమర్షియల్ లేయర్ షెడ్, ఫీడ్ గోడౌన్, వగైరా యావత్తు. సరిహద్దులు:- ఉత్తరం: శ్రీ పుల్లయ్యచౌదరి యొక్క భూమి, దక్షిణం: సర్వే నెం. 603లోని భూమి, తూర్పు: శ్రీమతి సత్యవతి యొక్క భూమి, పడమర: రోడ్డు.	**రూ. 1,03,00,000/-**	**రూ. 10,30,000/-**
4.	**శ్రీ. M. లక్ష్మీ నారాయణ (రుణ గ్రహీత** 1) S/o వెంకట్‌రావు, సర్వే నెం. 592&593 B.V. రావు నగర్, చట్టన్‌పల్లి గ్రామం, ఫరూఖ్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రము-509216. **శ్రీమతి M. శేషు కుమారి (గ్యారంటర్)** W/o M. లక్ష్మీ నారాయణ, సర్వేనెం. 592&593 B.V. రావు నగర్, చట్టన్‌పల్లి గ్రామం, ఫరూఖ్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రము-509216. **శ్రీ M. రాజేంద్ర ప్రసాద్ (గ్యారంటర్)** S/o వెంకట్‌రావు, సర్వే నెం. 592&593, B.V. రావునగర్, చట్టన్‌పల్లి గ్రామం, ఫరూఖ్ నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా తెలంగాణ రాష్ట్రము-509216. **శ్రీమతి M. శేషు కుమారి (రుణగ్రహీత** 2) W/o M. లక్ష్మీనారాయణ, సర్వేనెం. 592&593, B.V. రావు నగర్, చట్టన్‌పల్లి గ్రామం, ఫరూఖ్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా తెలంగాణ రాష్ట్రము-509216. **శ్రీ M. లక్ష్మీ నారాయణ (గ్యారంటర్)** S/o వెంకట్‌రావు, సర్వేనెం. 592&593, B.V రావునగర్, చట్టన్‌పల్లి గ్రామం, ఫరూఖ్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రము- 509216	**I) 30.6.2017** నాటికి **M.** లక్ష్మీనారాయణ రూ. **4,21,37,639/-** **II) 30.6.2017** నాటికి **M.** శేషు కుమారి రూ. **1,59,55,277/-** మరియు **+ 1.7.2017** నుండి చెల్లింపు తేదీవరకు వర్తింపజేయని వడ్డీ, బ్యాంక్ ఛార్జీలు మరియు ఖర్చులు	**1) శ్రీ M. లక్ష్మీనారాయణ** పేరిట, తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం, దుస్కల్ గ్రామం వద్ద సర్వేనెం. 291/A లో ఎక. 03.00గంటల విస్తీర్ణంగల భూమితోపాటు కమర్షియల్ చిక్‌షెడ్ & లేయర్ షెడ్ వగైరా యావత్తు, **దాని సరిహద్దులు:– తూర్పు:** చెరువు కాలువ భూమి, **పడమర:** M. రామతులసమ్మ భూమి, **ఉత్తరం:** సర్వేనెం. 291/99 లోని భూమి, **దక్షిణం:** సర్వేనెం. 280 మరియు 290 లోని భూమి.	**రూ. 83,10,000/-**	**రూ. 8,31,000/-**
			2) **a) శ్రీ M. లక్ష్మీనారాయణ** పేరిట, తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం, చట్టన్ పల్లి గ్రామం వద్ద సర్వేనెం. 593ఎక. 0.24 గంటల విస్తీర్ణంగల భూమితోపాటు దానిమీద నిర్మించిన భవనం, కమర్షియల్ లేయర్ షెడ్, దాణా గోదాం వగైరా యావత్తు దీని సరిహద్దులు:– **తూర్పు:** K. సత్యనారాయణ భూమి, **పడమర:** K. సత్యనారాయణ భూమి, **ఉత్తరం:** M. మల్లేశ్వర్ రావుకు చెందిన భూమి, **దక్షిణం:** M. మల్లేశ్వర్‌రావుకు చెందిన భూమి **b) శ్రీ M. లక్ష్మి నారాయణ** పేరిట, తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లా, ఫరూఖ్‌నగర్ మండలం, చట్టాన్‌పల్లి గ్రామం వద్ద సర్వే నెం. 592 వద్ద ఎక. 1-02 గుంటల విస్తీర్ణం గల భూమితోపాటు కమర్షియల్ లేయర్ షెడ్, దాణా గోదాం వగైరా యావత్తు, దీని సరిహద్దులు:– **తూర్పు:** మల్లేష్ భూమి, **పడమర:** సర్వే నెం. 593లోని భూమి, **ఉత్తరం:** సర్వే నెం. 593లోని భూమి, **దక్షిణం:** G. రమేష్‌బాబు భూమి **c) శ్రీ M. లక్ష్మి నారాయణ** పేరిట, తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లా, ఫరూఖ్‌నగర్ మండలం, చట్టాన్‌పల్లి గ్రామం వద్ద సర్వే నెం. 594 వద్ద ఎక. 0.22 గుంటల విస్తీర్ణం గల భూమితోపాటు కమర్షియల్ లేయర్ షెడ్, దాణా గోదాం వగైరా యావత్తు, దీని సరిహద్దులు:– **తూర్పు:** M. శేషు కుమారి భూమి, **పడమర:** రోడ్డు, **ఉత్తరం:** P. వెంకటరావు భూమి, **దక్షిణం:** P. మల్లయ్య భూమి	**రూ. 1,34,00,000/-**	**రూ. 13,40,000/-**
			3) శ్రీమతి M. శేషుకుమారి W/o శ్రీ M. లక్ష్మి నారాయణ పేరిట, తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లా, ఫరూఖ్‌నగర్ మండలం, చట్టాన్‌పల్లి గ్రామం వద్ద సర్వే నెం. 593 వద్ద ఎక. 2-14 గుంటల విస్తీర్ణం గల భూమితోపాటు కమర్షియల్ లేయర్ షెడ్, దాణా గోదాం వగైరా యావత్తు, దీని సరిహద్దులు:– **తూర్పు:** సాంబశివరావు భూమి, **పడమర:** రోడ్డు, **ఉత్తరం:** నాగమల్లేశ్వర్‌రావు భూమి, **దక్షిణం:** P. నాగమల్లేశ్వర్‌రావు భూమి	**రూ.70,40,000/-**	**రూ. 7,04,000/-**
5.	**శ్రీమతి మక్కపాటి వెంకట శివ లక్ష్మి (రుణగ్రహీత 1)** W/o ఎం. నాగ మల్లేశ్వరరావు, R/o H.No. 7-55/5, బి.వి. రావు నగర్, చట్టాన్‌పల్లి గ్రామం, ఫరూఖ్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం-509216. **శ్రీ ఎం. నాగ మల్లేశ్వరరావు (గ్యారంటర్)** S/o వెంకట్ రావు, R/o H.No. 7-55/5, బి.వి. రావు నగర్, చట్టాన్‌పల్లి గ్రామం, ఫరూఖ్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం-509216. **శ్రీమతి జి. సుమతి (గ్యారంటర్)** W/o గద్దె సింఘూ రావు, R/o బి.వి. రావు నగర్, పౌల్ట్రీ కాంప్లెక్స్, చట్టాన్‌పల్లి గ్రామం, ఫరూఖ్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం-509216. **శ్రీ మక్కపాటి సతీష్ కుమార్ (గ్యారంటర్)** S/o ఎం. నాగ మల్లేశ్వర రావు, R/o H.No. 7-55/5, బి.వి. రావు నగర్, చట్టాన్‌పల్లి గ్రామం, ఫరూఖ్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం-509216. **శ్రీ ఎం. నాగ మల్లేశ్వర రావు (రుణగ్రహీత 2)** S/o వెంకట్ రావు, R/o H.No. 7-55/5, బి.వి. రావు నగర్, చట్టాన్‌పల్లి గ్రామం, ఫరూఖ్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం-509216. **శ్రీ గద్దె సింఘూ రావు (గ్యారంటర్)** S/o తిరుపతయ్య, R/o బి.వి. రావు నగర్, పౌల్ట్రీ కాంప్లెక్స్, చట్టాన్‌పల్లి గ్రామం, ఫరూఖ్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం-509216. **శ్రీమతి మక్కపాటి వెంకట శివ లక్ష్మి (గ్యారంటర్)** W/o ఎం. నాగ మల్లేశ్వర రావు, R/o H.No. 7-55/5, బి.వి. రావు నగర్, చట్టాన్‌పల్లి గ్రామం, ఫరూఖ్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం-509216. **శ్రీ మక్కపాటి సతీష్ కుమార్ (గ్యారంటర్)** S/o ఎం. నాగ మల్లేశ్వర రావు, R/o H.No. 7-55/5, బి.వి. రావు నగర్, చట్టాన్‌పల్లి గ్రామం, ఫరూఖ్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం-509216.	**I)** మక్కపాటి వెంకట శివ లక్ష్మి 30–6–2017 నాటికి రూ. 1,56,59,305/– మరియు **II)** ఎం. నాగ మల్లేశ్వర రావు 30–6–2017 నాటికి రూ. 2,27,12,138/– + 1–7–2017 నుండి చెల్లింపు తేదీ వరకు వర్తింపజేయని వడ్డీ, బ్యాంకు ఛార్జీలు మరియు ఖర్చులు.	**1)** శ్రీ **M.** నాగమల్లేశ్వరరావు పేరిట ఉన్న రంగారెడ్డి జిల్లా, ఫరూఖ్‌నగర్ మండలం, చట్టాన్‌పల్లి గ్రామం వద్ద సర్వే నెం. 593 (భాగం)లో ఎక. 01-10 గుంటల విస్తీర్ణంగల కమర్షియల్ లేయర్ షెడ్, పౌల్ట్రిషెడ్ వగైరాలతో భూమి యావత్తు. **దీని సరిహద్దులు: ఉత్తరం:** M. లక్ష్మీనారాయణ & కప్పా సత్యనారాయణ భూమి, **దక్షిణం:** నాగ మల్లేశ్వరరావు భూమి, **తూర్పు:** సర్వే నెం. 592, **పడమర:** రోడ్	**రూ. 55,30,000/-**	**రూ. 5,53,000/-**
			2) a) శ్రీమతి **M.V.** శివలక్ష్మి W/o శ్రీ M. నాగమల్లేశ్వరరావు పేరిట ఉన్న రంగారెడ్డి జిల్లా, ఫరూఖ్‌నగర్ మండలం, చట్టాన్‌పల్లి గ్రామం వద్ద సర్వే నెం. 593/KAలో ఎక. 1-12 గుంటల విస్తీర్ణంగల కమర్షియల్ ఫీడ్ గోడౌన్ & పౌల్ట్రి ఫారంషెడ్ వగైరాలతో ఇల్లు (మున్సిపల్ నెం. 7-55/5) యావత్తు. **దీని సరిహద్దులు: ఉత్తరం:** N. శ్రీనివాసరావు భూమి, **దక్షిణం:** P. వెంకటేశ్వర్లు భూమి, **తూర్పు:** రోడ్, **పడమర:** వెంకట్‌రామయ్య భూమి **b)** శ్రీమతి **MV** శివలక్ష్మి W/o శ్రీ M.నాగమల్లేశ్వరరావు పేరిట ఉన్న రంగారెడ్డి జిల్లా, ఫరూఖ్‌నగర్ మండలం, చట్టాన్‌పల్లి గ్రామం వద్ద సర్వే నెం.593/RUలో ఎక. 1.13 గుంటల విస్తీర్ణంగల కమర్షియల్ పౌల్ట్రిఫారం షెడ్ & ఫీడ్ గోడౌన్ వగైరాలతో భూమి యావత్తు. దీని సరిహద్దులు: **ఉత్తరం:** N.వెంకట్‌రావు భూమి, **దక్షిణం:** P.వెంకటేశ్వర్లు భూమి, **తూర్పు:** రోడ్, **పడమర:** P.రోశయ్య భూమి. **C)** శ్రీమతి **M.V.**శివలక్ష్మి W/o M.నాగమల్లేశ్వర్ రావు పేరిట ఉన్న, రంగారెడ్డి జిల్లా, ఫరూఖ్‌నగర్ మండలం, చట్టాన్‌పల్లి గ్రామం వద్ద సర్వే నెం.595/3లోని ఎక. 1.15 గుం. విస్తీర్ణంగల భూమి మరియు దానిమీద ఉన్న కమర్షియల్ పౌల్ట్రీఫామ్ షెడ్ & ఫీడ్ గోడౌన్, వగైరా యావత్తు. **సరిహద్దులు:– ఉత్తరం:** రోశయ్య యొక్క భూమి, **దక్షిణం:** M.ఆనందరావు యొక్క భూమి, **తూర్పు:** P.వెంకటేశ్వర్లు యొక్క భూమి, **పడమర:** రోడ్.	**రూ. 1,43,20,000/-**	**రూ. 14,32,000/-**
			3) శ్రీ **M.**నాగమల్లేశ్వరరావు పేరిట ఉన్న, రంగారెడ్డి జిల్లా, కేశంపేట్ మండలం, వేముల్ నర్వ గ్రామం వద్ద సర్వే నెం.597లోని ఎక. 1.00 గుం. విస్తీర్ణంగల భూమి మరియు దానిమీద ఉన్న RCC బ్లాక్ మరియు కమర్షియల్ లేయర్ షెడ్, వగైరా యావత్తు. **సరిహద్దులు:– ఉత్తరం:** రోడ్, **దక్షిణం:** కుమ్మరి రాములమ్మ యొక్క భూమి, **తూర్పు:** కుమ్మరి అంజయ్య యొక్క భూమి, **పడమర:** డప్పు పెంటయ్య యొక్క భూమి.	**రూ. 53,80,000/-**	**రూ. 5,38,000/-**

ఇతర నియమ నిబంధనలు: సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లో నిర్దేశించబడిన షరతులు మరియు దిగువ తెలిపిన షరతులకు లోబడి అమ్మకం జరుగుతుంది. **a)** ఎన్‌కంబ్రెన్స్‌లు ఏవైనా ఉన్నట్లయితే వాటితోసహా **"ఎక్కడ ఏది ఎలా ఉన్నది, అక్కడ అది అలానే"** ప్రాతిపదికన ఆస్తి విక్రయించబడుతుంది. బ్యాంకుకు తెలిసినంత మేరకు ఎన్‌కంబ్రెన్స్‌లు ఏవీ లేవు. **b)** వెబ్‌సైట్: **https://www.canarabank.auctiontiger.net ద్వారా "ఆన్‌లైన్ ఎలక్ట్రానిక్ బిడ్డింగ్"** ద్వారా మాత్రమే వేలం/ బిడ్డింగ్ జరుగుతుంది. బిడ్డర్లు ఇ-వేలం విక్రయం విధాయకాలలో పాల్గొనే ముందు వివరమైన నిబంధనల కొరకు వెబ్‌సైట్‌ను చూడవలసినదిగా విజ్ఞప్తి. **c) 14-9-2017 నుండి 15-9-2017 వరకు, ఉ. 11.00 గం॥ నుండి మ. 3.00 గం॥ మధ్య అధీకృత అధికారి** యొక్క ముందస్తు అపాయింట్‌మెంట్‌తో ఆస్తిని తనిఖీ చేసుకోవచ్చును. **d)** రిజర్వు ధర కన్నా తక్కువకు ఆస్తి విక్రయించబడదు మరియు పాల్గొనుచున్న బిడ్డర్లు వేలం ప్రక్రియ సమయంలో వారి ఆఫర్లను తదుపరి పెంచుకోవచ్చును. **e) రిజర్వ్ ధరలో 10 % ధరావతు సొమ్మును** డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో **అధీకృత అధికారి, కెనరా బ్యాంక్, ARM బ్రాంచ్ పేరిట డిపాజిట్ చేయవలెను** లేదా **A/c No. 2752295000001, IFSC CODE: CNRB0002752 ద్వారా RTGS/NEFT/ ఫండ్ ట్రాన్స్‌ఫర్ ద్వారా కెనరా బ్యాంక్, ARM బ్రాంచ్‌కి జమ అయ్యేలా 25-9-2017 సా. 5.00 గం.ల్లోపు (ఆఫ్‌లైన్ లేదా ఆన్‌లైన్) డిపాజిట్ చేయవలెను. f)** ఔత్సాహిక బిడ్డర్లు చెల్లుబాటగు డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్ మరియు **e-మెయిల్ చిరునామాను** కలిగి ఉండవలెను. డిజిటల్ సిగ్నేచర్ గురించిన వివరాల కొరకు మరియు ఇ-వేలం విధానము గురించిన సందేహాల కొరకు సంప్రదించండి సర్వీస్ ప్రొవైడర్ : **M/s. ఇ–ప్రొక్యూర్‌మెంట్ టెక్నాలజీస్ లిమిటెడ్ (ఆక్షన్ టైగర్), అహ్మదాబాద్. కాంటాక్ట్ పర్సన్: శ్రీ పార్థీవ్ త్రివేది : 09979543878, 079-40230812/11/10 & భాస్కర్ దుబ్బాక 08341410158 (హైదరాబాద్), ఇ–మెయిల్ ఐడి: telangana@auctiontiger.net & support@auctiontiger.net వెబ్‌సైట్ : https://canarabank.auctiontiger.net. g)** ఆసక్తి గల బిడ్డర్లు ధరావతు సొమ్ము చెల్లించిన తర్వాత దిగువ తెలిపిన వివరాలు/ డాక్యుమెంట్ల కాపీని **25-9-2017 సా. 5.00 గం.లోగా కెనరా బ్యాంక్, ARM బ్రాంచ్, హైదరాబాద్‌కి** స్వయంగా లేదా e- మెయిల్ ద్వారా

మిగతా 5వ పేజీలో








'పాత' ఒక ఫ్యాషన్!

ఓల్డ్ ఈజ్ గోల్డ్.. ఈ చిత్రాలు చూస్తే ఆ మాట నిజమేననిపిస్తోంది కదూ..! పురాతన సంప్రదాయాలు.. నాటి పద్ధతులే మళ్లీ ఆదరణ పొందుతున్నాయి.. ఇదే కోవలో గచ్చిబౌలిలో కొత్తగా ఏర్పాటైన ఓ రెస్టారెంట్‌ను తీర్చిదిద్దారు. నాటి సంప్రదాయ పద్ధతులను గుర్తుకు తెచ్చే పలు ఉపకరణాలు, అప్పటి నిర్మాణ శైలిని గుర్తుకు తెచ్చే నమూనాల సమాహారంగా.. ఆకట్టుకునేలా అలకరించారు. – ఈనాడు, హైదరాబాద్

మలక్‌పేటలో 33 ఒంటెలకు విముక్తి

ఏడుగురి అరెస్ట్

సైదాబాద్: జంతు సంక్షేమ బోర్డు చొరవతో 33 ఒంటెలకు విముక్తి లభించింది. మలక్‌పేట ఠాణా అడ్మిన్ సబ్ ఇన్‌స్పెక్టర్ నల్ల రంజిత్‌కుమార్ శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్‌మలక్‌పేట తీగలగూడ పరిసరాల్లో రాజస్థాన్ నుంచి ఒంటెలు తీసుకొచ్చి కొందరు జీవనోపాధి పొందుతున్నారు. వేడి ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో ఉండాల్సిన ఒంటెలను చలి ప్రదేశాల్లో ఉంచుతూ హింసిస్తున్నారంటూ భారత జంతు సంక్షేమ బోర్డు సభ్యురాలు సోనమ్‌కౌర్ శుక్రవారం రాత్రి ఠాణాలో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఏడుగురు వ్యక్తులను అరెస్టుచేశారు. 33 ఒంటెలను స్వాధీనం చేసుకుని మేడ్చల్‌లో ఉన్న గోశాలలో సంరక్షించారు.

చిన్నారుల ఆరోగ్య సంరక్షణపై అవగాహన పెంచుకోవాలి

'ఈనాడు' వసుంధర కుటుంబం, ప్యాంపర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత అవగాహన సదస్సు

కుషాయిగూడ, న్యూస్‌టుడే: చిన్నారుల ఆరోగ్య సంరక్షణపై 'ఈనాడు' వసుంధర కుటుంబం, ప్యాంపర్స్ ప్యాంట్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత అవగాహన సదస్సుకు విశేష స్పందన లభించింది. శనివారం ఈసీఐఎల్ మహేష్ నగర్‌లోని స్వాగత్ గ్రాండ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన ఈ సదస్సుకు ప్యాంపర్స్ ప్యాంట్స్ అసోసియేట్ బ్రాండ్ మేనేజర్ (ఏబీఎం) ఫర్జీన్, 'ఈనాడు' ఈవెంట్స్ సీనియర్ మేనేజర్ బి.సాధన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్నారుల సంరక్షణలో తల్లుల పాత్ర ప్రధానమైందన్నారు. చంటి పిల్లల సంరక్షణపై చేపడుతున్న ఉచిత అవగాహన సదస్సులను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అంకూర్ ఆసుపత్రి చిన్న పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ స్వాతి మాట్లాడుతూ... చిన్నారుల ఆరోగ్యం, వివిధ కాలాల్లో వచ్చే అంటువ్యాధులు, బబ్బులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇప్పించాల్సిన టీకాలు తదితరాలపై అవగాహన కల్పించారు. చిన్నారులకు మంచి నిద్రను అందించేందుకు డైపర్ల వాడకం ఎంతో మంచిదన్నారు. నాణ్యమైన డైపర్ల వాడకంతో చిన్నారులకు చర్మ సంబంధిత సమస్యలు దరిచేరవన్నారు. ఈ సందర్భంగా ప్యాంపర్స్ ప్యాంట్స్ ప్రతినిధులు డైపర్ల వాడకంపై అవగాహన కల్పించారు. అనంతరం పలువురు తల్లులు చంటి పిల్లల ఆరోగ్య సమస్యలు, తీసుకోవాల్సి చర్యలపై సందేహాలపై వైద్య నిపుణులను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన లక్కీడ్రా విజేతలుగా నిలిచిన జి.కృపా, జె.రజిత, సీహెచ్.రజిని, ఎన్.భవాని, ఎస్.పద్మ, దేవకరణ, బి.యశోద, ఎస్.పద్మలత, టి.స్వరూప, పి.గీత తదితరులకు బహుమతులు అందజేశారు. ప్యాంపర్స్ ప్యాంట్స్ సౌత్, వెస్ట్ జోన్ బెస్ట్ పర్‌ఫామింగ్ రిటైలర్స్ రాజేష్, సురేష్, భాస్కర్, సుమన్, కిరణ్ లకు ధ్రువపత్రాలను ప్రదానం చేసి అభినందించారు. 'ఈనాడు' వసుంధర కుంటుంబం ఏర్పాటు చేస్తున్న సదస్సులపై మహిళలు సంతోషం వ్యక్తం చేశారు.



లక్కీ డ్రాలో విజేతలుగా నిలిచిన మహిళలతో నిర్వాహకులు



కార్యక్రమానికి హాజరైన మహిళలు



ఉత్సాహంగా ఐటీ ఉద్యోగుల సైకిల్ యాత్ర

గచ్చిబౌలి న్యూస్‌టుడే: జెన్‌క్యూ ఐటీ కంపెనీకి చెందిన ఉద్యోగులు సైకిల్ యాత్ర చేశారు.. ఫ్రీడం సైకిల్ రైడ్ 2017 పేరిట గచ్చిబౌలి నుంచి హిమాయత్‌సాగర్ వరకు 35 కిలోమీటర్లు ఉత్సాహంగా సైకిల్ తొక్కారు. శనివారం ఉదయం గచ్చిబౌలి స్టేడియం వద్ద జెన్‌క్యూ కంపెనీ ఎం.డి. మురళీ బొల్లు జెండా ఊపి సైకిల్ రైడ్‌ను ప్రారంభించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని చేపట్టిన సైకిల్ రైడ్‌లో యువతీ యువకులు పాల్గొని సందడి చేశారు. ఆరోగ్య సంరక్షణపై ఉద్యోగుల్లో అవగాహన కల్పించేందకు ఈ కార్యక్రమం ఎంతో దోహదం చేస్తుందని మురళీ బొల్లు పేర్కొన్నారు.



4వ పేజీ తరువాయి

విద్యార్థులపై కళాశాలల ఫీజులుం!



నచ్చిన కళాశాలల దక్కలేదంటూ డిగ్రీ విద్యార్థుల ఆందోళన

- 'దోస్త్' మూడో విడతలో గందరగోళం
- కేటాయించి కాదంటున్న వైనం
- కొత్తగా నమోదు చేసుకోవాలంటూ సందేశం

డిగ్రీ కళాశాలల్లో సీట్లు భర్తీ చేసేందుకు ప్రవేశపెట్టిన దోస్త్(డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ) మూడో విడత కౌన్సెలింగ్ విద్యార్థులను గందరగోళానికి గురిచేస్తోంది. హైదరాబాద్ గ్రేటర్ పరిధిలోనే సుమారు 200 పైగా డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. కొన్ని దోస్త్‌లో చేరలేదు. సొంతగానే ప్రవేశాలు నిర్వహించుకుంటున్నాయి. దోస్త్‌లో ఉన్న కళాశాలలతో డిగ్రీ సీట్లు భర్తీని ఎంతో పారదర్శకంగా నిర్వహించేందుకు భారీ కసరత్తు చేశారు. తొలిరెండు విడతలు జరిగిన దోస్త్ కౌన్సెలింగ్ ప్రక్రియ పారదర్శకంగానే జరిగిందని పలువురు పేర్కొంటున్నారు. చివరిదైన మూడో విడత ప్రక్రియలో ఏం జరిగిందో ఏమో.. విద్యార్థులను మాత్రం ఆందోళనకు గురిచేస్తోంది. ఈ విడతలోకూడా మూడు రోజుల క్రితం వరకు అంతాబాగానే జరిగిందని, కళాశాలలు ఎంపికైనట్లు ఆదేశాలు వచ్చాయని అంతలోనే అవి రద్దు అయినట్లు మళ్లీ సందేశం వచ్చిందని పలువురు విద్యార్థులు వాపోతున్నారు. మళ్లీ గురువారం ఉదయం కళాశాలలను కొత్తగా ఎంపిక చేసుకోవాలని సూచించారని పేర్కొన్నారు. గతంలో ఎంపిక చేసుకున్న కళాశాలలు తాజాగా దక్కలేదని విద్యార్థులు చెబుతున్నారు. ఇదిఇలాఉంటే ప్రభుత్వ పేర్కొన్న ఫీజు కాకుండా కొన్ని కళాశాలలు అనధికారికంగా ఎక్కువ ఫీజులు వసూలు చేస్తున్నాయని పలువురు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. దోస్త్‌లో చేరని కళాశాలల్లో ఫీజులు భారీగా ఉన్నాయని వాటిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కొన్ని కళాశాలల్లో నాలుగైదు కోర్సుల్లోనే అభ్యర్థులు ఎక్కువ మంది చేరగా, మిగతా చాలా కళాశాలల్లో ఎక్కువ కోర్సుల్లో తగినంత మంది విద్యార్థులు లేరు. వాటిని తక్కువ మందితో ఎలా నిర్వహించేదని ఆయా కళాశాలల యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

– ఈనాడు, హైదరాబాద్

పారదర్శకంగా ప్రకటించాలి..

నగరంలో కొన్ని ప్రముఖ కళాశాలల్లో సీట్లు అయిపోయినట్లు ఆన్‌లైన్ చూపుతోందని పలువురు అభ్యర్థులు పేర్కొంటున్నారు. మూడో విడతలో ఆయా కళాశాలల్లో సీట్లు దక్కినట్లు పలువురికి కేటాయింపు పత్రాలు జారీ చేశారు. అవి పట్టుకొని వెళితే మా కళాశాలలో సీట్లు ఖాళీలేవు అని, మళ్లీ ఎంపిక చేసుకోవాలని తిప్పి పంపించేస్తున్నారు. ఇలా నచ్చిన కళాశాలలో సీటు దక్కినట్లే దక్కి చేజారిపోయిందని పలువురు అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ కళాశాలలో ఎవరితో సీట్లు భర్తీ చేశారు.. వారికి ఇంటర్‌లో వచ్చిన మార్కులు, రిజర్వేషన్ తదితర సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అందరికీ తెలిసేలా ప్రకటించాలని పలువురు కోరుతున్నారు. అక్రమాలు జరిగి ఉంటే వెలుగులోకి వస్తాయని చెబుతున్నారు.

కొన్నింటిలో అరకొర సీట్లే భర్తీ

నగరంలో ఉన్న చాలా కళాశాలల్లో కొన్ని కోర్సులకు విద్యార్థులు అరకొరగానే ఉన్నారు. ఒక కోర్సు నిర్వహించాలంటే విద్యార్థులు కనీస సంఖ్య 30 నుంచి 40 అనుకుంటే.. కొన్నింటిల్లో 20 సీట్లు భర్తీ కాలేదు. వాటిని ఎలా నిర్వహించాలని కళాశాలల యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కొన్ని కళాశాలల్లో పలు కోర్సులకు అభ్యర్థులు పదిలోపు మాత్రమే ఉన్నారు. ఇలాంటి వాటి సంగతేంటో స్పష్టం చేయాలని ఆయా కళాశాలల యాజమాన్యాలు ప్రశ్నిస్తున్నాయి. ప్రభుత్వం సూచించిన ఫీజులతో తక్కువ సంఖ్య ఉన్న కోర్సులను ఎలా కొనసాగించాలని వారు వివరిస్తున్నారు. ఇలంటి చాలా సమస్యలకు పరిష్కారం చూపకుండా ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులతో మేము కళాశాలను నిర్వహించలేమని పలువురు పేర్కొంటున్నారు.

అవగాహన కరవు..

డిగ్రీ చదివే విద్యార్థుల్లో ఎక్కువ మంది గ్రామీణ ప్రాంతాల నుంచి వస్తున్నారు. వీరికి ఆన్‌లైన్ విధానంపై కనీస అవగాహన ఉండడంలేదు. దోస్త్‌లో కళాశాలల ఎంపికపై అవగాహన లేక ఇంటర్‌నెట్ సెంటర్ల నిర్వాహకులను ఆశ్రయిస్తున్నారు. వారికి కూడా దీనిపై అంతంత మాత్రపు పరిజ్ఞానమే ఉంటోంది. దీంతో ఏఏ ప్రాంతంలో ఏ కళాశాలలు ఉన్నాయో జాబితాను అభ్యర్థులకు వివరించలేకపోతున్నారు. కళాశాలల జాబితాలో ఆన్‌లైన్‌లో మొదట చూపుతున్న నాలుగైదు కళాశాలల పేర్లు చాలామంది అభ్యర్థుల తరఫున నెట్ నిర్వాహకులు నమోదు చేసేస్తున్నట్లు తెలుస్తోంది. మూడో విడత కౌన్సెలింగ్‌లో సర్వర్ చాలారోజులు మొరాయించిందని, ఎంపికలు తారుమారైనట్లు పలువురు అభ్యర్థులు వివరిస్తున్నారు. ఎంపికైన కళాశాలలకు వెళితే మీ పేరు మా కళాశాలకు రాలేదని కొందరు చెబుతున్నారని అభ్యర్థులు వాపోతున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేస్తే.. కొత్తగా మళ్లీ ఎంపిక చేసుకోవాలని సూచించారని పేర్కొంటున్నారు.

అక్రమాలకు కళ్లెం ఏదీ?

గత కొన్నేళ్లుగా పలు కళాశాలలు ధనార్జనే ధ్యేయంగా సాగుతున్నాయి. ఇది వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు శాపంగా మారింది. డిగ్రీ కళాశాలలు అధికఫీజులు వసూలుచేస్తూ విద్యార్థులను దోపిడీ చేస్తున్నాయని రాష్ట్రప్రభుత్వం గుర్తించింది. ఈ పరిస్థితిని దారిలోకి తీసుకురావాలని కసరత్తు చేసింది. పారదర్శకమైన కొత్త విధానాన్ని అమలులోకి తెచ్చింది. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్(సీజీజీ) మరియు రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాలలన్నింటికీ ప్రవేశాలు ఆన్‌లైన్‌లో కల్పించే కార్యక్రమాన్ని అమలులోకి తెచ్చింది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన దోస్త్.. ఎంతో పారదర్శకంగా ప్రారంభమైంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మొదటిసారిగా నిర్వహిస్తున్న డిగ్రీ ఆన్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియ అనుకున్న స్థాయిలో విజయం సాధించలేదనే చెప్పాలి. ఈ విధానంపట్ల పలువురు గ్రామీణ విద్యార్థులకు అవగాహన లేక దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్ని విడతలు ప్రవేశాలకు అవకాశాలు కల్పించినా రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ కళాశాలల్లో దాదాపు సగం సీట్లు ఖాళీగానే ఉండిపోయాయి. దోస్త్‌లో చేరేది లేదని తొలుత 20 కళాశాలలు హైకోర్టును ఆశ్రయించాయి. వాటికి అనుకూలంగా తీర్పువచ్చింది. దీంతో అవి సొంతంగానే నచ్చిన ఫీజులు నిర్ణయించి సీట్లు భర్తీ చేసుకుంటున్నాయి. ఇదే మార్గంలో మరికొన్ని కళాశాలలు కోర్టును ఆశ్రయించి ఇదేతీరులో సాగిపోతున్నాయి. దోస్త్‌లో చేరని కళాశాలల్లో ఫీజులపై ప్రభుత్వం కళ్లెం వేయలేకపోయింది. దీంతో దోస్తు లక్ష్యం ఎలా నెరవేరినట్లు అని పలువురు విద్యారంగ నిపుణులు ప్రశ్నిస్తున్నారు.

దోస్త్ గందరగోళంగా ఉంది – శ్రవణ్‌కుమార్, విద్యార్థి

నాకు మూడురోజుల క్రితం ఒక కళాశాలలో సీటు కేటాయించారు. ఆ కళాశాలకు వెళితే నాపేరు లేదని చెప్పారు. మళ్లీ అధికారులను సంప్రదించగా కొత్తగా కళాశాలను ఎంపిక చేసుకోమని సూచించారు. దోస్త్ విధానంలో ఏదో కొంత గందరగోళం ఉన్నట్లుంది. సర్వర్ కూడా సరిగ్గా పనిచేయడంలేదు.

సీటు వచ్చినట్లే వచ్చి చేజారింది.. – సంధ్య, విద్యార్థి

నాకు కేటాయించినటు చూపించిన పత్రాన్ని రెండు రోజుల్లోనే రద్దు చేశారు. సర్వర్ సమస్య అన్నారు. మళ్లీ అదే కళాశాలను ఎంపిక చేసుకున్నా రాలేదు. నాకు కేటాయించిన కళాశాల మళ్లీ ఎందుకు ఇవ్వలేదు? నాకు వచ్చిన మార్కులు, రిజర్వేషన్‌లో మార్పులు లేనప్పుడు సర్వర్‌లో సమస్య పరిష్కారం అయ్యాకా మళ్లీ అదే కళాశాల రావాలి కదా.. అలా ఎందుకురాలేదు. సీటు వచ్చి వెంటనే చేజారింది.

పనులకు వచ్చి.. కానరాని లోకాలకు

ఇద్దరు కూలీల దుర్మరణం

నార్సింగి, న్యూస్‌టుడే: పొట్టకూటి కోసం పనికి వెళ్లి తిరిగి వస్తున్న ఇద్దరు కూలీలను టిప్పర్ రూపంలో మృత్యువు కబళించింది. ద్విచక్రవాహనంపై వెళ్తున్న కూలీలను టిప్పరు ఢీకొట్టిన సంఘటనలో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన కోకాపేట యు జంక్షన్ వద్ద శనివారం జరిగింది. నార్సింగి ఠాణా ఎస్‌ఐ డి.వెంకటేష్ కథనం ప్రకారం... మహబూబ్‌నగర్ జిల్లా మద్దూరు మండలం దమగాన్‌పూర్ గ్రామానికి చెందిన వడ్డె మహిపాల్(26), కుమ్మరి నరేష్ (26) కూలీపని కోసం వలస వచ్చి నార్సింగిలో నివాసం ఉంటున్నారు. మహిపాల్‌కు భార్య ఒక కొడుకు, కూతురు ఉండగా, నారాయణకు భార్య ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. ఎప్పటి మాదిరిగానే శనివారం గండిపేటకు కూలీపనికి వెళ్లిన వీరు సాయంత్రం ద్విచక్రవాహనంపై తిరిగి వస్తుండగా కోకాపేట యు జంక్షన్ వద్ద వెనక వేగంగా దూసుకువచ్చిన టిప్పర్ ఢీకొట్టింది. ఈ సంఘటనలో ద్విచక్రవాహనంపై వెళుతున్న మహిపాల్, నరేష్‌లు తీవ్రగాయాలకు గురై అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను మార్చురికి తరలించి ట్రాఫిక్‌ను నియంత్రించారు. సంఘటనా స్థలంలో మృతుల కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. రోజంతా కష్టపడి మరో ఐదు నిమిషాల్లో భార్యా పిల్లల వద్దకు చేరుతామనగా ప్రమాదం బారిన పడి ప్రాణాలు కోల్పోవడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

వ్యక్తి ఆత్మహత్య!

బాలానగర్, న్యూస్‌టుడే: తాను పనిచేసే కంపెనీలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బాలానగర్ ఠాణా పరిధిలో జరిగింది. ఎస్.ఐ. రవికిరణ్ కథనం ప్రకారం. . కర్నూలుకు చెందిన శ్రీధర్‌రావు(38) ఏడేళ్లుగా చింతల్‌లో ఉంటూ బాలానగర్‌లోని ఎంటీఏఆర్‌లో ఫిట్టర్‌గా పనిచేస్తున్నాడు. పెళ్లి చేసుకునేందుకు గత నెలలోనే నిశ్చితార్థం జరిగింది. అప్పటి నుంచి ఎవరితో మాట్లాడకుండా బాధపడుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయంటూ పలువురి వద్ద ప్రస్తావించాడు. శుక్రవారం విధులకొచ్చిన శ్రీధర్‌రావు యధావిధిగా కంపెనీ చొక్కా ధరించాడు. తర్వాత నుంచి అతను కనిపించక పోవడంతో సాయంత్రం ఇది గమనించిన తోటి కార్మికులు వెతగ్గా ఎక్కడా కనిపించలేదు. దీంతో అతని చొక్కాను పరిశీలించగా అందులో ఒక చిట్టీ దొరికింది. బాత్రూం సమీపంలోని సంపులో దూకి ఆత్మహత్య చేసుకుంటున్నానని రాసి ఉంది. దీంతో కార్మికులు అక్కడ గమనించగా బయట చెప్పులు కనిపించాయి. యాజమాన్యానికి సమాచారం ఇవ్వడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గణేశ్ నిమజ్జన ఊరేగింపునకు ప్రత్యేక ఏర్పాట్లు



మార్గాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ముషీరాబాద్, న్యూస్‌టుడే: శనివారం జీహెచ్‌ఎంసీలోని అన్ని శాఖలతోపాటు విద్యుత్తుశాఖ, ట్రాఫిక్ పోలీసులతో కలిసి నిమజ్జన ఊరేగింపు రూట్‌లో బస్సుయాత్ర నిర్వహించారు. ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్‌రోడ్డు, నారాయణగూడ మీదుగా ట్యాంక్‌బండ్ వరకు రూట్‌ను పరిశీలించారు. అనంతరం ముషీరాబాద్‌లో జీహెచ్‌ఎంసీ సర్కిల్-15 డీఎంసీ బి.కృష్ణశేఖర్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎంవోహెచ్ డా.భార్గవనారాయణ, జీహెచ్‌ఎంసీ ఈఈ లక్ష్మీనారాయణ, డీఈ నామ్యానాయక్, ఏఈలు అశ్విని, తిరుపతి, ఎంటమాలజీ ఏఈ అరుణ్, వీధి దీపాల నిర్వహణ అధికారి సుదర్శన్, ముషీరాబాద్, గాంధీనగర్, చిక్కడపల్లి ఠాణా ఎస్సైలు పాల్గొన్నారు.

5కే రన్‌తో ఆరంభమైన హైదరాబాద్ మారథాన్

దాదాపు 5వేల మంది పోటాపోటీగా పరుగులో పాలుపంచుకున్నారు. ఎయిర్‌టెల్ హైదరాబాద్ మారథాన్ 2017 5కే రన్ పేరిట హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ చేపట్టిన 5కే రన్‌ను శనివారం హైటెక్స్ వద్ద రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి జయేష్‌రంజన్ ప్రారంభించారు. పరుగు మెటల్ చార్మినార్ మీదుగా తిరిగి హైటెక్స్ వరకు 5 కిలోమీటర్లు ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. ఆదివారం 41.195 కిలోమీటర్ల ఫుల్ మారథాన్, 21.095 కిలోమీటర్ల హాఫ్ మారథాన్ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. – న్యూస్‌టుడే, మాదాపూర్



నెల రోజుల్లో గుర్తింపు కబురు?!

వర్సిటీల్లో ముగిసిన న్యాక్‌బృందాల పర్యటన ● సానుకూలంగా సాగిన పరిశీలన ● మంచి గ్రేడ్ వస్తుందంటున్న వీసీలు

ఈనాడు, హైదరాబాద్: జేఎన్‌టీయూ హెచ్, ఉస్మానియా విశ్వవిద్యాలయాలకు ఎట్టకేలకు న్యాక్ గుర్తింపు దక్కనుంది. గత కొన్నేళ్లుగా ఈ రెండు వర్సిటీలకు న్యాక్ గుర్తింపు లేని విషయం విదితమే. కారణాలు ఏమైనా ఈ విశ్వవిద్యాలయాలకు న్యాక్ గుర్తింపు లేకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారు. రాష్ట్రంలో ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఈ వర్సిటీలకు ఇన్నేళ్లపాటు గుర్తింపు లేకుండా సాగడం పలు విమర్శలకు దారితీసింది. వర్సిటీతోపాటు విద్యార్థులు ఆర్థికంగా బాగా నష్టపోయారు. 2004లో జేఎన్‌టీయూకి న్యాక్(నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడిటేషన్ కౌన్సిల్)ఏ గ్రేడ్ దక్కింది. ఆ తర్వాత 2008లో ఈ వర్సిటీ నాలుగ్గా విడిపోయింది. ఒకటి జేఎన్‌టీయూ హెచ్‌గా ఆవిర్భవించింది. 2004లో దక్కిన గుర్తింపు 2009లో పూర్తిఅయింది. వర్సిటీ కొత్తగా ఆవిర్భవించిన నేపథ్యంలో మళ్లీ న్యాక్ గుర్తింపు కొత్తగా పొందాల్సి వచ్చింది. అప్పటి నుంచి గుర్తింపు పొందేందుకు ఎన్నో ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. వీసీగా ఎ.వేణుగోపాల్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి గుర్తింపుపై మళ్లీ దృష్టిపెట్టారు. ఆయావిభాగాల అధికారులను అప్రమత్తం చేశారు. వర్సిటీలో మౌలిక వసతులు కల్పించారు. వీటితో పాటు సీబీసీఎస్, క్రెడిట్స్ విధానాలను అమలులోకి తెచ్చారు. సెమిస్టర్ పరీక్షలను నిర్వహిస్తున్నారు. బయోమెట్రిక్ హాజరును ఉద్యోగులకు అమల్లోకి తెచ్చారు. ఇవన్నీ గుర్తింపు పొందేందుకు కలిసొచ్చే అంశాలే. ఇదేతీరులో ఉస్మానియా విశ్వవిద్యాలయానికి గుర్తింపు పొందేందుకు పలు అంశాలు దోహదం చేస్తున్నాయి. ఓయూ వీసీగా బాధ్యతలు చేపట్టిన ఎస్.రామచంద్రం.. ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించారు. విద్యాప్రమాణాలు మెరుగుపరిచేందుకు చాలా కసరత్తు చేశారు. శతాబ్ది ప్రారంభోత్సవాల నాటికి ఈ గుర్తింపు సాధించాలని ఎంతో ప్రయత్నం చేశారు. ఈయన బాధ్యతలు స్వీకరించిన తర్వాత తక్కువకాలంలోనే ఈ ప్రారంభోత్సవాలు రావడంతో 'గుర్తింపు' సాధ్యంకాలేదు.



జేఎన్‌టీయూహెచ్‌లో పర్యటిస్తున్న న్యాక్ బృందం

సానుకూల అంశాలే ఎక్కువ..

జేఎన్‌టీయూ హెచ్, ఉస్మానియా విశ్వవిద్యాలయాలకు న్యాక్ గుర్తింపు దక్కే తరుణం ఆసన్నమైంది. వీటిల్లో చాలా సమస్యలకు పరిష్కారం లభించింది. నిధుల లోటు కారణంగా దీర్ఘకాలిక సమస్యలు మాత్రం అలాగే ఉండిపోయాయి. న్యాక్ బృందం వచ్చేలోపు అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఉస్మానియా అధికారులు ప్రయత్నించినా నిధుల సమస్య వెంటాడింది. జీతాలు సకాలంలో ఇవ్వడానికే ఇబ్బందిపడిన పరిస్థితి నుంచి గట్టెక్కినా.. అభివృద్ధి పనులకు సమృద్ధిగా నిధులు లేవనే చెప్పాలి. ప్రభుత్వం ప్రకటించిన రూ.200 కోట్లులో రూ.50 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. మిగతా నిధులు వచ్చిఉంటే వర్సిటీలో మరిన్ని పనులు పూర్తయ్యేవి. శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో వేసిన రహదారులు, భవనాలకు రంగులు వంటి పలు కార్యక్రమాలు న్యాక్ గుర్తింపు పొందేందుకు కలిసొచ్చాయనే చెప్పాలి. వసతి గృహాలు మెరుగుపడ్డాయి. రహదారులు, భవనాలు ఆకర్షణీయంగా రూపుదిద్దుకున్నాయి. ఇలాంటి పలు అంశాలు న్యాక్‌లో మంచి గ్రేడ్ వచ్చేందుకు దోహదపడనున్నాయి.

ప్రశాంతంగా మూడురోజుల పర్యటన

ఉస్మానియా, జేఎన్‌టీయూ హెచ్‌ల్లో న్యాక్ బృందాలు ఈనెల 17 నుంచి మూడు రోజులపాటు విస్తృతంగా పర్యటించాయి. 17వ తేదీ ఉదయం నుంచి ప్రారంభమైన ఈ బృందాల పరిశీలన శనివారం సాయంత్రం వరకు అదే జోరుగా సాగింది. ఈ మూడు రోజుల్లో ఆయా విభాగాలను న్యాక్ బృంద సభ్యులు నిశితంగా పరిశీలించారు. జేఎన్‌టీయూ హెచ్‌లో న్యాక్ బృందంలో ఉన్న ఆరుగురు సభ్యులు, ఉస్మానియాలో తొమ్మిది మంది సభ్యులున్నారు. వీరంతా పలు బృందాలుగా విడిపోయి వర్సిటీల్లోని దాదాపు అన్ని విభాగాలను సందర్శించారు. ఆయా విభాగాలు ఎంతకాలం నుంచి వర్సిటీల్లో ఉన్నాయో ఆరా తీశారు. వాటి బడ్జెట్ వివరాలు, చేస్తున్న కార్యకలాపాలు తదితరాల గురించి ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడి వసతులను నేరుగా వీక్షించారు. పర్యటన ప్రారంభం నుంచి చివరి వరకు ప్రతి సంఘటనను సంబంధించి చిత్రాలు, వీడియోలను తీయించారు. మూడు రోజుల న్యాక్ బృందాల పర్యటన అంతా ప్రశాంతంగా సాగింది.

గ్రేడ్‌పై వీడని ఉత్కంఠ..

వర్సిటీల వీసీలు, అధికారులు న్యాక్ నుంచి మంచి గ్రేడ్ వస్తుందని ఆశిస్తున్నారు. ఈ గుర్తింపు నెల రోజుల్లోనే రావచ్చని పేర్కొన్నారు. న్యాక్‌లో ఏ, ఏప్లస్, ఏప్లస్‌ప్లస్ గ్రేడుల్లో ఏది దక్కుతుందో వేచి చూడాల్సిందే. ప్రస్తుతం వర్సిటీల్లోని పరిస్థితుల రీత్యా రెండు వర్సిటీలకు 'ఏ లేదా ఏ ప్లస్' గ్రేడులే దక్కవచ్చని విద్యారంగ నిపుణులు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ రెండు వర్సిటీల్లో చాలా దీర్ఘకాలిక సమస్యలున్నాయని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా వీటిపై అవి దృష్టిపెట్టలేకపోయాయని వారు పేర్కొన్నారు. ఇదిఒక్కటే మంచి గ్రేడ్‌లు దక్కేందుకు ప్రతికూల అంశమైందన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు మాత్రం గ్రేడు ఏది వస్తుందనే ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు.

రూ.25 లక్షల గుట్కా సంచుల స్వాధీనం

మూసాపేట: నిషేధిత గుట్కా సంచుల్ని రవాణా చేస్తున్న వ్యక్తిని కూకట్‌పల్లి పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. అతని నుంచి రూ.25 లక్షల విలువైన గుట్కా సంచులను స్వాధీనం చేసుకున్నారు. కూకట్‌పల్లి ఠాణాలో శనివారం విలేకర్ల సమావేశంలో ఏసీపీ ఎన్.భుజంగరావు కేసు వివరాల్ని వెల్లడించారు. వైజాగ్‌కు చెందిన పెంచల నాయుడు, గద్దె నరేంద్ర కూకట్‌పల్లి సాగర్ హోటల్ వెనకాల కావేరి కార్గ్ పేరుతో ఓ గోదాం నిర్వహిస్తున్నారు. ఇక్కడి నుంచి గుట్కాలు రవాణా అవుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సీఐ వడ్డె ప్రసన్నకుమార్ నేతృత్వంలోని సిబ్బంది గోదాముపై దాడి చేశారు. డీసీఎం వ్యానులో రవాణాకు సిద్ధంగా ఉంచిన 38 గుట్కా సంచుల్ని స్వాధీనం చేసుకున్నారు. గోదాం సూపర్‌వైజర్ భీమవరం నివాసి కమ్మెర శ్రీరాంకుమార్(29)ను అరెస్ట్ చేశారు.

చరవాణి ఇస్తానంటూ మోసం

ఈనాడు, హైదరాబాద్: తక్కువ ధరకే చరవాణి ఇస్తానంటూ మోసం చేసిన శీలంశెట్టి సత్యకిశోర్‌ను సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. రెండు చరవాణులు స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్ శంకర్‌రాజు తెలిపారు. ప.గో.జిల్లా అరికిరేవులకు చెందిన సత్యకిశోర్ ఉపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చాడు. ప్రైవేటు ఉద్యోగం చేస్తూ ఆల్విన్‌కాలనీ సమీపంలోని బోర్డ్ పటాన్‌చెరులో ఉంటున్నాడు. ఇటీవల రూ.7500కు చరవాణిని విక్రయిస్తానంటూ ఆన్‌లైన్‌లో పెట్టాడు. నరేందర్ తాను రూ.6500కు కొంటానని చెప్పాడు. డబ్బు పంపితే వెంటనే చరవాణి ఇచ్చేస్తానని, బ్యాంకు ఖాతాలో నగదు వేయాలని నరేందర్‌కు సత్యకిశోర్ చెప్పాడు. రూ.6500ను అతడు సూచించిన ఖాతాలో వేశాడు. ఆతరవాత సత్యకిశోర్ స్పందించలేదు. బాధితుడు సీసీఎస్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సత్యకిశోర్ కదలికలపై నిఘా ఉంచి శనివారం అదుపులోకి తీసుకొని జ్యుడిషియల్ కస్టడీకి తరలించారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

పేలుడు జరిగినట్లు పోలీసుల అనుమానం

హయత్‌నగర్, న్యూస్‌టుడే: అనుమానాస్పద స్థితిలో ఒక వ్యక్తి కాలిన గాయాలతో మృతి చెందిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తొర్రూర్ గ్రామానికి చెందిన తిప్పగళ్ల పరశురాం(24) కొంత కాలంక్రితం వరకు ప్రైవేటు సెల్యులర్ కంపెనీలో పనిచేసేవాడు. ఏడాదిన్నర క్రితం అతనికి వివాహం జరిగింది. ఏడాది నుంచి ఖాళీగా ఉంటున్నాడు. దీంతో కుటుంబసభ్యుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో పక్షం రోజుల క్రితం తల్లిదండ్రులు, సోదరుడు ఇంట్లో నుంచి వెళ్లిపోయి వేరుగా ఉంటున్నారు. ఈనెల 13న గుంతపల్లిలోని పుట్టింట్లో బోనాల పండగ ఉందని పరశురాం భార్య స్వగ్రామానికి వెళ్లింది. శనివారం ఉదయం 8.40 గంటలకు పరశురాం కాలిన గాయాలతో మృతిచెందినట్లు స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకుని ఆమె ఇంటికి తిరిగి వచ్చింది. ఆత్మహత్య చేసుకున్నాడా.. లేక పేలుడు జరిగిందా అనేది నిర్ధారణ కాలేదు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇంటి పైకప్పు రేకులు పగిలిపోవడం, వస్తువులు కాలిపోవడాన్ని బట్టి పేలుడు జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. రైస్ కుక్కర్ పేలుడు వల్ల ప్రమాదం జరిగిందా లేక ఇతర కారణలేమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తును కొనసాగిస్తున్నారు. ఇంట్లో కిరోసిన్ సీసాను స్వాధీనం చేసుకున్నారు. సంఘటనా స్థలాన్ని రాచకొండ పోలీస్ కమిషనర్ మహేశ్ భగవత్, హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నరేందర్‌గౌడ్, ఏసీపీ రవీందర్‌రెడ్డి, డీసీపీ వెంకటేశ్వరరావు, క్లూస్‌టీం, నిఘావర్గాలు పరిశీలించి వివరాలు సేకరించారు.



ప్రమాదానికి కారణంగా భావిస్తున్న రైస్ కుక్కర్



పరశురాం(పాతచిత్రం)

ఉగ్రకోణంలో దర్యాప్తు... పేలుడు జరిగిన విధానంపై వస్తున్న అనుమానాలు, పరశురాం ఇంట్లో ఓ మతగ్రంథం దొరకడం, అతను ఇతర పేర్లతో తిరుగుతున్నాడన్న సమాచారంతో పోలీసులు ఉగ్రకోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.



చాగంటి కోటేశ్వరరావుతో మురళీముకుంద్ తదితరులు

ఆత్మవిశ్వాసంతో లక్ష్య సిద్ధి: చాగంటి కోటేశ్వరరావు

ఫిలింనగర్, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కాలన్ని సద్వినియోగం చేసుకుని ఆత్మవిశ్వాసంతో లక్ష్య సాధనకు కృషి చేయాలని ప్రముఖ ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు విద్యార్థులకు ఉద్బోధించారు. జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంపై శనివారం ప్రవచనాలు చేశారు. ఆదర్శ, ఉన్నత వ్యక్తిత్వం కల్గిన అబ్దుల్ కలాం, నెల్సన్ మండేలా వంటి జీవిత చరిత్రలను విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. పముఖుల జీవిత విశేషాలను చదివి స్ఫూర్తి పొందాలని సూచించారు. చదువుతో పాటు వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలని కోరారు. విద్యార్థుల ఉన్నత లక్ష్య సాధనకు స్వేచ్ఛతో కూడిన విద్యను అందిస్తున్నట్లు పాఠశాల ఛైర్మన్ ఎ.మురళీముకుంద్ తెలిపారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత గాయత్రీ ఆలపించిన మైత్రీ భజనామ్ సంకీర్తన అలరించింది. కోటేశ్వరరావు, గాయత్రీలను ఎ.మురళీముకుంద్, ప్రిన్సిపల్ ఎం.వరలక్ష్మీ, అకాడమిక్ డైరెక్టర్ జి.శ్రీదేవి ఘనంగా సత్కరించారు.

97 శాతం సరఫరా చేస్తే 30 కోట్ల ఇళ్లలో చీకట్లా..?



సమావేశంలో మాట్లాడుతున్న పీఎన్ చౌదరి

బాగ్‌లింగంపల్లి: దేశంలో 30 కోట్ల మంది ఇళ్లకు విద్యుత్తు సరఫరా లేదని కేంద్ర పార్లమెంటరీ కమిటీ నివేదికలు వెల్లడిస్తుంటే కేంద్ర సర్కారు మాత్రం దేశంలో 97 శాతం విద్యుత్తు సరఫరా చేస్తున్నట్లు గొప్పలు చెప్పుకోవడం దుర్మార్గమని ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ప్రధాన కార్యదర్శి పీఎన్ చౌదరి అన్నారు. విద్యుత్తు రంగాన్ని కంటెంట్, క్యారియర్ అనే రెండు ముక్కలు చేసేందుకు చర్యలు చేపట్టిందన్నారు. సుందరయ్య కళా నిలయంలో నిర్వహిస్తోన్న ఫెడరేషన్ జాతీయ 8వ మహాసభలను పురస్కరించుకుని శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గ్రామంలో పంచాయతీ వద్ద ఒక్క దీపం వెలిగించి గ్రామంలోని అన్ని ఇళ్లలో విద్యుత్తు వెలుగులు వెలిగించామంటే సరికాదన్నారు. 2014 ఎలక్ట్రిసిటీ చట్టం అమలైతే విద్యుత్తు వినియోగదారులు, ఉద్యోగులపై పెను భారం పడనుందన్నారు. భారం పడకుండా తమ పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ... ప్రభుత్వం విద్యుత్తు రంగంలోని ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామన్న హామీని నిలబెట్టుకోవాలన్నారు. సదస్సులో ఫెడరేషన్ అధ్యక్షుడు కేవో హబీబ్, సీఐటీయూ జాతీయ, రాష్ట్ర నేతలు పాలడుగు భాస్కర్, ఎన్.వెంకటేశ్వర్లు, ఎస్.రమ తదితరులు పాల్గొన్నారు.

మద్యం నిషేధంపై రాజకీయంగా చర్చించాలి

భాజపా రాష్ట్ర అధ్యక్షులు డా.కె.లక్ష్మణ్

పంజాగుట్ట: బడి, గుడి కంటే మద్యం దుకాణాల వద్దే రద్దీ తీవ్రంగా ఉందని ఇది దురదృష్టకరం అని భాజపా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. శనివారం ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో అకడమిక్స్ ఇనిషియేటివ్ సంస్థ ఆధ్వర్యంలో 'తెలంగాణలో మద్యం మహమ్మారి' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న పింఛను తిరిగి మద్యం దుకాణాలకే చేరుతోందన్నారు. మద్యం నియంత్రణపై రాజకీయంగా నిర్ణయం తీసుకుంటే తప్ప నిషేధం సరిగా అమలు కాదన్నారు. మద్య నియంత్రణకు తమ పార్టీలో ప్రస్తావించి రాజకీయంగా ఓ నిర్ణయం తీసుకునేందుకు చర్చించేలా కృషి చేస్తానన్నారు. అకడమిక్స్ ఇనిషియేటివ్ ఛైర్మన్ డా.డి.మనోహర్ రావు మాట్లాడుతూ ప్రజా ఉద్యమంగా మద్య నిషేధం కోసం కృషి చేయాలన్నారు. సైకాలజిస్ట్ డా.వీరేంద్ర, ఉస్మానియా వర్సిటీ విశ్రాంత ప్రిన్సిపల్ డా.శేషగిరిరావు, ప్రొ.హేమంతరావు, భాజపా రాష్ట్ర కార్యదర్శి డా.జి.మనోహర్ రెడ్డి, ఆర్‌అండ్‌బీ విశ్రాంత చీఫ్ ఇంజినీర్ రఘుమారెడ్డి, ఇంటాక్ హైదరాబాద్ అధ్యక్షులు పి.అనూరాధారెడ్డి, ఉస్మానియా ఉమెన్స్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ బీటీ సీత, సైకాలజీ డా.పుష్ప అభిప్రాయాలు పంచుకున్నారు.




ప్రసంగిస్తున్న డా.కె.లక్ష్మణ్

రాజేంద్రనగర్

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

కాటేదాన్, శివరాంపల్లి: గగన్‌పహాడ్ విద్యుత్తు సబ్‌డివిజన్ 11కేవీ ఫీడర్స్ పరిధి మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ దరశథ్ పేర్కొన్నారు. కాటేదాన్ 2, గగన్‌పహాడ్ 33 కేవీ, 11కేవీ కాటేదాన్ సిటిజన్ కాంట పరిధిలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు అంతరాయం ఉంటుందని తెలిపారు. గగన్‌పహాడ్, కాటేదాన్, లక్ష్మీగూడ, పద్మశాలిపురం, మధుబన్, పరిసర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు.

ఒక్కొక్కటిగా మాయం



- ☛ మొన్న పామాయిల్, నిన్న చక్కెర..నేడు కిరోసినా?
- ☛ ప్రజా పంపిణీ వ్యవస్థకు తూట్లు.. ప్రజలకు ఇక్కట్లు

కాటేదాన్, న్యూస్‌టుడే:

పేద, మధ్య తరగతి ప్రజలకు నిత్యావసర సరకుల కల్పతరువుగా ఉన్న ప్రజాపంపిణీ వ్యవస్థ క్రమంగా నిర్వీర్యమవుతోంది. నాలుగు నెలల క్రితం కిరోసిన్ కోటాను తగ్గించిన ప్రభుత్వం... రెండు నెలల నుంచి చక్కెర కోటాకు కోత విధించింది. కేవలం అన్నపూర్ణ కార్డులకు కేజీ చక్కెరను అందించనున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్లో 60 రేషన్ దుకాణాలు, 54,716 ఆహార భద్రతా కార్డుదారులున్నారు. అందులో అన్నపూర్ణ కార్డులు 1532 ఉన్నాయి. అంటే ఒక్కో దుకాణానికి సుమారు ఇరవై వరకు అన్నపూర్ణ కార్డులుండే అవకాశం ఉంది. కానీ పలువురు డీలర్లు వారికి కూడా చక్కెర అందించలేని పరిస్థితిలో ఉన్నారు. బియ్యం సరిగ్గా అందక.. ఇతర సరుకులు రాక... తెచ్చిన వాటితో ఫలితంలేక ఆహార భద్రత డీలర్లు సైతం ఇబ్బందులు పడుతున్నారు. గోదుమలు ఉంటున్నా వాటిని కొనుగోలుచేయడానికి కార్డుదారులు విముఖత చూపుతున్నారు. మాకు బియ్యంతోపాటు చక్కెర, కిరోసన్ తప్పని సరిగా ఇవ్వాలని వారు డీలర్లను కోరుతుండడం గమనార్హం. గత ప్రభుత్వ హయాంలో లభించే పామాయిల్ మాయమైంది. మళ్లీ ఇస్తారన్న ఆశలు లేవని.. ఇలా ఒక్కొక్కటీ సరకులు మాయమవుతుంటే ఎలా అని కార్డుదారులు ప్రశ్నిస్తున్నారు.

పేదలకు భారం

రాజేంద్రనగర్ సర్కిల్లోని కాటేదాన్, గగన్‌పహాడ్, హసన్‌నగర్ తదితర పారిశ్రామికవాడల్లో 65 వేలమంది కార్మిక కుటుంబాలున్నాయి. కార్డుదారులందరికి ప్రతీ నెల రెండులీటర్ల కిరోసిన్ లభించేది. తాజాగా కోటాలో కోత విధించడంతో ప్రస్తుతం ఒక్క లీటరుతోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి. అంటే బయట రూ.20 లేదా రూ.30కు కొనుగోలు చేయాల్సిందే. అసలే వర్షాకాలం నిరుపేదలకు కట్టెలు లేక ఇటు స్టౌలో కిరోసిన్ లేక అల్లాడుతున్నారు.

గ్యాస్ సిలిండర్లు అందిస్తారా?

ఇకపై చౌకధరల దుకాణంలో గ్యాస్ లభించనుందని వార్తలొచ్చాయి. కిరోసిన్ బాధ తప్పి.. గ్యాస్ సిలిండర్లు చౌకధరకు అందిస్తే వంట చేసుకోడానికి పూర్తిగా వీలుంటుందని కార్డుదారులు ఆశిస్తున్నారు. ఏదేమైనా కార్డులు దక్కించుకున్న అర్హులు అవి తమకు ఆసారాగా ఉండాలని భావిస్తున్నారు. కానీ ఒక్కొక్క సరకును తొలగిస్తూ.. కేవలం బియ్యానికే పరిమితం చేయడం వల్ల కార్డు ఉన్నా.. పెద్దగా ప్రయోజనం ఏమీ ఉండదని పలువురు పేర్కొంటున్నారు.



కిరోసిన్ సరఫరా తగ్గించం: ఏఎస్‌ఓ

ప్రస్తుతం అందుతున్న కిరోసిన్ తగ్గించబోమని రాజేంద్రనగర్ సర్కిల్ ఏఎస్‌ఓ శ్రీనివాస్ పేర్కొన్నారు. చక్కెరను కేవలం అన్నపూర్ణ కార్డుదారులకు అందిస్తున్నామన్నారు. ఉన్నతాధికారుల నిర్ణయం మేరకే సరకులు అందజేస్తున్నామని అన్నారు.

సేంద్రీయ పంటలతోనే ఆరోగ్యం



పండ్లు, కూరగాయల ఉత్సవంలో విద్యార్థులు

మణికొండ, న్యూస్‌టుడే: సహజసిద్ధంగా పండించే కూరగాయలు, పండ్ల ప్రాధాన్యం గుర్తించడంతోనే ఆరోగ్యం జీవించే వీలుందని ప్రిసం ఇంటర్నేషనల్ పాఠశాల ఛైర్మన్ ఎం.రామలింగం అన్నారు. శనివారం అల్కాపూర్ టౌన్‌షిప్‌లోని పాఠశాల ప్రాంగణంలో పండ్లు, కూరగాయల ప్రాధాన్యం తెలిపేలా నృత్యరూపకాన్ని, అంగడి నిర్వహణను విద్యార్థులు నిర్వహించారు. ఈ సందర్భంగా కూరగాయలు, పండ్లలో లభించే పోషకాలు తదితరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఎం.లక్ష్మి, ఉపాధ్యాయురాలు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

మొక్కలు నాటడం బాధ్యతగా భావించాలి



మొక్క నాటుతున్న నాయకులు

రాజేంద్రనగర్: మొక్కలు నాటడం ప్రతిఒక్కరు బాధ్యతగా భావించాలని అత్తాపూర్ వార్డు కమిటీ సభ్యులు పి.నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం అత్తాపూర్ సూర్యభగవాన్ దేవాలయం సమీపంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ... మొక్కలు నాటడంతో పాటు సంరక్షించినప్పుడే తగిన ఫలితం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు జన్మదినం తదితర శుభకార్యాలకు మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలని అన్నారు. తెరాస నాయకులు గుర్రంపల్లి యాదగిరి, సుభాష్‌యాదవ్, శ్రీపాల్ గౌడ్, బోయరమేష్ తదితరులు పాల్గొన్నారు.

టీకాల్లో ప్రైవేటు విద్యాసంస్థలు ముందుండాలి



టీకాల పంపిణీ కార్యక్రమంలో సర్పంచి నరేందర్‌రెడ్డి

మణికొండ: ప్రాణాంతకమైన వ్యాధుల నివారణకు చేపట్టిన టీకాలు పంపిణీ కార్యక్రమంలో ప్రైవేటు విద్యాసంస్థలు ముందుండాలని మణికొండ గ్రామ సర్పంచి కె.నరేందర్‌రెడ్డి కోరారు. శనివారం గ్రామంలోని గౌతమి పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తట్టు, రుబెల్లా టీకాను చిన్నారులకు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని విద్యాసంస్థలు చిన్నారులకు తప్పనిసరిగా టీకాలు వేయించేలా చొరవ చూపాలని కోరారు. ఎంపీటీసీ సభ్యుడు రాఘవరెడ్డి, పర్యవేక్షకుడు రూపేష్, ఎఎన్‌ఎం, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

రాజేంద్రనగర్: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన రాజేంద్రనగర్ ఠాణా పరిధిలో శుక్రవారం రాత్రి జరిగింది. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కిషన్‌బాగ్‌కు చెందిన మహ్మద్‌అలీ(55) హైదర్‌గూడకు పని నిమిత్తం వచ్చాడు. తిరిగి వెళ్లే సమయంలో హైదర్‌గూడలోని 141వ పిల్లర్ వద్ద రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో మెహిదీపట్నం నుంచి ఆరాంఘర్ వైపు వెళ్తున్న ఓ గుర్తు తెలియని వాహనం మహ్మద్‌అలీని ఢీకొట్టింది. తలకు తీవ్రమైన గాయాలు కావడంతో మహ్మద్‌అలీ అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బంధువులు అక్కడికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు.

భగవత్‌గూడలో పాఠశాలను తెరిపించాలి

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: రాజేంద్రనగర్ సర్కిల్ భగవత్‌గూడలో మూసివేసిన ప్రభుత్వ పాఠశాలను వెంటనే ప్రారంభించాలని యూటీఎఫ్ రాజేంద్రనగర్ మండల అధ్యక్షులు టెలీశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి పి.భూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఇటీవల 17మంది విద్యార్థులు ఉన్న ఇక్కడి పాఠశాలను విద్యాశాఖ అధికారులు మూసివేయించారని అన్నారు. ఇది నిబంధనలకు విరుద్ధమని, నివాస ప్రాంతాలలోని పాఠశాలలో 10 మంది విద్యార్థులు ఉన్నా కొనసాగించాలనే నిబంధనలు ఉన్నాయన్నారు. అయితే ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా, విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించకుండా పాఠశాలను మూసి వేయించారని అన్నారు. అక్కడ చదువుతున్న విద్యార్థులను బుద్వేల్ పాఠశాలలో ప్రవేశాలు పొందాలని సూచించారని తెలిపారు. అయితే 14మంది విద్యార్థులు పాఠశాలలో చేరగా, దూరం కారణంగా మిగిలిన విద్యార్థులు ప్రవేశాలు పొందలేదన్నారు. వీరి చదువు అర్ధాంతరంగా నిలిచిపోవడానికి కారణమైన మండల విద్యాధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఓటర్ల జాబితాలో సవరణలు ప్రారంభం

ఇంటింటికి తిరిగి ట్యాబ్‌లలో వివరాలు

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో ఎట్టకేలకు ఓటర్ల సవరణ కార్యక్రమం ప్రారంభమైంది. ట్యాబ్‌లలో ఓటర్ల వివరాలను నమోదు చేస్తామని గత కొంతకాలంగా అధికారులు పేర్కొంటున్న సంగతి తెలిసిందే. సర్కిల్ కార్యాలయానికి ట్యాబ్‌లు వచ్చి చాలా రోజులు అవుతున్నా సాంకేతిక సమస్య కారణంగా ఇంకా ప్రారంభించలేదు. ఎట్టకేలకు సమస్యలు పరిష్కరించిన అధికారులు శనివారం ఇంటింటికి తిరిగి ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు చేయడం ప్రారంభించారు. సర్కిల్ ఉపకమిషనర్ విజయలక్ష్మీ, అసిస్టెంట్ కమిషనర్ రాజారావు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ మహేందర్ నేతృత్వంలో మొదట శాసన సభ్యులు ప్రకాష్‌గౌడ్ ఇంటికి వెళ్లి ఆయన ఓటుకు సంబంధించిన వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా కొత్త విధానంపై ఎమ్మెల్యేకు వివరించారు. ఏవైన మార్పులు ఉంటే వెంటనే చేసుకునేలా ఉన్న అవకాశాలను వివరించారు. రాజేంద్రనగర్ కార్పొరేటర్ కోరని శ్రీలతా మహత్మా ఇంటికి వెళ్లిన సిబ్బంది ఆమె వివరాలను నమోదు చేశారు. ఇంటింటికి తిరిగి మార్పులు చేర్పులు చేపట్టనున్నారు. అయితే గతానికి భిన్నంగా ఈసారి మొత్తం ట్యాబ్‌లలోనే వివరాలు నమోదు చేయనున్నారు. ఎవరైనా తమ ఓటును నమోదు చేసుకోవలన్నా, చిరునామా మార్చుకోవాలన్నా ట్యాబ్‌లలో వెంటనే నమోదు చేసి అప్పటికప్పుడు మార్పులు చేస్తారని సర్కిల్ ఉపకమిషనర్ విజయలక్ష్మీ అన్నారు. ఓటర్ల సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.



ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

మంత్రి ఆదినారాయణ రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

శంషాబాద్: ఏపీ మంత్రి ఆదినారాయణరెడ్డిపై చర్యలు తీసుకోవాలని లంబాడ హక్కుల పోరాట సమితి నాయకులు కేతావత్ రామూనాయక్ అన్నారు. శనివారం ఆర్‌జీఐఏ ఠాణా సీఐ రమేశ్‌నాయక్‌కు వారు ఫిర్యాదు చేశారు. రామూనాయక్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీలకు చదువురాదు, శుభ్రంగా ఉండరంటూ అవమాన పరిచే విధంగా మంత్రి మాట్లాడారని ఆరోపించారు.

రాజేంద్రనగర్

మురుగుకు వరద తోడైంది

☛ బస్తీల్లోని రహదారులపై పారుతున్న డ్రైనేజీ ☛ తాత్కాలిక చర్యలతో సరిపెడుతున్న అధికారులు

అత్తాపూర్, న్యూస్‌టుడే:

వర్షంపడిందంటే చాలు రాజేంద్రనగర్ సర్కిల్లోని పలు ప్రాంతాలలో మురుగు సమస్య తీవ్రంగా మారుతోంది. చిన్నపాటి వర్షానికే మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లుతున్నాయి. పలు బస్తీలలో ఈ సమస్య అధికంగా ఉంది. అయినా అధికారులు శాశ్వత చర్యలవైపు దృష్టి సారించడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. అత్తాపూర్, రాజేంద్రనగర్, సులేమాన్‌నగర్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లలో సమస్య అధికంగా ఉంది. రాజేంద్రనగర్ డివిజన్ ఎర్రబోడలో ఈ సమస్య తరచూ ఏర్పడుతోంది. ఎన్నో నెలలుగా స్థానికులు అధికారులకు మొరపెట్టుకుంటున్నా తాత్కాలికంగా పనులు చేస్తున్నారు. అత్తాపూర్ డివిజన్ రాంబాగ్‌లో సమస్య మరింత జటిలంగా మారింది. ఇక్కడ సాధారణంగానే మురుగు ఎక్కడికక్కడ నిలిచిపోతుంది. ఇక వర్షపడితే సమస్య తీవ్రమవుతుంది. రాంబాగ్‌లో డ్రైనేజీ వ్యవస్థ సరిగాలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడినప్పుడు మురుగు రహదారులపై పొంగుతోంది. దీంతో నడవలేని పరిస్థితి నెలకొంటుంది. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ నేతాజీనగర్, ఆదర్శ కాలనీ తదితర బస్తీలలో సమస్య తీవ్రంగా ఉంది. అధికారులకు సమస్య గురించి పూర్తిగా తెలుసునని, అయినా చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

తాత్కాలిక పరిష్కారం ఎంతకాలం?

ప్రస్తుతం సర్కిల్లోని మురుగు సమస్యపై అధికారులు దృష్టి పెట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. సమస్య ఏర్పడిన వెంటనే స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. ఇలా ఫిర్యాదు చేసిన వారం. రెండు వారాలకు అధికారులు ఆ సమస్యలను పరిశీలిస్తున్నారు. పారిశుద్ధ్య సిబ్బందితో తాత్కాలికంగా మరమ్మతులు చేయిస్తున్నారు. అప్పటికి సమస్య తీరినా.. మరో పదిరోజులకు మళ్లీ పునరావృతం అవుతోంది. సర్కిల్లోని చాలా ప్రాంతాలలో ఇదే సమస్య ఉంది. అయితే శాశ్వత పరిష్కారం చేపట్టడానికి తమకు అనుమతి లేదని అధికారులు అంటున్నారు. ప్రస్తుతం సర్కిల్‌లో రూ.314కోట్ల డ్రైనేజీ పనులు జరుగుతున్న కారణంగా ఆ సమస్యలను సంబంధిత జలమండలి ప్రాజెక్టు అధికారులే పరిష్కరించాల్సి ఉంటుందని అంటున్నారు. మరోవైపు జలమండలి ప్రాజెక్టు అధికారులు సర్కిల్లో తమ పనులు ఇప్పటికే ప్రతిపాదనల కంటే ఎక్కువ చేశామని చెబుతున్నారు. ప్రస్తుతం కొన్నిచోట్ల ప్రధాన లైన్లు ఏర్పాటు చేయడం మినహా మా పనులు పూర్తయ్యాయని వారు అంటున్నారు. ఆయా మురుగు సమస్యలను సర్కిల్ అధికారులే చూసుకోవాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. జలమండలి ప్రాజెక్టు విభాగం అధికారులు పనులు చేయనిచోట పరిస్థితి మరోరకంగా ఉంది. మైలార్‌దేవ్‌పల్లిలోని ఆదర్శకాలనీలో మురుగు సమస్య తరచూ ఏర్పడుతోంది. వర్షం పడినప్పుడు తీవ్రత రెట్టింపు అవుతోంది. ఇలా సమస్య ఏర్పడిన వారం పదిరోజులకు అధికారులు వచ్చి తాత్కాలికంగా పనులు చేసి వెళ్తున్నారు. శాశ్వత పరిష్కారం చూపడంలేదు.



చర్యలు తీసుకుంటున్నాం: విజయలక్ష్మీ, డీసీ

సర్కిల్లోని చాలా బస్తీలలో మురుగు సమస్య ఉన్నమాట వాస్తవమేనని సర్కిల్ ఉపకమిషనర్ విజయలక్ష్మీ అన్నారు. వర్షం పడినప్పుడు సమస్య అధికంగా ఉంటుందన్నారు. అయితే సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాలలో సిబ్బంది ఎప్పటికప్పుడు పనులు నిర్వహిస్తున్నారని అన్నారు. శాశ్వత పరిష్కారం చేయడానికి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మట్టి గణపతులనే పూజిద్దాం



మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కాటేదాన్: పర్యావరణాన్ని కాపాడేది మట్టి గణపతులేనని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ డీసీ విజయలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం మైలార్‌దేవుపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రజలకు మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మట్టి విగ్రహాలతో చెరువుల్లో కాలుష్యం ఉండదని అన్నారు. మట్టి ప్రతిమలను పూజించి ఇళ్లలోనే నిమజ్జనం చేసుకోవాలని కోరారు. బకెట్లు లేదా చిన్నపాటి సంపుల్లో విగ్రహాలను నిమజ్జం చేసి.. ఆ నీటిని తమ ఇళ్లలో మొక్కలు, చెట్లకు ఉపయోగించాలని అన్నారు. సర్కిల్ ఉపకమిషనర్ విజయలక్ష్మి మాట్లాడుతూ మట్టి గణపతులు, సహజ రంగులద్దిన గణేషులను పూజించాలని పిలుపునిచ్చారు. విజయ్‌కుమార్, సరికొండ వెంకటేష్, బుచ్చయ్యగుప్త, రాజు ముదిరాజ్, మహిళలు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

కాటేదాన్: ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను శనివారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే బాధితులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫర్హానాబేగంకు రూ.60వేలు, లక్ష్మారెడ్డికి రూ.25వేలు, రమేష్‌కు రూ.40వేల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని విధాల ప్రజలను ఆదుకుంటున్నారన్నారు. మైలార్‌దేవుపల్లి డివిజన్ తెరాస అధ్యక్షులు సరికొండ వెంకటేష్ పాల్గొన్నారు.

కళాశాలల్లో స్వాగత వేడుకలు



శంషాబాద్‌లో విద్యార్థినుల నృత్యం



అత్తాపూర్‌లో విద్యార్థినుల సందడి

శంషాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: శ్రీనారాయణ జూనియర్, ఎస్ఆర్ఎం డిగ్రీ కళాశాలల విద్యార్థుల స్వాగతోత్సవ వేడుకలు శనివారం అట్టహాసంగా జరిగాయి. విద్యార్థులు ఆడి పాడి అలరించారు. చదువులో, క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యం జ్ఞాపికలు అందజేసింది. కరస్పాండెంట్ డి. సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రామీణ విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడానికి కళాశాలల్లో ప్రవేశపెట్టిన సంస్కరణలు ఫలితం ఇస్తున్నాయన్నారు. అకడమిక్ డైరెక్టర్ కపిల్, ప్రిన్సిపాళ్లు నర్సింహ, పద్మకుమార్, పాల్గొన్నారు.

రాజేంద్రనగర్: అత్తాపూర్ శ్రీమేధ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. నూతన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ సీనియర్లు ఆటపాటలతో సందడి చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలతో పండగ వాతావరణం నెలకొంది. కళాశాల డైరెక్టర్ వీఎన్ అయ్యన్నబాబు మాట్లాడుతూ... ఎలాంటి చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్: శంషాబాద్‌లోని శ్రీమేథ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాలల ఛైర్మన్ కోటేశ్వర్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. విద్యార్థులకు చదువుతోపాటు కళలపై ఆసక్తి ఉండాలన్నారు. విద్యార్థులు నృత్యాలు అలరించాయి.

☛ గౌతమి కళాశాలలో జరిగిన ఫ్రెషర్స్‌డే వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాల డైరెక్టర్లు మల్లారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపల్ మహేశ్ తదితరుల పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో స్వచ్ఛభారత్



పాఠశాల ఆవరణలో గడ్డిని తొలగిస్తున్న విద్యార్థినుల తండ్రులు

నార్సింగి, న్యూస్‌టుడే: గండిపేట మండలంలోని నార్సింగి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పలుగు, పార చేతబట్టి పాఠశాల ప్రాంగణంలో గడ్డి తొలగించి శుభ్రం చేశారు. చెత్తను ఊడ్చారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కృపావరం మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిత్యం ఆచరణలో పెట్టాలన్నారు. మన పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నపుడే మన ఆరోగ్యం బాగుంటుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న తల్లిదండ్రులను ఆమె అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ మధురశ్రీ, కశాశాల వైస్ ప్రిన్సిపాల్ పద్మజ, తెలంగాణ గురుకుల విద్యాలయాల తల్లిదండ్రుల అసోసియేషన్ అధ్యక్షులు యాదయ్య, అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకు సమ్మె కొనసాగిస్తాం

శంషాబాద్ గ్రామీణ: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని తలపెట్టిన నిరవధిక సమ్మె శనివారం నాలుగోరోజుకు చేరింది. పాలమాకులలో తపాల కార్యాలయం వద్ద కొనసాగుతున్న నిరవధిక సమ్మెలో ఆల్‌ఇండియా గ్రామీణ తపాల ఉద్యోగ సంఘం వనపర్తి డివిజన్ కార్యదర్శి శంకరయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దిల్లీ, చెన్నై కోర్టులు ఇచ్చిన తీర్పును వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసి తపాల ఉద్యోగులను ఆదుకోవాలన్నారు. గ్రామీణ తపాల ఉద్యోగులకు 8గంటల పని కల్పించి సివిల్ సర్వెంట్ల హోదా ఇచ్చి చిత్తశుద్ధి చాటుకోవాలంటూ డిమాండ్ చేశారు. నర్సింహ, సాదిక్, హుస్సేన్, సురేష్, రాములు, రమేష్ పాల్గొన్నారు.

మీటర్ పెట్టారు.. పొదుపు బాట పట్టారు..

- నీటి తగాదాల పరిష్కారానికి అపార్ట్‌మెంట్లలో కొత్త ఒరవడి
- విచ్చలవిడి వాడకం.. లీకేజీలకు అడ్డుకట్ట
- బిల్లుల్లోనూ ఆదా

ఈనాడు, హైదరాబాద్

నగరంలో సహజంగా ఒక ఇంటికి ఒకటే నల్లా.. దానికి మీటరు బిగిస్తారు. కానీ ఒకే ఇంట్లో ఎన్నో పోర్షన్లు .. బహుళ అంతస్తుల్లో పదుల సంఖ్యలో ఫ్లాట్లు ఉంటాయి. వీటికి జలమండలి సరఫరా చేసే నీరు చాలక.. ఉన్న బోరు ఎండిపోయి.. సమయానికి ట్యాంకరు రాక.. వాటిలో నివసిస్తున్న వారు పడే అవస్థలు తలుచుకొంటే ఎవరికైనా వణుకు పుడుతుంది. ముఖ్యంగా వేసవిలో చాలామందికి ఇటు వంటి పరిస్థితులు అనుభవమే. ఇక్కడే గొడవలు మొదలై అప్పటివరకు అక్కా, వదినా అని పిలుచుకున్నవారే జుట్లు పీక్కునే దాకా వెళ్లేవి. అపార్ట్‌మెంట్లలో కొన్ని ఇళ్లలో నీరు ఎక్కువ వాడకం.. మరికొన్నింట తక్కువ వాడకం మామూలే. బిల్లు మాత్రం అందరూ సమానంగా భరించాలి. దీంతో వివాదాలు ముదిరి వాగ్వాదాలు.. కొన్నిసార్లు ఒకరినొకరు దూషించుకోవడం జరుగుతుంటుంది. వ్యక్తిగత ఇళ్లలోనూ కిరాయికి ఉండేవారు నీరు దుబారా చేస్తున్నారని యజమాని నిందిస్తుంటారు. చేరేటప్పుడు చెప్పిన దానికంటే ఎక్కువ మంది ఉంటున్నారని.. చుట్టాలు, స్నేహితుల రాక పెరిగిందని.. ఇలా మాటామాటా పెరిగి.. కొన్నిసార్లు ఈ వివాదాలు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుల దాకా వెళుతున్నాయి. బస్తీల్లో ట్యాంకర్ల వద్ద నీటి కోసం కొట్లాటల మాదిరి బహుళ అంతస్తుల్లో, వ్యక్తిగత ఇళ్లలో నీటి యుద్ధాలు నగరంలో సాధారణంగా మారాయి. జటిలమవుతున్న ఈ సమస్యకు .. ప్రతి ఫ్లాట్, ప్రతి నల్లాకు నీటి మీటర్లను ఏర్పాటు చేయడమే పరిష్కారంగా అపార్ట్‌మెంట్ అసోసియేషన్లు ముందుకు వెళుతున్నాయి.

మొదట్లో కరెంటూ ఇంతే..

ప్రస్తుతం ఒక ఇంట్లో ఎన్ని పోర్షన్లు ఉంటే.. వంటగది ఆధారంగా అన్ని విద్యుత్తు కనెక్షన్లు ఇస్తున్నారు. మొదట్లో ఇంటి మొత్తానికి ఒకటే కరెంట్ మీటరు ఇచ్చేవారు. ఎక్కువ కాలిస్తే తక్కువ ఛార్జీలు ఉండేవి. విద్యుత్తు డిమాండ్ అధికమవడం.. లభ్యత లేక టారిఫ్ పెరగడంతో వినియోగం పెరిగేకొద్దీ బిల్లులు పెరిగిపోయేవి. యజమానులకు, కిరాయిదారులకు మధ్య నెలనెలా కరెంట్ ఎక్కువ కాలుస్తున్నారనే విషయమై వాగ్వాదాలు జరిగేవి. దీంతో సబ్ మీటర్లు వచ్చాయి. ప్రస్తుతమైతే ప్రతి ఇంటికి విడిగానే మీటర్లు ఇస్తున్నారు. ఇప్పుడు ఇదే తరహాలో నీటి వంతు వచ్చింది. జనాభా.. అవసరాలు పెరగడంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. నీటి కోసం చాలా అపార్ట్‌మెంట్లు ట్యాంకర్ల మీద ఆధారపడుతున్నాయి. కొన్నిసార్లైతే అద్దెలో మరో సగం మొత్తం నీటికి ఖర్చు చేస్తున్నారు. అయినా ట్యాంకర్లు సరఫరా చేస్తున్న నీరు ఎలాంటిదో ఎవరికీ తెలియదు. పైకి ట్యాంకులోకి నీరు ఎక్కిస్తే గంటలోనే ఖాళీ అయ్యే పరిస్థితి. దీనికి పరిష్కారంగా మీటర్లను బిగించుకొంటున్నారు.

నగరంలో నీటి వినియోగం తీరిది..

వ్యక్తిగత అవసరాలకు	33%
మరుగుదొడ్ల వినియోగానికి	25.01%
దుస్తులు ఉతకడానికి	14%
తాగునీటికి	13.10%
పాత్రలు కడగడానికి	7.70%
గార్డెనింగ్‌కు	6.10%
వంటకు	0.09%
వాహనాల శుభ్రతకు	0.70%

నీటి కొరత నగరవాసులకు సరికొత్త పాఠాలు నేర్పింది.. బహుళ అంతస్తుల్లో ప్రతి ఫ్లాట్‌కు నల్లా మీటరు.. ఇంకా చెప్పాలంటే ఫ్లాట్‌లోని ప్రతి నల్లాకు నీటి మీటర్లు బిగించుకొంటున్నారు. బొట్టుబొట్టుకు లెక్కలేసుకుంటూ పొదుపుగా వినియోగిస్తున్నారు. దీంతో వృథా తగ్గడంతో పాటూ నీటికోసం చేస్తున్న వ్యయమూ తగ్గిందని నివాసితులు అంటున్నారు.

జనాభా అంచనాలు (లక్షల్లో)

పరిధి	2018	2021	2024	2031	2041
ఎంసీహెచ్	54.85	56.71	56.71	66.9	77.09
జీహెచ్‌ఎంసీ	69.98	75.77	89.34	120.7	165.63

ప్రస్తుత సరఫరా తీరిది..

2016 వేసవిలో 355 ఎంజీడీలు

2017 వేసవిలో 404 ఎంజీడీలు



వీటికి అదనంగా నీటి అవసరాలు..

10%	వాణిజ్య అవసరాలు
10%	పరిశ్రమలకు
10%	ఐటీ, సంస్థలకు
5%	అగ్ని ప్రమాదాల నివారణకు

నగరంలో వ్యక్తిగత నీటి వినియోగం ఇలా.. (సగటు.. అంచనా)

లీటర్లలో	
55	స్నానాదులకు
30	కాలకృత్యాలకు
20	దుస్తులు ఉతకడానికి
10	ఇంటి శుభ్రతకు
10	పాత్రలు కడగడానికి
5	వంటకు
5	తాగడానికి

వృథాకు అడ్డుకట్ట..

చాలా అపార్ట్‌మెంట్లలోని నివాసాల్లో నీటికొరతతో రోజులో కొద్ది సమయమే వదులుతుంటారు. ఆ సమయంలో డ్రమ్ముల్లో నింపిపెట్టుకొంటారు. మరుసటి రోజు నల్లా వదలగానే డ్రముల్లో మిగిలిన నీళ్లన్నీ ఎక్కువ మంది పారబోసి మళ్లీ నింపుతుంటారు. మంచినీళ్లు, బోరు నీళ్ల విషయంలోనూ ఇదే జరుగుతుంది.

- నీళ్లు పడుతుండగానే నల్లా బంద్ అయితే చాలామంది ఆపడం మర్చిపోయి వెళ్లిపోతారు. తర్వాత నీళ్లు ఎక్కించాక ఇంట్లో ఎవరైనా ఉంటే సరే. .. లేకపోతే వృథాగా పోతుంటాయి.
- పై అంతస్తులకు నీరు తక్కువగా వస్తుందని కొందరి ఫ్లాట్లకు పైపు సైజు పెద్దదిగా ఉంటుంది. దీంతోనూ గొడవలు జరుగుతుంటాయి.
- నల్లాలు కారుతున్నా చాలామంది తమకొచ్చిన నష్టమేమి అన్నట్లుగా వదిలేస్తుంటారు. మీటర్ల ఏర్పాటుతో ఇటువంటి సమస్యలన్నింటికి పరిష్కారం లభిస్తుందని ఇప్పటికే అమర్చుకున్నవారు తమ స్వీయ అనుభవాలను చెబుతున్నారు.

లీకేజీలకు చెక్..


ఇళ్లలో లీకేజీల ద్వారా నిత్యం చాలా నీరు వృథా అవుతుంది. సమస్య పెద్దదైతే తప్ప ఎక్కువ మంది స్పందించరు. అదే మీటరు ఉంటే ప్రతి బొట్టూ లెక్కలోకి వస్తుంది కాబట్టి వెంటనే మరమ్మతులు చేయిస్తారు. సాధారణంగా ఒక కుటుంబం రోజుకు 200 లీటర్లు వాడుతుంటే నెలకు 6000 లీటర్లు వినియోగించినట్లు బిల్లు రావాలి. ఒక వెయ్యి అటుఇటుగా వచ్చినా ఫర్వాలేదు. అలాకాకుండా 10వేల లీటర్లు వాడినట్లు వచ్చిందంటే నీరు వృథా అవుతున్నట్లే లెక్క. ఎక్కడైనా లీకేజీలు ఉండొచ్చు.. లేదంటే దుబారాగా పారబోయడం కావొచ్చు. సమీక్షించుకుని సరిచేసుకునేందుకు ఇది దోహదం చేస్తుందని తమ అనుభవాలను నివాసితులు 'ఈనాడు'కు వివరించారు.

నిర్మాణ సమయంలోనే..

కొనుగోలుదారుల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని కొందరు నిర్మాణదారులు కొత్త ప్రాజెక్ట్‌లో నీటి వినియోగం విషయంలో జాగ్రత్తలు చేపడుతున్నారు. నిర్మాణ దశలోనే మీటర్లను బిగిస్తున్నారు. ట్యాంకు నుంచి ఒకే లైను వేర్వేరు నివాసాలకు అనుసంధానిస్తారు కాబట్టి భవనం పైన కాకుండా వీరు వినియోగించే నల్లా పైన మీటర్లను పెడుతున్నారు. బడా నిర్మాణ సంస్థలు నిర్వహణ సైతం వారే చూస్తుండటంతో ఇలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకొంటున్నాయి. ఈ విధానంలో సాంకేతిక లోపాలతో కొన్నిసార్లు బిల్లు ఎక్కువ వస్తుందనే ఫిర్యాదులు ఉన్నా.. నీటి వృథాని అరికట్టడంలో ఇవి మంచి ఫలితాలను ఇస్తున్నాయి. కొందరు బిల్డర్లు తాము ఏర్పాటు చేయకపోయినా. . భవిష్యత్తులో సంక్షేమ సంఘం ఏర్పాటు చేసుకునే విధంగా పైపులైను అమరికలో జాగ్రత్తలు తీసుకొంటున్నారు.

హెచ్చరిస్తాయి..

మీటర్లలోనూ ఆధునిక సాంకేతికతతో పనిచేసేవి చాలా వచ్చాయి. సిబ్బంది ప్రతిసారి వెళ్లి రీడింగ్ తీయాల్సిన అవసరం లేకుండా సాంకేతికత ఆధారంగా పనిచేసే వ్యవస్థలు ఉన్నాయి. ఈ తరహా సేవలు అందించే సాఫ్ట్‌వేర్‌ని కొన్ని అపార్ట్‌మెంట్లు వినియోగిస్తున్నాయి. మొబైల్‌లోనూ ఎప్పటికప్పుడు వాడకం తీరును చూసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు రోజువారీ వినియోగం నిర్దిష్ట యూనిట్లు దాటితే మొబైల్‌కు సంక్షిప్త సందేశం ద్వారా హెచ్చరించే విధంగానూ డిజిటల్ మీటర్లలో వెసులుబాటు ఉంది.



డిజిటల్ మీటర్లను కంప్యూటర్‌తో అనుసంధానిస్తే బిల్లును ఎప్పటికప్పుడు ఇలా ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చు..

పాతవాటిలో కష్టమే అయినా..

పాత బహుళ అంతస్తుల నివాసాల్లో ప్రతి ఫ్లాట్‌కి నీటి మీటరు బిగింపు వ్యయ ప్రయాసలతో కూడినదే. అందుకు నివాసితులందర్నీ ఒప్పించాలి. పైపులైను మొత్తంగా మార్చు అంటే అందుకు అయ్యే వ్యయాన్ని వసూలు చేయాలి. ప్రతి ఫ్లాట్‌కు సరఫరా అయ్యే లైనును ట్యాంకుకు కలపాలి. ఇందులో ఏ ఒక్కరు ఒప్పుకోకపోయినా కథ మళ్లీ మొదటికొస్తుంది. మొదట్లో వ్యయం ఎక్కువే అయినా ప్రతినెలా ఆదా అయ్యే సొమ్ముతో కొద్ది నెలల్లోనే ఈ మొత్తం వెనక్కి పొందినట్లు అవుతుంది.

తక్కువ వాడితే ప్రోత్సాహకాలు

మీటర్లు ఉన్న అపార్ట్‌మెంట్లలోని నివాసాల్లో పొదుపుగా నీటిని వినియోగించే వారికి ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. ఎక్కువ వాడిన వారిలో ముగ్గురు, తక్కువ వాడిన వారు ముగ్గురి పేర్లను నోటీసు బోర్డులో పెడుతున్నారు. అతి తక్కువ వాడిన వారికి ఆ నెల నీటి బిల్లును మాఫీ చేస్తున్నారు. దీంతో మిగతా వారిలోనూ పొదుపుగా వాడాలనే ఆలోచనను రేకెత్తిస్తున్నారు.

శుద్ధి చేసి మొక్కలకు వినియోగం...

బహుళ అంతస్తులల్లో విధిగా సివరేజి ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారు. శుద్ధి చేసిన నీటిని మొక్కలకు, బాత్రూమ్‌లో ఫ్లషింగ్ కోసం వాడేలా చూస్తున్నారు. జలమండలి సరఫరా చేసే నీరు వంట, ఇతర అవసరాల కోసం వినియోగిస్తున్నారు. చాలకపోతే బోర్‌వెల్ నీటిని సరఫరా చేస్తున్నారు. మీటర్ల ఏర్పాటు ద్వారా ఎవరెంత ఏ నీరు వాడతారో అంత మొత్తమే వారు చెల్లించే సౌలభ్యం ఏర్పడింది. కొన్ని నివాసాల్లో ఇదే తరహాలో మీటర్లతో బిల్లులు వసూలు చేస్తున్నారు.

- ప్రతి నెల 25న బిల్లింగ్ తీస్తారు. దీంతో జలమండలి ఇచ్చే బిల్లు గడువులోపు చెల్లించడానికి వీలవుతుందని ఫెసిలిటీ మేనేజర్లు చెబుతున్నారు.

భవనాల జీవితకాలం పెరుగుతుంది..

– నవీన్‌కుమార్, డైరెక్టర్, ఎస్ అండ్ ఎస్ గ్రీన్ ప్రాజెక్ట్స్



- అపార్ట్‌మెంట్లలో చాలా కుటుంబాలు ఉంటాయి. ఎవరెంత నీటిని వాడుతున్నారో తెలియదు. ఎంత వాడినా అందరికి సమాన బిల్లు అంటే బాధ్యత ఉండదు. అదే వినియోగానికి ఎవరికి వారికి మీటరు ఉంటే బిల్లు చూస్తుంటారు.. ఎక్కువ వస్తుంటే తగ్గించుకుందామనే స్పృహ మొదలవుతుంది.
- బల్క్‌గా సరఫరా చేసే నీటికి బిల్లును అపార్ట్‌మెంట్ నిర్వహణ చూసేవారు చెల్లిస్తారు. ప్రతి ఫ్లాట్‌కు మీటర్ ఉండటం వల్ల బల్క్ సరఫరా, వినియోగిస్తున్న యూనిట్లను సరిపోల్చుతారు. తేడా ఉంటే ఎక్కడైనా లీకేజీ అవుతున్నట్లు గుర్తించి సరిచేయడానికి అవకాశం ఉంది. దీంతో భవన జీవితకాలం కూడా పెరుగుతుంది.
- నగరంలో ఇటీవల నిర్మించిన బహుళ అంతస్తుల భవనాల్లో వేర్వేరుగా నీటి మీటర్లను అమర్చుకొంటున్నారు. సిటీలో ఈ తరహావి 2వేల వరకు ఉంటాయని అంచనా. రెరా నిబంధనల ప్రకారం ఐదేళ్ల వరకు భవన నిర్మాణ లోపాలకు నిర్మాణదారుదే బాధ్యత. దీంతో నీటి లీకేజీ విషయంలో జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మీటరింగ్ విధానం పాటించే వీలుంది.
- ఇప్పటికే ఉన్న అపార్ట్‌మెంట్లలో ఐదంతస్తుల వరకు నీటి లైన్లను సులభంగా మార్చుకోవచ్చు. భవనాల పైన మీటర్లను ఏర్పాటు చేసుకుంటున్నారు కూడా. పాత అపార్ట్‌మెంట్లలో ఇబ్బందే. వాటిలో నీటి పైపులైను గోడల లోపల వేసేవారు. వీటిని మార్చడం కష్టం. ఇప్పుడు బయటి నుంచే వేస్తున్నారు. స్నానాల గదుల్లోనూ ఫాల్స్ సీలింగ్ పై నుంచి వీటిని తీసుకొస్తున్నారు. కాబట్టి మీటర్ల బిగింపు సులువే.
- మీటర్ల బిగింపునకు ప్రారంభంలో వ్యయమైనా... మూడు నాలుగేళ్లలో ఆ మొత్తం తిరిగి వచ్చేస్తుంది. నీటి వృథా.. జలమండలికి కట్టే, బయటకొనే నీటి బిల్లులు తగ్గుతాయి. కరెంట్ బిల్లుల్లోనూ తగ్గుదల ఉంటుంది. ఇవన్నీ చూస్తే మీటర్‌కు అయ్యే వ్యయం గురించి ఆలోచించాల్సిన పనిలేదు. రాబోయే రోజుల్లో అన్ని అపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్లలో మీటర్లు తప్పక ఏర్పాటు చేసుకొంటారు. మా ప్రాజెక్ట్‌లో నిర్మాణ సమయంలోనే ఆలోచించి ప్రతి ఫ్లాట్‌కి మూడు మీటర్లు బిగించాం.



అపార్ట్‌మెంట్‌లో ఎన్ని ఫ్లాట్లు ఉంటే పైన అన్ని మీటర్లు ఇలా...

దుర్వినియోగం తగ్గుతుంది..

– ఎం. దానకిషోర్, ఎండీ, జలమండలి



బహుళ అంతస్తుల నివాసాల్లో నీటి పంపిణీ... వినియోగం తీరుపై వాటిలో నివసించే వారిలో అపోహలు ఉంటాయి. వ్యక్తిగత మీటర్ల ఏర్పాటే వీటికి పరిష్కారం. దీంతో విచ్చలవిడి వినియోగం చాలా వరకు తగ్గిపోతుంది. జలమండలి 400 ఎంజీడీలతో నగరం మొత్తానికి నీరు అందిస్తోంది. శుద్ధి చేసేందుకు చాలా ఖర్చవుతున్నా నామమాత్రపు రుసుంతో సరఫరా చేస్తున్నాం. వ్యక్తిగతంగా నీటి దుర్వినియోగం తగ్గితే మిగిలిన నీటిని మరింత ఎక్కువ మందికి సరఫరా చేసేందుకు అవకాశం ఉంటుంది.

నీటి సరఫరా డిమాండ్ (ఓఆర్ఆర్ వరకు)

ఎంజీడీల్లో	2018	2021	2024	2031	2041
	542.54	620.39	690.39	891.48	1204.37

గొడవల్లేవ్.. ప్రశాంతంగా ఉన్నాం..

– ఎస్.శ్రీధర్, మోహన్‌నగర్





మాది కొత్తపేట మోహన్‌నగర్‌లోని భారతీ ఎన్‌క్లేవ్. అపార్ట్‌మెంట్‌లో 12 ఫ్లాట్లు ఉన్నాయి. మున్సిపల్ నీటి కనెక్షన్ ఉన్నా సరిపోయేది కాదు. దీంతో రోజుకు 5వేల లీటర్ల సామర్థ్యం కల్గిన ట్యాంకరు ఒకటి తెప్పించేవారం. కొన్నిసార్లు రెండురోజులకే మూడు ట్యాంకర్లు పట్టేవి. అయినా నీళ్లు సరిపోవడం లేదని గొడవలు. పై అంతస్తుల్లో ఉండే వారికి నీళ్లు రావడం లేదని ఫిర్యాదులు. వీటన్నింటికి మీటర్లు బిగించుకోవడమే పరిష్కారమని భావించాం.


- ఆలోచన రాగానే అందరితో పంచుకున్నాం. నీళ్లే లేనప్పుడు మీటర్లు ఎందుకన్నారు. ఇదే ఖర్చుతో బోరు వేద్దామన్నారు. ఇచ్చేట్లయితే మున్సిపల్ నీటి కనెక్షన్ మరోటి తీసుకుందామన్నారు. అన్నిరకాల చర్చల అనంతరం మీటర్ల ఏర్పాటుకు అందరూ అంగీకరించడంతో బిగించుకున్నాం.
- సాధారణంగా మూడు లైన్లు ఉంటాయి. ఒకటి వంటగది, మిగతా రెండు పడకగదిలోని స్నానాల గది, కామన్ బాత్రూమ్‌కి వెళుతుంటాయి. ఐదో అంతస్తు నుంచి ఒకటో అంతస్తు వరకు ఇదే విధంగా ఉంటుంది. ఇలా ఉంటే మీటర్లను బిగించడం కష్టం కావడంతో పైపులైను మార్చాం.
- ట్యాంకు నుంచి సమాన పరిమాణం గల పైపుతో ప్రతి ఫ్లాట్‌కు లైను ఇచ్చాం. అక్కడే మేడ పైన మీటర్లు ఏర్పాటు చేశాం. ఈ లైను నుంచి టి పైపుతో వంటగది, స్నానాల గదుల్లోకి కనెక్షన్ ఇచ్చాం. ఇలా 12 ఫ్లాట్లకు పై నుంచి 12 పైపులైన్లు వేసుకున్నాం.
- మీటర్ల బిగింపు అనంతరం ట్యాంకర్ల వాడకం తగ్గిపోయింది. ఎప్పుడో అత్యవసరంలో తప్ప నిత్యం వాటి అవసరం లేదు. ఇదివరకు డ్రమ్ముల్లో నీరు నింపుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితీ లేదు. 24 గంటలూ నల్లా తిప్పగానే నీళ్లు వస్తున్నాయి.
- ఒక్కో ఫ్లాట్‌కు రూ.15వేల వరకు ఖర్చయ్యింది. మీటర్లు, పైపులకు తక్కువ వ్యయమే అయినా.. వాటి బిగింపునకు ఖర్చు ఎక్కువైంది. నీటి ఆదాతో నెలనెలా ఖర్చు తగ్గడం ఊరటగా ఉంది. ఇదివరకు రూ.2వేల దాకా నీటి కోసమే ఖర్చయ్యింది. ఇప్పుడు సగానికి సగం తగ్గింది. అన్నింటికి మించి గొడవల్లేవు. మనశ్శాంతిగా ఉన్నాం.

ప్రతి నివాసానికి మూడు మీటర్లు..

– జి.రామారావు, విశ్రాంత బ్యాంకు అధికారి, ఖాజాగూడ

మా ఇంట్లో నేను, నా భార్య, కూతురు ముగ్గురం ఉంటాం. ఖాజాగూడలో గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్‌లో మూడు పడకల గదిలో నివాసం.

- నిర్మాణ దశలోనే ప్రతి ఫ్లాట్‌కు మూడు మీటర్లు బిగించారు. మాస్టర్ బెడ్ రూంకు ఒకటి, మిగతా రెండు పడక గదులకు మరొకటి, ఇంట్లో అవసరాలు, వంటగదికి కలిపి ఇంకొకటి బిగించారు.
- మీటర్లను స్నానాల గదిలో... కిచెన్‌లో శ్లాబ్స్, ఫాల్స్ సీలింగ్ మధ్య భాగంలో ఏర్పాటు చేశారు కాబట్టి... ప్రతి నెలా రీడింగ్ తీయడం అంత సులువు కాదు. అందుకే డిజిటల్ మీటర్లను అమర్చారు. సెల్లార్‌లో ఉన్న ఫెసిలిటీ గదిలోని కంప్యూటర్‌తో అనుసంధానంతో నెలవారీ రీడింగ్ తీసి బిల్లులు జారీ చేస్తారు.
- అపార్ట్‌మెంట్‌లోని మా బ్లాక్‌లో 130 వరకు నివాసాల్లో ఉంటున్నారు. వీరిలో ఎవరైనా తామెంత నీరు వాడుతున్నామో తెలుసుకోవాలన్పిస్తే బిల్లు వచ్చేదాకా ఆగాల్సిన పనిలేదు. ఒక రోజు, ఓ గంట కూడా ఎన్ని లీటర్ల నీరు వాడారో ఆన్‌లైన్లో చూసుకునే వెసులుబాటు ఉంది.
- ప్రతి ఇంటికి, ప్రతినల్లాకు మీటరింగ్‌తో మా దగ్గర నీటి వినియోగం చాలా తక్కువ. బయటి నుంచి ట్యాంకర్లతో కొనుగోలు చేసే అవసరం రాలేదు.
- సాధారణంగా అందరికి అనేసరికి మనది పోయేదేముంది అని ఎక్కువగా వాడేస్తారు. మానవ నైజమిది. నల్లాలకు మీటర్లతో ఎవరికి వారు పొదుపుగా వాడతారు.
- మా ఇంట్లో రెండు బాల్కనీలు, కారిడార్‌లో చాలా మొక్కలు ఉన్నాయి. వీటికి వేసవిలో మినహా .. నల్లా నుంచి మగ్గులో నీరు పట్టి పోసింది లేదు. మా ఆవిడ వంట చేసేటప్పుడు కూరగాయలు, చేతులు కడిగిన నీరును సింక్‌లో వృథాగా పోయకుండా మొక్కలకు పోస్తారు. నీటి విలువ తెలిస్తే ఎవరైనా పొదుపుగా వాడతారు.



వామ్మో.. గున్‌గల్!



ప్రమాదంలో ధ్వంసమైన కారు(పాతచిత్రం)

రోజుకో రోడ్డు ప్రమాదం

వేగ నియంత్రికలు ఏర్పాటు చేసినా ఫలితం శూన్యం

వారం వ్యవధిలో ఆరు ప్రమాదాలు

9న సాగర్ రహదారికి హద్దురేఖలు(వైట్ సిమెంట్ పట్టీలు) గీసే కార్మికుడు గున్‌గల్ వద్ద రోడ్డు దాటుతుండగా వేగంగా వెళ్తున్న కారు ఢీకొంది. గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 12న మృతి చెందాడు.

10న గున్‌గల్‌కు చెందిన వ్యక్తి రోడ్డు దాటుతుండగా కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతను ఆసుపత్రిలో ఇంకా కోమాలోనే ఉన్నాడు.

12న వారాసిగూడ నివాసి సంపత్(35) గునగల్‌లోని బంధువుల ఇంటికి వచ్చి, తిరిగి వెళ్లే క్రమంలో రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతను నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

11న చీదేడు చెందిన ఓ వ్యాపారి ద్విచక్రవాహనాన్ని గున్‌గల్ మలుపులో కారు ఢీకొనడంతో కాలువిరిగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

16న నందివనపర్తి గ్రామానికి చెందిన దంపతులిద్దరు స్కూటీపై ఇబ్రహీంపట్నం వెళ్లి తిరిగి వస్తుండగా ఎదురుగా లారీ ఢీకొనడంతో మహిళకు గాయాలయ్యాయి.

17న బీఎన్‌రెడ్డి నగర్‌కు చెందిన ముగ్గురు కారులో సాగర్ వెళ్లి తిరిగి వస్తుండగా.. గున్‌గల్ వద్ద రాత్రి 10.30 సమయంలో ఎదురుగా వచ్చిన డీసీఎం బలంగా ఢీకొంది. దీంతో కొత్త కారు పూర్తిగా ధ్వంసమైంది. అందులో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.

గున్‌గల్(యాచారం)

ఎక్కడా లేని విధంగా సాగర్ రహదారిపై గున్‌గల్ వద్ద వేగ నియంత్రికలు(స్పీడ్‌బ్రేకర్లు) ఏర్పాటు చేశారు. అయినా ఇక్కడ రోడ్డుప్రమాదాలు తగ్గకపోగా.. పెరగడం స్థానికులకు ఆందోళనకు గురిచేస్తోంది. వారం వ్యవధిలోనే ఇక్కడ చోటుచేసుకున్న ఆరు ప్రమాదాల్లో ఒకరు మృతిచెందగా.. ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. గున్‌గల్ రిజర్వాయర్ నుంచి తిరుమల పాలపరిశ్రమ మధ్యలోనే అత్యధికంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రహదారి విస్తరణ అనంతరం ప్రమాదాలు పెరగడం శోచనీయం.

ప్రమాణం తప్పిన ఫలితమేనా..

కృష్ణా పుష్కరాల సందర్భంగా రాష్ట్రప్రభుత్వం సాగర్ రహదారి అభివృద్ధికి రూ.వందకోట్లు కేటాయించింది. బాహ్యవలయ రహదారి(ఓఆర్ఆర్)ని ఆనుకొని బొంగులూరు నుంచి నాగార్జున సాగర్ వరకు నాలుగు వరుసలుగా ఈ రహదారిని అభివృద్ధి చేశారు. అక్కడక్కడ మిగిలిన పనులు ఇంకా జరుగుతున్నాయి. ఎదురుగా 150 మీటర్ల దూరం నుంచి వచ్చే వాహనం స్పష్టంగా కనిపించే విధంగా రహదారిని ఉన్నతీకరించారు. అయితే గున్‌గల్ వద్ద నిర్మాణ లోపం ఫలితంగానే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయనే వాదన వినిపిస్తోంది.

● యాచారం నుంచి ఇబ్రహీంపట్నం వైపు వెళ్లే వాహనాలు గున్‌గల్ రిజర్వాయర్ వరకు వాహనాలు కొంత నెమ్మదిగా వచ్చినా.. అక్కడి నుంచి పల్లంగా ఉండడంతో ఒక్కసారిగా వేగం పెంచుతున్నారు. - ఇబ్రహీంపట్నం నుంచి యాచారం వైపు వచ్చే వాహనాలు ఆగాపల్లి పరిధి వరకు ఒక వేగంతో వచ్చి.. ఆ తరువాత వేగం పెంచుతున్నారు. పల్లం వైపు ప్రయాణం ఉండటంతో సహజంగానే వేగం పెరుగుతోంది. ఇలా రెండు వైపుల నుంచి వచ్చే వాహనాల వేగం పెరిగే చోటు కిలోమీటర్ దూరం ఉంటుంది. ఇక్కడే రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రహదారి అభివృద్ధి సమయంలో ఇరువైపులా రహదారి ఎత్తును ఆర్అండ్‌బీ అధికారులు చాలా వరకు తగ్గించినా.. పూర్తిస్థాయిలో జరగకపోవడంతో ప్రమాదాలకు హేతువుగా మారుతోంది.



గున్‌గల్ వద్ద సాగర్ రహదారి

ప్రమాదాలను నియంత్రించాలి

రవీందర్, సహకార సంఘం డైరెక్టర్, గున్‌గల్



గున్‌గల్ వద్ద రోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. నియంత్రణకు పోలీసులు చర్యలు తీసుకోవాలి. ఇక్కడ వేగనియంత్రికలు ఏర్పాటు చేసినా ఫలితం లేదు. ఎప్పుడు ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందాల్సిన పరిస్థితులున్నాయి. వందల మంది విద్యార్థులు నిత్యం ఇక్కడ బస్సుల కోసం వేచి ఉంటారు. పెనుప్రమాదం జరగకముందే సమస్య పరిష్కరించాలి.

స్టాపర్స్ ఏర్పాటు చేయాలి

శ్రీనివాస్, ఉపాధ్యాయుడు, గున్‌గల్



గున్‌గల్ వద్ద రోడ్డు దాటాలన్నా.. భయంగా ఉంది. ఇటీవల ఓ మహిళ రోడ్డు దాటుతుండగా ప్రమాదానికి గురైంది. గున్‌గల్ రిజర్వాయర్ సమీపంలో స్టాపర్స్ ఏర్పాటు చేస్తే వాహనాల వేగం తగ్గే అవకాశం ఉంది.

ఎల్లో లైట్ ఏర్పాటు చేస్తాం

చంద్రకుమార్, సీఐ యాచారం



ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు పరిమితికి మించిన వేగంతో వెళ్తుండటంతోనే గున్‌గల్ వద్ద ప్రమాదాలు అధికంగా చోటు చేసుకుంటున్నాయి. తిరుమల పాలకేంద్రం వద్ద వేగాన్ని నియంత్రించడానికి ఎల్లో సిగ్నల్ ఏర్పాటు చేస్తాం. వాహనాల వేగంపై పోలీస్ నిఘా పెంచి ప్రమాదాల నివారణకు కృషి చేస్తాం.

లోపం లేదు.. మరోసారి పరిశీలిస్తాం

అమృతరెడ్డి, డీఈ, ఆర్అండ్‌బీ

రహదారి నిర్మాణంలో ఎక్కడా లోపం లేదు. వంద కిలోమీటర్ల వేగంతో వెళ్లే విధంగా ఇక్కడ రహదారి నిర్మించాం. అయినా మరోసారి పరిశీలించి అవసరమైన మార్పులు చేస్తాం. చెట్లకు మలుపుల వద్ద రేడియం స్టిక్కర్లు వేస్తాం. వాహనదారులు రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాలి. ప్రయాణం సాఫీగా సాగడానికే రహదారులను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. మితిమీరిన వేగం ప్రాణాంతకం.

క్రమశిక్షణతో కూడిన బోధన అవసరం

విద్యార్థి నేతృత్వ స్వీకారోత్సవంలో అకున్ సబర్వాల్



విద్యార్థుల నుంచి వందనం స్వీకరిస్తున్న అకున్ సబర్వాల్

అమీర్‌పేట, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థిలో అపారమైన తెలివి తేటలు ఉంటాయని, వారిలోని సృజనను గుర్తించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత విద్యాలయాలదేనని, క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు దోహదపడుతుందని రాష్ట్ర ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ సూచించారు. బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్(హెచ్‌పీఎస్)లో శనివారం విద్యార్థి నేతృత్వ స్వీకారోత్సవం, వార్షిక బహుమతి ప్రదానోత్సవాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల కవాతు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముఖ్యఅతిథిగా హాజరైన అకున్ సబర్వాల్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ... పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు అలవడాలని తదనుగుణంగా వారిని ప్రోత్సహించాలని సూచించారు. అంతకుముందు పాఠశాలలోని ఆయా విభాగాలకు నాయకులుగా ఎంపికైన విద్యార్థులకు ఆయన బ్యాడ్జీలను అంటించి అభినందించారు. వివిధ అంశాల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు పతకాలను, బహుమతులను అందజేశారు. పాఠశాలకు హెడ్‌బాయ్, హెడ్ గర్ల్‌గా ఎంపికైన ప్రణవ్ మిహిర్ కండాడ, నందిని నూతక్కి ప్రసాద్‌లు స్ఫూర్తిదాయకంగా ప్రసంగించి ఆకట్టుకున్నారు. హెచ్‌పీఎస్ ప్రిన్సిపల్ లతా శంకర్, హెచ్‌పీఎస్ సొసైటీ ప్రతినిధులు గుస్తినోరియా, ఫయాజ్‌ఖాన్ తదితరులతో పాటు రిజిస్ట్రార్ కల్నల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

శనైశ్చరస్వామి ఆలయ అభివృద్ధికి సహకారం

శనిత్రయోదశి పూజల్లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



పూజల్లో పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ నందిఎల్లయ్య, మాజీ మంత్రి సబితారెడ్డి తదితరులు

శంషాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: మదనపల్లి శనైశ్చరస్వామి ఆలయంలో శనివారం శనిత్రయోదశి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ నంది ఎల్లయ్య, మాజీ హోంమంత్రి సబితారెడ్డి శనీశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీగిరి పీఠం ఛైర్మన్ స్వామి శంకర్‌రాజు ముఖియా అన్ని ఏర్పాట్లు చేశారు. అన్నదానం నిర్వహించారు.

చతుర్ముఖ ఆలయానికి శంకుస్థాపన.. శ్రీ శనైశ్చర స్వామి ఆలయ ప్రాంగణంలో పాలమాకులకు చెందిన కృష్ణకుమార్ ఆర్థిక సాయంతో నిర్మించనున్న చతుర్ముఖ ఆలయం నిర్మాణం పనులకు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భూమి పూజ చేశారు. శనీశ్వర ఆలయాలు అరుదుగా ఉంటాయన్నారు. నగరానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ ఆలయం అభివృద్ధికి తమ సహకారం ఉంటుందన్నారు. పూజల్లో పి.కార్తీక్‌రెడ్డి, డీసీఎంఎస్ ఛైర్మన్ శ్రావణ్, రణధీర్‌రెడ్డి, సర్పంచులు లాలీచందర్, ఆర్.సిద్ధేశ్వర్, నేతలు ఎం.వేణుగౌడ్, వై.సుదర్శన్‌గౌడ్, బి.గోపాల్ పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వాలు విఫలం.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకిచ్చిన వాగ్దానాలు నెరవేర్చడంలో విఫలమయ్యాయని టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శంషాబాద్‌లో శనివారం మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమ పథకాల అమలులో విఫలమయ్యాయన్నారు. తెరాస హయాంలో ఐటీ సంస్థలు రాష్ట్రానికి రావడం లేదని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు గుణపాఠం చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. ఉద్యోగ ప్రకటనలు ఏ ఒక్కటీ సరిగా లేవని, నిరుద్యోగుల జీవితాలతో ఈ సర్కారు చెలగాటమాడుతోందని మండిపడ్డారు. ఎమ్మెల్యే సంపత్ కుమార్, దాసోజు శ్రవణ్‌కుమార్, మల్లు రవి, క్యామ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత ఉపాధి శిక్షణ, వసతి

గోల్నాక, న్యూస్‌టుడే: గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా పరిధిలోని నిరుద్యోగ శారీరక దివ్యాంగ యువతీ యువకులకు ఏస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత ఉపాధి శిక్షణ, వసతిని కల్పిస్తున్నట్లు శిక్షణ నిర్వహణ మేనేజర్ పి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సెస్సీ, ఆపై ఉత్తీర్ణులు/అనుత్తీర్ణులైన 18 నుంచి 32 ఏళ్ల మధ్య వయస్సు వారికి స్పోకెన్ ఇంగ్లిష్, ఎంఎస్ ఆఫీస్, ఇంగ్లిష్ టైపింగ్, కమ్యూనికేషన్, ఇంటర్వ్యూ స్కిల్స్‌లలో 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 20 లోపు ఫోన్‌నెంబర్లు: 9963810285, 9100824444 ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.



చెత్తను తరలిస్తున్న విద్యార్థినులు

దేశ సమైక్యతకు స్కౌట్స్, గైడ్స్ ఉద్యమాన్ని విస్తరించాలి

కవాడిగూడ, న్యూస్‌టుడే: దేశ సమైక్యత సమగ్రత కోసం స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమాన్ని విస్తరించాలని సదరన్ రీజియన్ సహాయ సంచాలకుడు అరుణ్‌చంద్ర పాతర్ అన్నారు. శనివారం కవాడిగూడలోని చిత్రాల నర్సింహులు స్మారక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కౌట్స్, గైడ్స్ బాలబాలికలు స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి స్కౌట్స్, గైడ్స్ స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్నారు. మహానగరపాలకసంస్థ వైద్యాధికారి డా.భార్గవనారాయణ, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయిలు పద్మమణి, ఉపాధ్యాయిలు శ్రీలత, స్కౌట్స్ అండ్ గైడ్స్ తెలంగాణ పదాధికారులు పరమేశ్వర్, జాన్ సామ్యుల్, లక్ష్మీనారాయణ, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక'ంపై నిర్లక్ష్యమేల..?

- నిధులు విడుదల చేయాలని కాంగ్రెస్ నిరసన
- రంగారెడ్డి జడ్పీ సమావేశంలో అధికార, ప్రతిపక్షాల మధ్య వాదనలు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మహేందర్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్, న్యూస్‌టుడే, జిల్లా పరిషత్: స్థానిక సంస్థలకు నిధులు విడుదల చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని రంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశంలో కాంగ్రెస్ సభ్యులు నిరసనకు దిగారు. పోడియం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. నిధులు విడుదల చేయాలంటూ నినదించారు. ఆ తరవాత అధికార పక్ష ఎమ్మెల్యేలతో వాదనలకు దిగారు.. ఒక దశలో వాతావరణం వేడెక్కింది. మాటామాటా పెరుగుతుండటంతో పోలీసులను పిలిపించి వారిసాయంతో సభ్యులను బయటకు పంపాలని మంత్రి మహేందర్‌రెడ్డి భావించారు. చివరికి కాంగ్రెస్ సభ్యులు వారంతట వారే సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయిరు.

పూర్వ రంగారెడ్డిజిల్లా పరిషత్ సమావేశం ఖైరతాబాద్‌లోని జిల్లా పరిషత్ హాల్‌లో శనివారం జరిగింది. దీనికి మంత్రి మహేందర్‌రెడ్డి, కలెక్టర్లు ఎం.వి.రెడ్డి, దివ్య, రంగారెడ్డి జిల్లా జేసీ సుందర్ అబ్నార్, జడ్పీ సీఈవో(ఇన్‌ఛార్జి) రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కిషన్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, సంజీవరావు, యాదయ్య, సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు నరేందర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి హాజరయ్యారు. సమావేశానికి అధ్యక్షత వహించిన జడ్పీ ఛైర్‌పర్సన్ సునీతామహేందర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి అంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, మరుగుదొడ్ల నిర్మాణానికి సహకరించాలన్నారు. వాతావరణానికి అనుకూలంగా పంటలు వేసుకునేలా రైతులను చైతన్య పరచాలని, రహదారుల నిర్మాణ పనులు వేగంగా చేయాలని పిలుపునిచ్చారు.

నిధులు విడుదల చేయాలని నిరసన

ఛైర్‌పర్సన్ ప్రసంగం ముగియగానే కాంగ్రెస్ సభ్యులు లేచి నిలబడి ప్లకార్డులు పట్టుకుని నిధులు విడుదల చేయాలని కోరుతూ నినదించారు. పోడియం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. వేదికపై ఉన్న మంత్రి మహేందర్‌రెడ్డి వారికి నచ్చ చెప్పేందుకు ప్రయత్నించారు. మంచినీటి ట్యాంకర్ల కోసం నిధులు మంజూరయ్యాయని, మరో రెండు రోజుల్లో నిధులు వస్తాయని వివరించారు. బదలాయింపు పన్ను(టీడీ) కోసం ముఖ్యమంత్రితో మాట్లాడి మరో పక్షం రోజుల్లో సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ జడ్పీటీసీ, ఎంపీపీలు వినిపించుకోలేదు. నాయకుడు జంగారెడ్డి నేతృత్వంలో ఆందోళనకు దిగారు. ఈలోగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కలగచేసుకొని మంత్రి ఇచ్చిన హామీని గౌరవించి ఆందోళన విరమించుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి వద్దకు ఈ సమస్య తీసుకు వెళదామని చెప్పారు. అయినా కాంగ్రెస్ సభ్యులు వినలేదు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ నిధులు విడుదల చేయలేదని ఎమ్మెల్యే గుర్తు చేయగా.. ఆ విషయాలు ఇప్పుడెందుకు అంటూ కాంగ్రెస్ సభ్యులు వాదనలకు దిగారు. ఈలోగా మేడ్చల్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కలగజేసుకొని మాట్లాడబోయే సరికి ఆయనకూ అడ్డుతగిలారు. ఇరువర్గాల మధ్య తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. చివరికి పోలీసులను పిలిపించాలని మంత్రి నిర్ణయించడంతో కాంగ్రెస్ సభ్యులు అందుకు అవకాశం ఇవ్వకుండా నినాదాలు చేస్తూ వాకౌట్ చేశారు. తర్వాత అధికార పక్ష సభ్యులతో సాగింది.



నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ సభ్యులు

పంటల బీమా ఎక్కడ..?

వ్యవసాయ శాఖ పనితీరుపై ఆ శాఖ జేడీ గీత వివరణ ఇవ్వగానే ఇబ్రహీంపట్నం ఎంపీపీ అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు రుణాలు అందడం లేదని పంటల బీమా ఒక్కరికి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు నష్టపోయిన వారికి ఎంతమందికి బీమా సదుపాయం లభించిందో చెప్పాలని ప్రశ్నించారు. వికారాబాద్ కలెక్టర్ దివ్య మాట్లాడుతూ వరి పంట విషయంలో ఒక ప్రాంతంలో మొత్తం పంట నష్టం జరిగితేనే పంటబీమా వర్తిస్తోందని, ఇందుకు భిన్నంగా పంట నష్టపోయిన ప్రతి ఒక్కరికి సాయం అందేలా చూడాలని తాము ప్రభుత్వానికి లేఖ రాశామని చెప్పారు.

ఇసుక కేటాయింపులపై చర్చ

రహదారులు.. ఎమ్మెల్యేల క్వార్టర్ల నిర్మాణం జరుగుతున్న తీరుపై ఆర్‌అండ్ బీ అధికారులు వివరణ ఇవ్వగానే వికారాబాద్ జిల్లాలో కొన్ని నిర్మాణాలు.. రహదారులు జాప్యం కావడానికి కారణం ఏమిటని సభ్యులు నిలదీశారు. ఇసుక లభించకపోవడంతో పనులు పూర్తిచేయడంలో జాప్యం జరుగుతోందని అధికారులు చెప్పగానే వికారాబాద్ జిల్లాలో ఇసుకకు కొరతేమిటని మంత్రి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తాము డీడీలు కట్టినా సబ్‌కలెక్టర్ ఇసుక విడుదలకు అనుమతి ఇవ్వడం లేదని కొందరు ఆరోపించడంతో కలెక్టర్ దివ్య కలగజేసుకొని పంచాయతీరాజ్ విభాగం వారికి ఇసుక సమస్య కానప్పుడు మీకు ఎందుకు అవుతోందని గట్టిగా ప్రశ్నించారు. ఇసుక విషయంలో ఒక అధికారికి సమన్లు కూడా జారీ చేయడంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పలువురు ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు మాట్లాడారు. వైద్య ఆరోగ్య శాఖ, గ్రామీణాభివృద్ధి, విద్య తదితర శాఖలపై చర్చించారు.

గోపీ చెరువు దగ్గర... భూముల్లో జోక్యం వద్దు

అధికారులకు హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: శేరిలింగంపల్లి గ్రామంలోని సర్వే నంబరు 67, 68, 69, 75, 76ల్లోని పిటిషనర్‌కు చెందిన భూముల్లో... గోపీ చెరువు అభివృద్ధి పేరుతో అధికారులు చేపట్టదలచిన పలు పనులను హైకోర్టు నిలుపుదల చేసింది. పిటిషనర్‌కు చెందిన ప్రైవేటు భూముల్లో చట్ట నిబంధనలకు విరుద్ధంగా జోక్యం చేసుకోవద్దని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి, జీహెచ్ఎంసీ కమిషనర్, హెచ్ఎండీఏ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, శేరిలింగంపల్లి తహశీల్దార్‌లకు తేల్చిచెప్పింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.శేషసాయి ఈ నెల 16న ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లిలోని సర్వే నంబరు 67 నుంచి 69, 75, 76ల్లోని తమ భూముల్లో 'గోపీ చెరువు అభివృద్ధి పేరుతో' అధికారులు జోక్యం చేసుకుంటున్నారని పేర్కొంటూ హైదరాబాద్ బంజారాహిల్స్‌కు చెందిన పి.ప్రేమ్‌కుమార్ హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. '2006లో హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులు మా భూముల్లో తవ్వకాలకు యత్నించారు. అప్పట్లో హైకోర్టును ఆశ్రయించాం. భూముల్లో జోక్యం చేసుకోబోమని అధికారులు కోర్టుకు హామీ ఇచ్చారు. వాటితో ఏమైనా అవసరం ఉంటే చట్ట ప్రకారం వ్యవహరిస్తామన్నారు. ఆ వివరాల్ని పరిగణనలోకి తీసుకొని 2014 సెప్టెంబరులో మేం దాఖలు చేసిన వ్యాజ్యంపై హైకోర్టు విచారణను ముగించింది. 2016 మేలో మరోసారి తవ్వకం పనులకు అధికారులు యత్నించారు. తాజాగా అధికారులు మా భూముల్లో గుంతల తవ్వకం చేపడుతున్నారు. వ్యర్థాలను తెచ్చి వేస్తున్నారు. గతంలో హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులకు, 2006న మేం దాఖలు చేసిన వ్యాజ్యంలో అధికారులు ఇచ్చిన హామీకి ఈ చర్యలు విరుద్ధంగా ఉన్నాయి. మా హక్కులకు భంగం కలిగించే రీతిలో అధికారులు పనులు చేపడుతున్నారు. ఆ భూములు కార్పొరేషన్‌కు చెందినవి అనే భావన సమీప ప్రజలకు కలిగేలా అధికారులు వ్యవహరిస్తున్నారు. వివిధ ప్యాకేజీల కింద గోపీ చెరువుకు కాలిబాటలు, టాయ్‌లెట్ బ్లాకులు, సేదతీరే బల్లలు, విద్యుద్ధీకరణ, ప్రవేశ ద్వారం, సిమెంట్ రహదారి తదితర పనులు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో మా భూముల్లో జోక్యం చేసుకోకుండా అధికారుల్ని నిలువరించాలి' అని హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్లో ప్రేమ్‌కుమార్ కోరారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.శేషసాయి... పిటిషనర్‌కు చెందిన భూముల్లో జోక్యం చేసుకోవద్దని అధికారుల్ని ఆదేశించారు.

పాత్రికేయ రంగంలో నైతిక విలువలు పాటించాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న వినోద్ దువా

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: పాత్రికేయ రంగంలో వృత్తిపరమైన నైపుణ్యతను సాధించడంతోపాటు నైతిక విలువలతో ముందుకు సాగాలని సీనియర్ పాత్రికేయులు వినోద్ దువా పాత్రికేయులను కోరారు. శనివారం గన్‌ఫౌండ్రిలోని మీడియా ప్లస్ కార్యాలయంలో ది ఫ్రీడం ప్రెస్ పత్రిక ఆధ్వర్యంలో 'స్వాతంత్ర్యం తర్వాత భారతదేశం' అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. భారతీయులుగా దేశ సంస్కృతిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అందుకు మీడియా ప్రధాన పాత్ర పోషించాలని కోరారు. భావ ప్రకటన స్వేచ్ఛ, జీవించే హక్కులను కాపాడుకోవాలని తెలియచేశారు. దేశంలో వస్తున్న మార్పులను పాత్రికేయులు ఎప్పటికప్పుడు విశ్లేషించుకుంటూ ముందుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సియాసత్ సంపాదకులు జాహెద్ అలీఖాన్, మీడియా ప్లస్ సంస్థ సీఈఓ సయ్యద్ ఖాలెద్ షాబాజ్, డాక్టర్ చిన్నా దువా, ఫ్రీడం ప్రెస్ సంపాదకులు అబ్దుల్లాఖాన్, గవా సంపాదకులు సయ్యద్ ఫాజిల్ హుస్సేన్ పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డా.భగవంత్‌రావు, ప్రతినిధులు

గణేశ్ మండపాల విద్యుత్తు బిల్లులు ప్రభుత్వమే చెల్లించాలి

భాగ్యనగర గణేశ్ ఉత్సవ సమితి విజ్ఞప్తి

బేగంబజార్, న్యూస్‌టుడే: గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండపాల వద్ద వినియోగించే విద్యుత్తు బిల్లులను ప్రభుత్వమే చెల్లించాలని భాగ్యనగర గణేశ్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ భగవంత్‌రావు విజ్ఞప్తి చేశారు. వినాయక చవితికి ప్రజలకు అదనపు రేషన్ పంపిణీ చేయాలన్నారు. సిద్ధి అంబర్‌బజార్‌లోని ఉత్సవ సమితి కార్యాలయంలో శనివారం గణేశ్ ఉత్సవాల బుక్‌లెట్‌ను అధ్యక్షులు రాఘవరెడ్డి, సభ్యులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ అంతర్జాతీయ ఖ్యాతి గడించిన గణేశ్ ఉత్సవాలకు ఉమ్మడి రాష్ట్రంలో తరహాలో సహకారం అందించాలని కోరారు. ఆధార్ కార్డు, విద్యుత్ బిల్లుల రసీదులు తేవాలంటూ కిందిస్థాయి పోలీసులు మండపాల నిర్వాహకులను వేధిస్తున్నారని, అలా వేధించకుండా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయాలన్నారు. సమావేశంలో ఉత్సవ సమితి ప్రతినిధులు వి.గణేశ్ యాదవ్, శ్రీరామ్ వ్యాస్, నటరాజ్ నామ్‌ధారి, ఉదయ్‌భాస్కర్, మహేందర్ వ్యాస్, వెంకటేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ విద్యార్థులకు ఉచిత జీఆర్ఈ, జీమాట్, టోఫెల్ శిక్షణ


గోల్నాక, న్యూస్‌టుడే: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బీటెక్, బీఎస్సీ, ఇతర గ్రాడ్యుయేట్ ఎస్సీ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ సహకారంతో ఉచిత జీఆర్ఈ, జీమాట్, టోఫెల్, ఐఈఎల్‌టీఎస్, పీటీఈ పరీక్షలకు ఉచిత శిక్షణను ఇస్తున్నట్లు కెరియర్స్ అబ్రాడ్ ఇన్ డైరెక్టర్ అరవింద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణ ఈ నెల 21 నుంచి 45 రోజుల పాటు ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు శిక్షణ కోసం ఫోన్‌నెంబరు: 8106738252 ద్వారా తమ పేర్లను నమోదు చేయించుకోవాలని కోరారు.


సమాచార వాహిని

మార్గదర్శి చిట్టి గ్రూపుల వివరాలివీ

హైదరాబాద్: మార్గదర్శి చిట్‌ఫండ్ మాదాపూర్ బ్రాంచిలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న చిట్టి గ్రూపుల వివరాలు ఇలా ఉన్నాయి. అదనపు సమాచారం కోసం పి.రామకృష్ణ, బ్రాంచ్ మేనేజరు, మాదాపూర్‌ను సంప్రదించవచ్చు. మొబైల్ నెంబర్లు: 8008930006, 8008284678, ఆఫీస్ నెంబరు: 040-23112174.

చిట్టి గ్రూపు	నెలలు	నెలసరి చిట్టి	చిట్టి విలువ
LT V	50	1,00,000	50,00,000
LT D	50	50,000	25,00,000
LT X	50	20,000	10,00,000
LT T	50	10,000	5,00,000
LT S	50	6,000	3,00,000
LT P	50	4,000	2,00,000
FT B	40	5,000	2,00,000
TT D	30	50,000	15,00,000
TT B	30	5,000	1,50,000
ST VV	25	2,00,000	50,00,000
ST X	25	20,000	5,00,000





మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో కనువిందు చేస్తున్న రంగురంగుల సీతాకోకచిలుకలు

డ్రగ్స్ అనర్థాలపై అవగాహనకు పోర్టల్

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: డ్రగ్స్ అనర్థాలపై యువతలో అవగాహన కల్పించేందుకు తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టిటా) 'ఇ లెర్నింగ్' పోర్టల్‌ను ప్రారంభించింది. జేఎన్‌టీయూ, 360 లెర్నింగ్ సంస్థలతో కలిసి రూపొందించిన పోర్టల్‌ను శనివారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. జేఎన్‌టీయూ యూఐఐసీ డైరెక్టర్ డా.సీహెచ్ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్‌పై అవగాహనకు జేఎన్‌టీయూ పరిధిలోని అన్ని ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థులకు పోర్టర్ చేరేలా చర్యలు తీసుకుంటామన్నారు. టిటా అధ్యక్షుడు సందీప్‌కుమార్ మక్తాలా, గ్లోబల్ ఉపాధ్యక్షులు రాణాప్రతాప్ బొజ్జమ్, సంయుక్త కార్యదర్శి ప్రవీణ్, కార్యనిర్వాహక కార్యదర్శి విశ్వక్ పాల్గొన్నారు.



రెండు వేల మందికి యోగా శిక్షణ

హైదరాబాద్: యువత ఆత్మహత్యలు, కుంగుబాటు నివారణలతో పాటు ఆచరణాత్మకమైన అంశాలను యోగాతో వివరిస్తున్నట్లు ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా శిక్షణ సంస్థ వెల్లడించింది. దేశవ్యాప్తంగా శనివారం ప్రారంభమైన యోగా శిక్షణలో భాగంగా నగరంలో 50 కేంద్రాలను ఏర్పాటు చేశామని, తెలంగాణ నుంచి 2 వేల మంది శిక్షణలో పాల్గొన్నారని వివరించింది.



దుర్భర మార్గం.. ప్రయాణం నరకం

శేరిలింగంపల్లి గోపన్నపల్లి ఎన్టీఆర్ నగర్‌లో ఇటీవల వర్షాలకు రూపురేఖలు మారిన రహదారి. -రాంబాబు, గోపన్నపల్లి



అలంకార ప్రాయమేనా?

పుప్పాలగూడ పంచాయతీ అలకాపూర్ పార్కులో మూడేళ్ల కిందట మంచినీటిని నిలువ చేసేందుకు ఈ సంప్‌ను నిర్మించారు. అప్పటి నుంచి ఇది నిరుపయోగంగానే ఉంది. ఎవరూ స్పందించడం లేదు. -జి.సోమశేఖరరావు, వ్యవస్థాపక అధ్యక్షుడు, అలకాపూర్ సంక్షేమ సంఘం

పౌర పాత్రికేయం


వాట్సాప్ నంబరు: 8008001763

మీ చేతిలో సెల్‌ఫోన్ ఉందా? ఎక్కువ మందిని ప్రభావితం చేస్తున్న అంశాలను, విభిన్నమైన చిత్రాలను క్లిక్ మనిపించారా? వాటిని మీరూ 'ఈనాడు'కు పంపొచ్చు.




తీగలే ఆసరాగా...

తీగలను ఆసరాగా చేసుకుని వేలాడుతున్న ఎండిన చెట్టు ఇది. అన్నపూర్ణ స్టూడియోస్ వద్ద ప్రమాదకరంగా ఉంది. చెట్టు బరువుకు ఏ క్షణమైనా తీగలు తెగిపోవచ్చు. ముప్పు లేకుండా ముందే అప్రమత్తమైతే మంచిది కదా.. -మురళీధర్, సరూర్‌నగర్



కాలం చెల్లాయ్...

సచివాలయ ప్రాంగణంలో నిరుపయోగంగా తుప్పు పట్టిపోతున్న వాహనాలు. కనీసం వేలం వేసినా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. -మునిదామోదరం, హయత్‌నగర్



కనుక్కోండి చూద్దాం..

ఎల్‌బీ స్టేడియం వద్ద ఒక వాహనానికి గడియారంలో సమయంలా రాసిన నంబరు ఇది. ఇలాంటివి పోలీసుల దృష్టికి రావా? -వసుంధర్, ఆర్కేపురం



వారికే ఈ షెల్టర్

ఇది శంషాబాద్‌లోని ఎక్స్‌ప్రెస్ బస్‌స్టాప్. ఇక్కడ బస్సుల కంటే జీపులే ఎక్కువగా ఆగి ప్రయాణికులను తీసుకువెళుతుంటాయి. -మహేశ్, కొత్వాల్‌గూడ

మేడ్చల్‌లో బాలుడి అపహరణ కలకలం

రూ.10లక్షలు ఇవ్వాలని నిందితుల డిమాండ్ ● గ్రామ సమీపంలో బాలుడిని గుర్తించిన స్థానికులు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ శ్రీనివాస్, వృత్తంలో బాలుడు మణిధర్

మేడ్చల్,న్యూస్‌టుడే: మేడ్చల్‌లో శనివారం ఓ బాలుడి కిడ్నాప్ సంఘటన కలకలం చోటుచేసుకుంది. పేట్ బషీరాబాద్ ఏసీపీ శ్రీనివాస్ మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంబంధిత వివరాలు వెల్లడించారు. మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధి కిష్టాపూర్ అర్చన కాలనీలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన వై.గిరిబాబు.. భార్య, కుమారుడు మణిధర్(14)తో కలిసి కొంత కాలంగా నివాసం ఉంటున్నారు. గిరిబాబు కొంతకాలం దుబాయ్‌కు వెళ్లి వచ్చాడు. మణిధర్ మేడ్చల్ పట్టణంలోని ఓ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. రోజు మాదిరిగానే శనివారం ఉదయం పాఠశాలకు సైకిల్‌పై బయలుదేరాడు. మేడ్చల్-కిష్టాపూర్ మార్గంలో వాగు దాటిన తర్వాత వెండి రంగు కారులో వచ్చిన దుండగులు మాయమాటలు చెప్పి కారులో బాలుడిని తీసుకెళ్లారు. బాలుడి వద్ద తండ్రి ఫోన్ నెంబర్‌ని తీసుకున్న దుండగులు రూ.10 లక్షలు ఇవ్వాలని, లేకుంటే బాలుడికి అపాయం తలపెడతామని బెదిరించారు. దీంతో భయభ్రాంతులకు గురైన తల్లిదండ్రులు వెంటనే స్థానిక పోలీసులను ఆశ్రయించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సీపీ ఆదేశాలతో పది బృందాలను రంగంలోకి దించారు. నిందితుల ఫోన్ నెంబర్ ఆధారంగా పోలీసులు విచారించారు. సాయంత్రం 4 గంటల సమయంలో పూడూరు పరిధిలో ఓ క్రషర్ వద్ద బాలుడు ఉన్నట్లు సమాచారాన్ని గ్రామస్థులు పోలీసులకు అందించారు. వారు అక్కడకు చేరుకొని బాలుడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. బాలుడిని బండరాళ్లలో బంధించగా.. ధైర్యం చేసి బయటకు వచ్చినట్లు ఏసీపీ తెలిపారు. కిడ్నాపర్ల కోసం తీవ్రంగా గాలిస్తున్నామని, త్వరలోనే పట్టుకుంటామన్నారు. సీపీ సూచనల మేరకు సాహస బాలుర అవార్డు కోసం మణిధర్ పేరును పంపించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో మేడ్చల్, శామీర్‌పేట, పేట్‌బషీరాబాద్ సీఐలు వెంకట్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, రవిచంద్ర, ఎస్సైలు గనేష్, నాయుడు, వెంకటేశం, వీరబ్రహ్మం, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యాశాఖాధికారులకు బోర్డుపై రాసి వివరిస్తున్న కలెక్టర్ యోగితా రాణా

పాఠశాలల్లో మంచి ఫలితాలు సాధించాలి

హైదరాబాద్ కలెక్టర్ యోగితా రాణా

నాంపల్లి, న్యూస్‌టుడే: 'ప్రభుత్వ పాఠశాలలకు పేద పిల్లలు మాత్రమే వస్తారు.. అటువంటి పిల్లలకు నాణ్యమైన చక్కటి విద్యాబోధన చేసేందుకు అంకిత భావంతో, సమష్టిగా కృషి చేయాల్సిన బాధ్యత విద్యాశాఖాధికారులపై ఉంది. విద్యార్థులను 'బ్యాచింగ్, మ్యాచింగ్' చేసి విద్యాబోధన అందించాలి. ఇప్పటికీ నిర్లక్ష్యం వహిస్తామంటే.. ఎవరిదారి వారిదే అంటే కుదరదిక.. ఎవరినీ ఉపేక్షించబోను.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలు ఫెయిలైతే ఎవరిని బాధ్యులను చేయాలి..' అంటూ హైదరాబాద్ జిల్లా కలెక్టర్ యోగితారాణా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల పనితీరు, సౌకర్యాలు, మధ్యాహ్నభోజనం తదితర అంశాలపై శనివారం ఆమె డీఈవో రమేశ్, ఇతర అధికారులతో సమీక్షించారు. 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు ప్రతీ సోమవారం సబ్జెక్టుల వారీగా యూనిట్ పరీక్షలు నిర్వహించాలని, గణితం, సైన్స్, తెలుగు, ఆంగ్లం సబ్జెక్టుల్లో గ్రేడ్లు ఇవ్వాలని సూచించారు. వాటిని తరగతి గదుల్లో ప్రదర్శించాలని చెప్పారు. ఈమేరకు అధికారులకు బోర్డుపై రాసి మరీ వివరించడం విశేషం.

నేటి నుంచి దోమల నివారణ వారోత్సవాలు

హైదరాబాద్, న్యూస్‌టుడే: దోమల నివారణ వారోత్సవాలు ఆదివారం(నేటి)నుంచి 26వరకు నిర్వహిస్తున్నట్లు జీహెచ్‌ఎంసీ కమిషనర్ డా.జనార్దన్‌రెడ్డి తెలిపారు. 1897 ఆగస్టు 20న బ్రిటిష్ వైద్యుడు సర్ రోనాల్డ్‌రాస్ మలేరియా వ్యాధి నివారణకు సంబంధించిన మందును కనుగొనడంతో నాటి నుంచి వరల్డ్ మస్కిటో డేగా పరిగణిస్తున్నారన్నారు. వారం రోజుల పాటు దోమల నివారణకు బల్దియా ప్రత్యేకంగా రూపొందించిన మస్కిటో యాప్‌పై విస్తృతంగా ప్రచారం కల్పించనున్నట్లు తెలిపారు. కళాశాల, పాఠశాలల విద్యార్థులతో దోమ నివారణ అంశాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. వారోత్సవాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులను సైతం భాగస్వాములను చేయాలని డిప్యూటీ కమిషనర్లకు జనార్దన్‌రెడ్డి సూచించారు.

జడ్పీ సీఈఓగా రాజేశ్వర్‌రెడ్డి

జిల్లాపరిషత్, న్యూస్‌టుడే: రంగారెడ్డి జిల్లా ప్రజాపరిషత్ ముఖ్యకార్యనిర్వహకుడి(సీఈఓ)గా జిల్లా పరిశ్రమల అధికారి జె.రాజేశ్వర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. శనివారం ఉదయం జడ్పీ ప్రాంగణంలో ఆయన సీఈఓగా ఇన్‌ఛార్జి బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో ఇప్పటి వరకు తాత్కాలిక బాధ్యతలు నిర్వహించిన డిప్యూటీ సీఈఓ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైళ్లలో నగలు చోరీ

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: రైళ్లలో ప్రయాణిస్తున్న వారి నుంచి రెండు వేర్వేరు ఘటనల్లో విలువైన నగలు చోరీకి గురయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం చెన్నైకి చెందిన సుజాత ఈనెల 10న చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లో నగరానికి వచ్చారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ 9వ ప్లాట్‌ఫాంపై రైలు దిగి మరో సూట్‌కేసు కోసం వెతికారు. ఇంతలో ఓ వ్యక్తి ఆ సూట్‌కేసును అందించాడు. నిజాంపేటలోని బంధువుల ఇంటికి వెళ్లాక చూడగా సూట్‌కేసు కోసి నగలు తస్కరించిన విషయాన్ని గుర్తించారు. ఈ విషయంలపై శనివారం ఫిర్యాదు చేశారు. మరో ఘటనలో ముషీరాబాద్‌కు చెందిన యాదమ్మ శనివారం మధ్యాహ్నం వరంగల్‌కు వెళ్లేందుకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వచ్చారు. 4వ నెంబరు ప్లాట్‌ఫాంపై రైలెక్కుతుండగా ఆమె మెడలో ఉన్న 17.5 గ్రాముల బంగారు గొలుసును ఆగంతకుడు లాక్కున్నాడు. దీనిపై రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

75 కిలోల గంజాయి స్వాధీనం..

విశాఖ నుంచి ముంబయికి కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో 75 కిలోల గంజాయి తరలిస్తుండగా సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులు పట్టుకున్నారు. 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులు బరంపురానికి చెందినవారు.


తిరుమలగిరి ఒకప్పటి జైలు భవంతి విహంగ వీక్షణం

నాటి జైలు.. చూసేందుకు ఏదీ వీలు?

- విశిష్ట భవన సముదాయం సందర్శనకు అనుమతివ్వని రక్షణ శాఖ
- అండమాన్ కారాగారాన్ని పోలి ఉండే శైలి
- కంటోన్మెంట్ తిరుమలగిరిలో సైనిక శిక్షణా భవంతి

అల్వాల్, న్యూస్‌టుడే


అదో అద్భుత కట్టడం... అలనాడు క్రమశిక్షణ తప్పిన సైనికులను సన్మార్గంలో పెట్టేందుకు ఉపయోగపడిన భవనం... చారిత్రక, కళాత్మక వారసత్వ కట్టడాల్లో ఒకటిగా వెలుగొందుతున్న ఆ భవనమే తిరుమలగిరి జైలు. ఒకప్పుడు ఖైదీల్లో సత్ప్రవర్తనను పెంపొందించేందుకు ఉపయోగించిన ఈ జైలు ప్రస్తుతం సైన్యం శిక్షణ యూనిట్‌గా ఉపయోగపడుతోంది. అలనాటి జ్ఞాపకాలకు మూగసాక్షిగా ఉంది. ఇంతటి విశిష్టతను కలిగిన ఈ జైలు సందర్శనపై ప్రతిష్టంభన మాత్రం నెలకొంది. ఒకప్పుడు ప్రత్యేక సందర్భాల్లో జైలు సందర్శనకు అనుమతి ఇచ్చేవారు. కానీ ఆ తర్వాత సైన్యం నిషేధాజ్ఞల నేపథ్యంలో సందర్శనను నిలిపి వేశారు. కనీసం స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవం రోజుల్లోనైనా సందర్శనకు అనుమతి ఇవ్వాలని కోరుతున్నా కేంద్ర రక్షణ శాఖ స్పందించడం లేదు.

'కాలాపానీ' క్రూరత్వం ఇక్కడ..

'కాలాపానీ' అనగానే అండమాన్ దీవుల్లోని జైలులో బ్రిటిష్ కాలంలో స్వాతంత్ర్య సమరయోధుల దీరగాథలు... కఠినంగా, క్రూరంగా, పాశవికంగా వ్యవహరించిన అంశాలు గుర్తుకు వస్తాయి. ఆ జైలును కేంద్ర ప్రభుత్వం జాతీయ ప్రదర్శనశాలగా ప్రకటించింది. అలాంటి జైలే మన హైదరాబాద్‌లో ఉంది.


ఉరి తీసిన ప్రాంతం

చెక్కతో మెట్లు



మొత్తం నాలుగు దిక్కుల్లో 128 మందిని బంధించేందుకు వీలుగా గదులు ఉన్నాయి. ఇందులో 75 చీకటి గదులు(సెల్) ఉన్నాయి. ప్రతి గదికి ప్రత్యేకమైన చిన్న రంధ్రం ఉంటుంది. ఇందులో నుంచి ఖైదీ బయటకు చూస్తే ఎదురుగా ఉన్న వారు మాత్రమే కనిపిస్తారు. గది మొత్తం చీకటిగా ఉంటుంది. నాలుగు దిక్కులను కలిపే మధ్య భాగాన్ని రెండు అంతస్తులకే పరిమితం చేయకుడా మరింత ఎత్తుగా నిర్మించారు. చెక్కతో నిర్మించిన మెట్లు ఉన్నాయి.

ఈ జైలులో బ్రిటిష్ సైన్యంలో తప్పులు చేసిన వారిని ఉంచేవారు. కొందరిని ఉరికూడా తీశారు. 1858లోనే దీన్ని నిర్మించారు. ఈ జైలును చూసే అండమాన్ దీవుల్లో కాలపానీని 1906లో నిర్మించినట్లు చెబుతారు. ఈ జైలకు అప్పట్లో బ్రిటిష్ వారు రూ. 4.71 లక్షలు వ్యయం చేసినట్లు రికార్డులు ఉన్నాయి.

ఉరి తప్పితే.. బావిలో!

మధ్యభాగంలో బయటికి కోటగా కనిపించే భాగమే ఖైదీలను ఉరితీసే ప్రాంతం. 40 అడుగుల కంటే ఎత్తులో ఉరి వేస్తారు. ఏకారణం చేతనైనా ఉరితప్పినా నేలపై వ్యక్తి పడే ప్రాంతంలో ఇనుపరాడ్లతో ఏర్పాటు చేసిన చిన్న బావి ఉంటుంది. ప్రస్తుతం దానిని మూసివేశారు.

ఇష్టదైవం.. ప్రార్థన

నాడు బ్రిటిష్ అధికారులు ఉరిశిక్ష అమలు చేసే సమయంలో మాత్రం ఇష్టదైవాన్ని ప్రార్థించుకొనే అవకాశం కల్పించే వారు. ఓ గదిలో ఇష్టదైవాల చిత్రాలు, మత గ్రంథాలు ఉన్నాయి. మొత్తం 500 మందికి పైన ఉరివేసినట్లు చెబుతారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో కొందరిని బందీగా ఉంచారు. 1984లో పంజాబ్‌లో 'ఆపరేషన్ బ్లూస్టార్' సమయంలో సైనికుల ఆధీనంలోకి వచ్చిన ఖైదీలను కూడా ఈ తిరుమలగిరి జైలులోనే బంధించారు.


ఖైదీలను బంధించిన గదులు

'పచ్చీస్' ఆట ఆకారం

తిరుమలగిరి చౌరస్తాలో నిలబడి చూస్తే కోటను తలపించేలా కనబడే కట్టడమే తిరుమలగిరి జైలు. 20,344 గజాల్లో రెండు అంతస్తుల్లో ఉంటుంది. తూర్పు. పడమర, దక్షిణం, ఉత్తర దిక్కుల్లో నాలుగు వైపులా సమానంగా ఒకే. .. ఆకృతిలో కట్టడాలను నిర్మించారు. తెల్లని రాతిని కట్టడానికి ఉపయోగించారు. ఆకాశంలో నుంచి చూస్తే 'పచ్చీస్' ఆట ఆకారంలో కనిపిస్తోంది.

వారసత్వ సంపద అవార్డు

1994 వరకు జైలును వినియోగించారు. ఆ తర్వాత టెరిటోరియల్ ఆర్మీ-125 ఇన్‌ఫాంట్రీ బెటాలియన్ శిక్షణ సంస్థ కొనసాగుతోంది. జైలు మధ్యభాగంలోని కోటపై నిత్యం ఎగిరే జాతీయ జెండాను సాయంత్రం కిందికి దించేందుకు, ఉదయం జెండా ఎగురవేసేందుకు ప్రతి రోజూ రెండు సార్లు పైకి సైనికులు ఎక్కుతారు. ఇక్కడినుంచి సైనిక ఆసుపత్రికి సొరంగం ఉంది. ప్రస్తుతం వినియోగంలో లేదు. 1997లో 'ఇంటాక్ సంస్థ' నుంచి వారసత్వ సంపద అవార్డు లభించింది.

అనుమతివ్వాలంటూ డిమాండ్

తిరుమలగిరి జైలును కనీసం ప్రత్యేక సందర్భాల్లోనైనా సందర్శించడానికి అనుమతి కోరుతూ అనేక మంది సికింద్రాబాద్ రక్షణ కార్యాలయాన్ని ఆశ్రయిస్తున్నారు. వీరిలో అధిక శాతం పాఠశాల విద్యార్థులు, పర్యాటకులు ఉన్నారు. కానీ అక్కడి అధికారులు మాత్రం వారి విన్నపాన్ని తిరస్కరిస్తున్నారు. గడిచిన ఆరు సంవత్సరాల నుంచి కంటోన్మెంట్‌లో అమలవుతున్న నిషేదాజ్ఞల నేపథ్యంలో జైలు సందర్శనకు అనుమతి ఇవ్వడం లేదని చెబుతున్నారు. జైలు నిర్వహణ సైనిక అధికారులనే సంప్రదించి అనుమతి కోరవచ్చని తెలిపారు. మ్యూజియంగా మార్చాలంటే మాత్రం కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని రక్షణ కార్యాలయం అధికారి వివరించారు.



తలపై నిప్పు... తలచలేదా ముప్పు!

బాచుపల్లి మండలం ప్రగతినగర్‌లోని ఖాళీ స్థలంలో ఓ గది నిర్మించాడు భవన నిర్మాణదారు. విద్యుత్తు నియంత్రిక కింది వరకు పైకప్పు వచ్చింది. గదిలో నివసిస్తున్న కుటుంబం దర్జీ పని చేస్తూ జీవిస్తోంది. వారు మాత్రం నియంత్రిక కింద ప్రమాదకరస్థితిలో ఉండాల్సి వస్తోంది. – నిజాంపేట

కుటుంబ సమస్యలతో ఆత్మహత్య

పార్కులో పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొన్న వ్యక్తి

నిజాంపేట: కుటుంబ సమస్యల నేపథ్యంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పటించుకొన్న ఓ వ్యక్తి గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. బాచుపల్లి సీఐ బాలకృష్ణారెడ్డి, ప్రత్యక్ష సాక్షులు, బాధితుడి బంధువుల కథనం ప్రకారం.. నిజాంపేట బండారి లేఅవుట్ కాలనీలోని రోడ్డు నెంబరు.6లో ఉన్న సాయికృష్ణా రెసిడెన్సీలో చుక్కా సాయిలు(56) కుటుంబం అద్దెకు ఉంటోంది. భార్య లక్ష్మితో పాటు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. పెద్దకుమార్తెకు వివాహం చేశారు. గతంలో వ్యాపారం చేసిన ఆయన అనారోగ్యాలతో బాధపడుతుండేవాడు. శనివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో కాలనీలోని రోడ్డు నెంబరు.4లో ఉన్న పార్కు సిమెంట్ బల్లపై కూర్చొని ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. మంటలు ఎగిసిపడుతున్నా కదలిక లేకుండా కూర్చున్న అతడిని గమనించిన స్థానికులు మంటలను ఆర్పివేశారు. గాంధీ ఆసుపత్రిలో సాయంత్రం మృతిచెందాడు. రెండు రోజులుగా కుటుంబంలో గొడవలు జరిగినట్లు తెలుస్తోంది. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

భర్త పుట్టిన రోజున భార్య అనుమానాస్పద మృతి

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: భర్త పుట్టిన రోజును బాగా చేయాలనుకుంది.. కేకు తెచ్చింది.. కానీ.. భర్త వద్దనడంతో ఇద్దరి మధ్య చిన్న గొడవ జరిగింది. అలిగిన భర్త తన భార్య కోపాన్ని తగ్గించేందుకు బయటకు వెళ్లాడు. పిల్లలు బయట ఆడుకుంటున్నారు. మనసు నొచ్చుకున్న ఆమె ఉరి వేసుకొని ప్రాణాలు విడిచింది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం హనుమాన్ జంక్షన్ ప్రాంతానికి చెందిన స్నేహలక్ష్మి(30)కి పిడుగురాళ్లకు చెందిన జి. శ్రీనివాసరావుతో వివాహమైంది. వారికి మోహన(4), అనన్య(1) పిల్లలున్నారు. శ్రీకృష్ణానగర్‌లో నివాసం ఉంటున్నారు. స్నేహలక్ష్మి.. క్యాపిటల్ ఐక్యూ అనే సంస్థలో ఆర్థిక విశ్లేషకురాలిగా పనిచేస్తున్నారు. శ్రీనివాసరావు వే2హెల్త్ అనే సంస్థలో పనిచేస్తున్నారు. స్నేహలక్ష్మి సోదరి నాగలక్ష్మి కూడా ఉద్యోగాన్వేషణకు వచ్చి వీరితోనే ఉంటోంది. శుక్రవారం శ్రీనివాసరావు జన్మదినం కావడంతో వేడుకలను చేయడానికి స్నేహలక్ష్మి సిద్ధమైంది. ఇందుకు ఆయన నిరాకరించారు. ఈ నేపథ్యంలోనే ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆమె ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. నాగలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రాత్రి ఆటో చోరీ.. ఉదయం సవారీ

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి తాగుడు కోసం చోరీల బాటపట్టాడు. రెండు రోజుల్లోనే ఓ ద్విచక్ర వాహనం, ఆటో చోరీ చేశారు. రాత్రి చోరీ చేసిన ఆటోను ఉదయం ప్రయాణికుల రవాణాకు వినియోగిస్తూ పోలీసులకు చిక్కిన సంఘటన మల్కాజిగిరి ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. సంఘటన వివరాలు డీఐ యాదయ్య కథనం ప్రకారం.. మౌలాలి షఫీనగర్‌లో నివసించే మహమ్మద్ ఇస్మాయిల్ (30) వాహన చోదకుడిగా పని చేస్తున్నాడు. కొంతకాలంగా మద్యం అలవాటుకు బానిసగా మారాడు. సంపాదన లేకపోవడంతో మద్యం కొనుగోలు కోసం డబ్బులు లేకపోవడంతో ఈ నెల 16వ తేదీన నాగారానికి చెందిన నాగాచారికి చెందిన ద్విచక్ర వాహనాన్ని పటేల్ నగర్ కల్లు కాంపౌండ్ వద్ద నుంచి చోరీ చేశారు. శుక్రవారం రాత్రి మౌలాలిలో బిర్యానికి తిని వెళ్తూ హోటల్ బయట నిలిపి ఉంచిన ఉప్పరిగూడకు చెందిన తులసీరామ్‌కు చెందిన ఆటోను చోరీ చేసి ఇస్మాయిల్ ఇంటికి తీసుకెళ్లాడు. దీంతో బాధితుడు తులసీరామ్ వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం కమిషనర్ దృష్టికి వెళ్లింది. వెంటనే ఆటో చోరీ చేసిన దొంగను పట్టుకోవాలని రాచకొండ సీపీ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఉదయం నుంచే ఆయా ప్రాంతాల్లో తనిఖీలు ప్రారంభించిన పోలీసులకు ఆటోలో ప్రయాణికులను తీసుకెళ్తూ ఇస్మాయిల్ కంట పడ్డాడు. దీంతో అనుమానంతో అతడిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించి. . ఆటో నంబరును పరిశీలించిన పోలీసులు అతడే ఆటో చోరీ చేసినట్లు గుర్తించారు. అతని వద్ద నుంచి ద్విచక్ర వాహనం, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి ఇస్మాయిల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.


స్వాధీనమైన వాహనాలు, నిందితునితో పోలీసులు

టెక్‌మహీంద్ర ఫౌండేషన్ ఉచిత ఉపాధి శిక్షణ

కాచిగూడ, న్యూస్‌టుడే: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని నిరుద్యోగులకు టెక్ మహీంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత ఉపాధి శిక్షణ ఇస్తున్నట్లు హెచ్‌సీహెచ్‌డబ్ల్యూ సంస్థ కో-ఆర్డినేటర్ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులు/అనుత్తీర్ణులైన 18 నుంచి 27 ఏళ్ల వయస్సు ఉన్న వారికి కంప్యూటర్, అంతర్జాలం అంశాలు, ఆంగ్లంలో భాషణం, ముఖాముఖి నైపుణ్యం తదితరాల్లో నాలుగు నెలల ఉచిత శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. బీకాం ఉత్తీర్ణులకు టాలీ ఈఆర్‌పీ 9, బేసిక్ అక్కౌంట్స్, అడ్వాన్స్‌డ్ ఎంఎస్-ఎక్సెల్, స్పోకెన్ ఇంగ్లిష్ వంటి కోర్సులలో శిక్షణతో పాటు ఉపాధి కల్పిస్తామన్నారు. ఈ నెల 22లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 7674985461, 040-65558777 ఫోన్లలో సంప్రదించాలని సూచించారు.


రద్దీ చేసిన పెద్దమనిషి

అసెంబ్లీ వైపు వెళ్తున్న కర్ణాటక బస్సును ఓ వ్యక్తి ఆపి.. అందులోని మహిళకు ఏదో వస్తువు ఇచ్చి.. ఫోన్ నంబరు రాసుకొని తాపీగా వెళ్లాడు. నడిరోడ్డుపై బస్సు ఆపడంతో వెనుకవైపు వందలాది వాహనాలు ఆగిపోవాల్సి వచ్చింది. ఈ కారణంగా చాలాసేపు రద్దీ కొనసాగింది.

మధ్యాహ్న భోజనంపై బండ

- గ్యాస్ లేక పాఠశాలల్లో నానాతంటాలు
- కట్టెలపై ఆధారపడి వండాల్సిన దుస్థితి
- గ్యాస్‌బండల సరఫరాపై నిబంధనల దెబ్బ

న్యూస్‌టుడే, షాబాద్



షాబాద్ మండలానికి చెందిన కొమరమ్మ.. పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండేందుకు గ్యాస్ సిలిండర్ లేకపోవటంతో కట్టెల పొయ్యిపై వంట చేస్తోంది. కొన్నిరోజులుగా వర్షాలు కురుస్తుండటంతో కట్టెలు తడిచి వంట చేయటానికి ఇబ్బందిగా ఉంది. మరోవైపు వంట చేసేందుకు అవసరమయ్యే ఎండు కట్టెలు క్వింటాలు రూ. 800గా ఉంటోంది. అవి కూడా నాలుగైదు రోజులకు మించి రావడం లేదు. అసలే చాలీచాలని భత్యం, కట్టెలతో వంట చేసి పెట్టడం మరింత భారంగా మారాయి.

- ఇలా కొమరమ్మ వంటి వారు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండి పెట్టేందుకు.. ఒక వైపు గ్యాస్ సౌకర్యం లేక మరోవైపు కట్టెల భారం మోయలేక తీవ్ర ఇక్కట్లకు లోనవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండిపెట్టేందుకు కొన్ని సంవత్సరాల క్రితం ప్రభుత్వం గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేసింది. వంట గ్యాస్‌పై ఇచ్చే రాయితీ 3:1 నిష్పత్తిలో భరించేవి. పాత రంగారెడ్డి జిల్లాలో 37 మండలాలు ఉండగా అందులో 2800 పాఠశాలలు ఉండగా వాటిలో 611 పాఠశాలలకు వంట గ్యాస్ సిలిండర్(గ్యాస్‌బండ)తో పాటు స్టవ్‌లను పంపిణీ చేసింది. అధికారికంగా ఆయా పాఠశాలల్లో గ్యాస్‌స్టవ్‌లపై వంట చేస్తున్నట్లు చూపిస్తున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి మరోలా ఉంది. గ్యాస్ సిలిండర్లు లేక వంట సాగడంలేదు. పాఠశాలకు వచ్చే గ్యాస్ సిలిండర్లను ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యా కమిటీ ఛైర్మన్లు పక్కదారి పట్టించి తమ ఇళ్లకు మళ్లించడమో.. అమ్ముకోవడమో చేసుస్తున్నార్న విమర్శలున్నాయి. ఉదాహరణకు చేవెళ్ల నియోజకవర్గ పరిధిలో 273 పాఠశాలలు ఉండగా వాటిలో 32 పాఠశాలలకు అప్పట్లో గ్యాస్ సౌకర్యం కల్పించారు. ప్రస్తుతం ఆయా ఏ ఒక్క దానిలోనూ గ్యాస్ స్టవ్ జాడ కనిపించటం లేదు. వంటచెరుకునే ఉపయోగిస్తున్నారు.

అదనపు భారమే..!

రంగారెడ్డి జిల్లాలో సుమారు 3000 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా అందులో సుమారుగా 8 లక్షల మంది విద్యార్థులు ఇందులో చదువుతున్నారు. ప్రతి 600 మంది విద్యార్థులకు వంట చేసేందుకు ఒక క్వింటా కట్టెలు అవసరం. జిల్లాలో 90 శాతం పాఠశాలల్లో వంట చేసేందుకు కట్టెల పొయ్యే ఆధారంగా ఉన్నాయి. ఈ లెక్కన ప్రతి రోజు 1200 క్వింటాళ్ల వంట చెరుకు అవసరం. నెలకు 25 రోజులు పాఠశాలలు పనిచేస్తే మొత్తం 30వేల క్వింటాళ్లు అంటే 3 వేల టన్నుల వంట చెరుకు అవసరం పడుతోంది. ఇంత కలప కావాలంటే వేల సంఖ్యలో చెట్లను నరకాలి. దీనివల్ల గ్రామాల్లో పచ్చని చెట్లపై వేటు పడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా హరితహారం కార్యక్రమం చేపట్టింది. లక్షలాది మొక్కలు నాటుతోంది. ఒక వైపు చెట్లను నరికివేయొద్దని, పర్యావరణాన్ని పరిరక్షిద్దామని చెబుతోంది. మరోవైపు మధ్యాహ్న భోజన పథకం కోసం ఉపయోగించే కలప కోసం చెట్లను ఎడాపెడా నరికివేయాల్సి వస్తోంది. దీంతో ప్రభుత్వం పాఠశాలలకు గ్యాస్ బండలు పంపిణీ చేస్తే పర్యావరణహితంగానూ ఉండే అవకాశం ఉంది.



ఆరుబయట వంట చేస్తున్న సిబ్బంది

భారంగా మారింది - తౌఫీఖ్, మధ్యాహ్న భోజన కార్మికుడు, షాబాద్



మధ్యాహ్న భోజనం వండేందుకు గ్యాస్ కనెక్షన్ లేకపోవటంతో కట్టెల పొయ్యిపై వంట చేస్తున్నాం. అధికారులకు గ్యాస్ కనెక్షన్ ఇప్పించాలని పలుమార్లు విన్నవించినా ఫలితం లేదు. వర్షాకాలంలో వంట చేసేందుకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. కట్టెల ధరలు అధికంగా ఉండటంతో ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

కట్టెలతో ఇబ్బందులే

వర్షాకాలంలో కట్టెలతో వంట చేసేవారు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. చాలా వరకు పాఠశాలల్లో వంటగదులు లేకపోవటంతో ఆరుబయట చెట్ల కింద లేదంటే పాఠశాల పక్కనే, ఉన్న అదనపు గదులలో వంట చేస్తున్నారు. వంట చేసేటప్పుడు వచ్చే పొగ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కళ్ల నీరు తెప్పిస్తోంది. మరో వైపు పచ్చి కట్టెల కారణంగా భోజనం సరిగ్గా ఉడకక, ఉడకని ఆహారమే విద్యార్థులకు వడ్డిస్తున్నారు.

ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలి

జిల్లా పౌరసరఫరాల అధికారి గౌరీశంకర్

పాఠశాలలకు వంట గ్యాస్ సిలిండర్లు అవసరం. ఈ విషయంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి. గతంలో ఇచ్చిన పాఠశాలలకు సంవత్సరానికి 12 సిలిండర్లు తీసుకునే అవకాశం ఉంది. ఎక్కువ సిలిండర్లు కావాలంటే రాయితీ లేకుండా పంపిణీ జరుగుతోంది.



ప్రదర్శనను తిలకిస్తున్న అమర్ తదితరులు

ఆకట్టుకున్న ఛాయాచిత్ర ప్రదర్శన

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో 2017 ఉత్తమ వార్త ఛాయా చిత్రాల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ పోటీకి వచ్చిన ఫొటోల ప్రదర్శనను శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ప్రారంభించారు. ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) సెక్రటరీ జనరల్ దేవులపల్లి అమర్ ముఖ్య అతిథిగా హాజరై ఈ ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవులపల్లి అమర్ మాట్లాడుతూ.... ఫొటో జర్నలిజానికి దక్కాల్సిన గుర్తింపు, ప్రాధాన్యత దక్కడం లేదని పేర్కొన్నారు. తెలంగాణ ఫొటో జర్నలిస్టులకు ప్రోత్సాహం అందించేందుకు ప్రతీ ఏటా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ మాట్లాడుతూ... ఫొటోగ్రాఫర్‌లలో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఈ పోటీలు దోహదపడుతున్నాయని అభిప్రాయపడ్డారు. పోటీలకు 31 జిల్లాల నుంచి 101 ఎంట్రీలు వచ్చాయని తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షులు ఎ. గంగాధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫొటో జర్నలిస్టుల సంఘం ప్రధాన కార్యదర్శి కేఎన్ హరి, సీనియర్ ఫొటో జర్నలిస్టులు డి.రవీందర్‌రెడ్డి, కె.రవికాంత్‌రెడ్డి, సంఘం నేతలు కె.అనిల్‌కుమార్, వి.రామ్మూర్తి, వసంత్‌కుమార్, ఎం.శివకుమార్, హెచ్‌యూజే కార్యదర్శి ఎస్.శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.కోటి రద్దయిన పెద్దనోట్ల పట్టివేత

ఆరుగురు నిందితుల అరెస్టు..

కాచిగూడ, న్యూస్‌టుడే: రూ.కోటి రద్దయిన పెద్ద నోట్లను పట్టుకున్న సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ సంఘటనలో ఆరుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని, ఏడు చరవాణులను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం ప్రకారం.. హైదరాబాద్ నగరంలోని బర్కత్‌పుర పాలెం టవర్స్‌లో నివసించే వ్యాపారి రాజ్‌కుమార్ బగాడియా (51) వద్ద రూ.కోటి రద్దయిన నోట్లు ఉన్నాయి. పాతబస్తీ తలాబ్‌కట్టకు చెందిన అహమ్మద్ బిన్ అలీ (30), బహదూర్‌పురకు చెందిన మహమ్మద్ సల్మాన్ (28), చార్మినార్‌కు చెందిన మహమ్మద్ షబ్బీర్ (43), నేరెడ్‌మెట్‌కు చెందిన ఎండీ అహమ్మద్ షరీఫ్ (30), పి.రెడ్డిశేఖర్ (63) తదితర వ్యక్తులు ఒక ముఠాగా ఏర్పడి పాత నోట్లను తీసుకుని 30 శాతం కమిషన్‌తో వాటి స్థానంలో కొత్త నోట్లు ఇస్తున్నారు. ఇందులో భాగంగా రాజ్‌కుమార్ బగాడియా వద్ద నుంచి రూ.కోటి పాత నోట్లు తీసుకుని రూ.70 లక్షల కొత్త నోట్లు ఇస్తామని ఈ ముఠా ఒప్పందం చేసుకుంది. ఈ నేపథ్యంలో ఈ ముఠా సభ్యులు పాత నోట్లు తీసుకెళ్లడానికి శనివారం బర్కత్‌పురలోని రాజ్‌కుమార్ బగాడియా ఇంటికి వస్తున్నారని మధ్య మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. రాజ్‌కుమార్ బగాడియాతో పాటు ముఠా సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.కోటి 1000, 500 పాత నోట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఎస్సై గిరి కేసును దర్యాప్తు చేస్తున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న రద్దయిన నోట్లు

విదేశీ విద్యనభ్యసించే బీసీ విద్యార్థులను ఆదుకోవాలి

మంత్రి జోగు రామన్నకు కాంగ్రెస్ నేతల వినతి



మంత్రి జోగు రామన్నకు వినతిపత్రమిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్బీనగర్, న్యూస్‌టుడే: విదేశీ చదువుల కోసం వెళ్లిన బీసీ విద్యార్థులను ఆదుకోవాలని ఎల్బీనగర్ మాజీ శాసనసభ్యుడు డి.సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు శనివారం మంత్రి జోగు రామన్నకు వినతి అందించారు. 2016-17 విద్యాసంవత్సరానికి గాను మహాత్మా జ్యోతిరావు పూలే విదేశీ విద్యానిధి పథకం కింద చదువుతున్న బీసీ విద్యార్థులకు రూ.20లక్షలను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఇంతవరకు ఏ ఒక్క విద్యార్థికీ నిధులు ఇవ్వకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వం ఇస్తుందన్న ఆశతో అప్పులు చేసి తమ పిల్లలను విదేశాలు పంపించిన తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని వివరించారు. బూటకపు మాటలు, కల్లబొల్లి హామీలతో బీసీ విద్యార్థుల పట్ల ప్రభుత్వం నిరంకుశ వైఖరి విడనాడాలన్నారు. విద్యార్థులకు నిధులు ఇవ్వకుంటే కాంగ్రెస్ తరఫున ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని పేర్కొన్నారు. నాయకులు భిక్షపతి యాదవ్, శ్రీశైలంగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు జాట్‌లు, గుజ్జర్ల తరహా పోరాటం

తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ సంఘాల హెచ్చరిక

గోల్నాక, న్యూస్‌టుడే: దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న తమ డిమాండ్ల సాధనకు జాట్‌లు, గుజ్జర్ల తరహా పోరాటాలు చేపడతామని తెలంగాణ ముదిరాజ్ సంఘం, ముదిరాజ్ సంక్షేమ సంఘాలు హెచ్చరించాయి. రాష్ట్రం జనాభాలో 14 శాతం ఉన్న ముదిరాజ్‌లలో 90 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువన మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాయి. ఈ నెల 20న నాంపల్లి తెలుగు విశ్వవిద్యాలయం, ఎన్టీఆర్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్న ముదిరాజ్‌ల రాష్ట్రస్థాయి సమావేశంలో చర్చించనున్న డిమాండ్ల కరపత్రాలను శనివారం అంబర్‌పేట జైస్వాల్ గార్డెన్‌లోని రాష్ట్ర కార్యాలయంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జగన్‌మోహన్ రావు ముదిరాజ్, ముదిరాజ్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టి యాదగిరి ముదిరాజ్ విడుదల చేశారు. ముదిరాజ్‌లను బీసీ 'ఎ' జాబితాలో చేర్చే అంశం ఏడుళ్లుగా సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉన్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదని అన్నారు. ఆర్డినెన్స్ ద్వారా ముదిరాజ్‌లను బీసీ 'ఎ' జాబితాలో చేర్చితే కొంత మందికైనా ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలోని అన్ని ముదిరాజ్ సంఘాలను ఐక్యం చేసి తమ డిమాండ్ల సాధనకు ఉద్యమిస్తామని ప్రకటించారు. నేతలు సతీశ్ ముదిరాజ్, మహేశ్ ముదిరాజ్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నర్సింహులు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



అంబర్‌పేట ఠాణా ముందు ఈనెల 15న ఈ లారీ డివైడర్‌ను ఢీకొని పాడై రోడ్డు మీదే ఉండిపోయింది. ఐదు రోజులవుతున్నా లారీని అక్కడి నుంచి తొలగించలేదు. దీంతో ఇతర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

నగరంలో ఈనాడు

- గచ్చిబౌలిలోని హైటెక్స్ ఎగ్జిబిషన్ కేంద్రం నుంచి ఉదయం 6 గంటలకు 'హైదరాబాద్ మారథాన్.. 10కే పరుగు'.
- బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 9.30 గంటలకు ప్రముఖ సాహితీవేత్త స్వర్గీయ చక్రవర్తి రంగస్వామి శత జయంతి ఉత్సవం.
- నాంపల్లి తెలుగువర్సిటీలో 10.30 గంటలకు తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ సంఘం ప్రతినిధుల సమావేశం.
- బర్కత్‌పురలోని సహకార భవన్‌లో 4 గంటలకు అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన్ (తెలుగు శాఖ) వార్షికోత్సవం- పురస్కారాల ప్రదానోత్సవం, 'అక్షర హారతి' పుస్తకావిష్కరణ.
- కింగ్‌కోఠిలోని భారతీయ విద్యాభవన్‌లో 5 గంటలకు వనవాసి కళాకారులతో సంగీత నృత్య, నాటక ప్రదర్శన.
- కోఠిలోని తెలుగు భాషా నిలయంలో 5.30 గంటలకు డాక్టర్ ముదిగొండ శివప్రసాద్‌కు 'డీఏఎల్ఎన్ మూర్తి' స్మారక పురస్కార ప్రదానోత్సవం.
- చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో 6 గంటలకు 'మహాత్ముల దివ్య భాషణములు' పుస్తకావిష్కరణ.
- ఖైరతాబాద్ ఆనందనగర్ కమ్యూనిటీహాల్‌లో 6 గంటలకు 'కర్ణాటక సంగీత కచేరీలు'
- నాంపల్లి తెలుగువర్సిటీలోని 6 గంటలకు అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి ఆధ్వర్యంలో మాలతీ చందూర్‌కు పురస్కార ప్రదానోత్సవం.